
'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 8.00 సంపుటి: 15 సంచిక: 183

SUNDAY Special

ఆదివారం 19-3-2023

SIMULTANEOUSLY PRINTED AT MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




వైజాగ్‌లో సిరీస్ సాధిస్తారా!

నేడు ఆస్ట్రేలియాతో భారత్ రెండో వన్డే. బరిలో రోహిత్. మ్యాచ్‌కు భారీ వర్షసూచన. మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో... - 10లో



వేద విద్యామణులు

వేదాలను అభ్యసించి యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తూ అపార పాండిత్యంతో ఔరా అనిపించుకుంటున్నారు రంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు అక్కాచెల్లెలు - 9లో




ఓర్వలేకే దేశంపై నిందలు..

భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బ్రిటన్లో కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ తూర్పారబట్టారు.
- వివరాలు 6లో



అమృత్‌పాల్‌సింగ్ అరెస్టు!

వివాదాస్పద ఖలిస్తాన్ వేర్పాటువాద నేత అమృత్‌పాల్‌సింగ్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.
- వివరాలు 6లో



సరిహద్దుల వద్ద ప్రమాదకర పరిస్థితి

తూర్పు లద్దాఖ్‌లో చైనాతో సరిహద్దుల వెంట ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు.
- వివరాలు 6లో



దేశంలో కరోనా కొత్త వేరియంట్

కోవిడ్–19 కొత్త వేరియంట్ ఎక్స్‌బీబీ.1.16 వైరస్‌ను గుర్తించినట్లు ఇండియన్ సార్స్–కోవ్–2 జెనోమిక్స్ కన్సార్షియం తెలిపింది.
- వివరాలు 6లో

బీజేపీ కుట్ర కోణం!

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై లోతుగా దర్యాప్తు జరపాలని డీజీపీని కోరాం: కేటీఆర్

- నిందితుడు బీజేపీ క్రియాశీల కార్యకర్త.. ఎన్నో ఫొటోలున్నాయి
- ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం కుట్ర అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడే అన్నారు
- ఇందులో క్రిమినల్ మోటివ్, కుట్ర అనుమానాలు
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర ఉందో లేదో శోధించాలి
- టీఎస్‌పీఎస్సీలో లోపాలను సరిదిద్ది కట్టుదిట్టం చేస్తాం
- ఈ వ్యవహారంలో వ్యవస్థ, సంస్థాగత తప్పిదాలు లేవు
- అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు
- సాధ్యమైనంత త్వరలో పరీక్షలుంటాయి.. యువత నిరాశకు గురికావద్దు
- ప్రశ్నపత్రాల లీకేజీపై సమావేశం అనంతరం మీడియాతో మంత్రి వెల్లడి
- విపక్షాలు పిల్లల జీవితాలతో ఆడుకోవడం సరికాదని వ్యాఖ్య



"టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై మాకూ ఓ అనుమానం ఉంది. ఈ కేసులో అనుమానితుడిగా, నిందితుడిగా అరెస్టయిన రాజశేఖర్ రెడ్డి బీజేపీ క్రియాశీల కార్యకర్త. అతడి వెనుక ఎవరైనా ఉన్నారా? ఏమైనా కుట్ర కోణం ఉందా? అన్న అంశాలను వెలికి తీయాలని బీఆర్ఎస్ తరఫున డీజీపీకి ఫిర్యాదు చేశాం. మా ప్రభుత్వం వరుసగా నోటిఫికేషన్లు ఇస్తుంటే.. ఇలా నోటిఫికేషన్లు ఇవ్వడం కుట్ర అని, యువతను బిజీగా ఉంచి తమ దగ్గరికి రానీయకుండా చేయడానికే నోటిఫికేషన్లు ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు (బండి సంజయ్) స్వయంగా అన్నారు. దీన్ని బట్టి అనుమానించాల్సి వస్తోంది..

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి రాష్ట్రంలోని యువత, నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సాధ్యమైనంత త్వరగా మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. ఈ లీకేజీ కేసులో నిందితుడు రాజశేఖర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో చాలా చురుకుగా బీజేపీ అనుకూలతను ప్రదర్శిస్తూ, ఆ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేశాడని.. ఇందుకు సంబంధించి ఎన్నో ఫొటోలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి వ్యక్తి ఉండటంతోనే అనుమానిస్తున్నామని.. ఈ కుట్ర కోణంలో దర్యాప్తు జరపాలని డీజీపీ, రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని కోరుతున్నామని చెప్పారు. ప్రశ్నపత్రాల లీకుల వెనక ఎవరున్నా.. వారు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏ పార్టీవారైనా మిగతా 2వ పేజీలో ▶

24 గంటలూ రీడింగ్ రూమ్‌లు.. ఉచిత భోజన వసతి

➔ రద్దయిన గ్రూప్–1, డీఏఓ, టీపీఓ, ఏఈఈ పరీక్షల కోచింగ్ మెటీరియల్‌ను రెండు, మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టడీ సర్కిళ్లను బలోపేతం చేస్తాం. జిల్లాల్లోని రీడింగ్ రూమ్‌లు ఇకపై 24 గంటలూ తెరిచి ఉంటాయి. అక్కడ అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా సీఎస్ నాయకత్వంలో కలెక్టర్లు శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఇంకా ఏమైనా నిర్దిష్ట డిమాండ్ వస్తే నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాం.

బీజేపీ నేతల హస్తముంటే.. అరెస్ట్ చేయడం లేదేం?

కేటీఆర్ తప్పిదం వల్ల లీకేజీ.. అందుకే బర్తరఫ్ చేయాలంటున్నాం: బండి సంజయ్

- పరీక్ష సరిగా నిర్వహించలేనోడు నా కామన్‌సెన్స్ గురించి మాట్లాడటమా?
- టీఎస్‌పీఎస్సీ రాజ్యాంగబద్ధ సంస్థ అయితే ఈడీ, సీబీఐ రాజ్యాంగబద్ధం కాదా?
- తప్పు లేనప్పుడు సిట్టింగ్ జడ్జి విచారణకు భయమెందుకని ప్రశ్న
- సీఎం ఆఫీసు నుంచే లీకేజీ తతంగం జరిగిందని సిద్దిపేటలో ఆరోపణలు
- కవితపై వ్యాఖ్యల అంశంలో మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చిన సంజయ్
- తెలంగాణ సామెతను ప్రస్తావించానే తప్ప తనకు మరో ఉద్దేశం లేదని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలో బీజేపీ నేతల హస్తం ఉంటే ఎందుకు అరెస్ట్ చేయడం లేదని మంత్రి కేటీఆర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. ''అధికారంలో ఉన్నది మీరే కదా? మేం అడుగు తున్నాం. సమాధానం చెప్పండి. పేపర్ లీకేజీలో ఐటీ శాఖ తప్పి దాలు ఉన్నాయి. అందుకే సంబంధిత మంత్రి అయిన కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం'' అని చెప్పారు. నిజంగా తప్పు చేయ కపోతే సిట్టింగ్ జడ్జితో ఎందుకు విచారణ జరిపించడం లేదని నిలదీశారు. కవితపై వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో బండి సంజయ్ శనివారం మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. బయటికి వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్ వ్యవహారంలో బీజేపీ హస్తముందంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. బండి సంజయ్ వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

''ఇతరులు తప్పు చేస్తే మెడపట్టి గెంటేసేవాళ్లు కదా. కేసీఆర్ కొడుకు తప్పు చేస్తే ఎందుకు బర్తరఫ్ చేయడం లేదు? మున్సిపల్, ఐటీశాఖల తప్పిదాలకు జనం బలైపోతుంటే మంత్రిపై చర్యలేవి? తప్పు చేయనప్పుడు సిట్టింగ్ జడ్జితో విచారణ ఎందుకు చేయించడం లేదు? రాజశేఖర్ బీజేపీ వ్యక్తే అయితే 13ఏళ్లుగా టీఎస్‌పీఎస్సీ ఏం చేస్తున్నట్టు?

ఎవరి నిర్వాకంతో పిల్లలు చనిపోయారు?

పరీక్ష సక్రమంగా నిర్వహించే తెలివిలేనోడు కామన్ సెన్స్ గురించి మాట్లాడుతున్నడు. ఎవరికి మిగతా 2వ పేజీలో ▶

'లీక్'పై రాజ్యాంగ పరిధిలో చర్యలు తీసుకోండి

గవర్నర్ తమిళిసైకు బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ విజ్ఞప్తి.. 3లో


న్యూస్‌రీల్

'ప్రశ్నపత్రం ప్రచురణ ఎక్కడనే పరిస్థితి దాపురించింది'



విద్యార్థులు గతంలో పరీక్షలంటే ఎలా చదవాలని అడిగే వారని.. ప్రస్తుతం ప్రశ్నపత్రం ప్రచురణ ఎక్కడ జరుగుతోందని అడిగే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించి పరోక్షంగా పోటీ పరీక్షల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు.
- వివరాలు 3లో

కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి: తరుణ్ ఛుగ్



కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అధికారంలోకి రాలేమన్న భయంతోనే కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.
- వివరాలు 2లో

లీకేజీలో కేటీఆర్ పీఏ..



- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణ
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్
- నేడు గాంధారిలో నిరుద్యోగ నిరసన దీక్ష
- 21న గవర్నర్ వద్దకు కాంగ్రెస్ నేతలు

2లో

టీఎస్‌పీఎస్సీ పరీక్షలన్నీ రీషెడ్యూల్?



- ఇంతకుముందే పలు పేపర్ల తేదీలు ప్రకటించిన కమిషన్
- రద్దు కారణంగా ఆరు పరీక్షలను తిరిగి నిర్వహించాల్సిన పరిస్థితి
- కొత్త ప్రశ్నపత్రాల తయారీకి కసరత్తు మొదలుపెట్టిన అధికారులు
- రూపకల్పన, వివిధ దశల్లో ఆమోదానికే 2 నెలల సమయం
- ఈ క్రమంలో దాదాపు అన్ని నోటిఫికేషన్ల షెడ్యూల్‌లో మార్పులు
- గ్రూప్–1 మెయిన్స్ అనివార్యంగా వాయిదా
- గ్రూప్–2, గ్రూప్–4 పరీక్షల తేదీలూ మారే అవకాశం

- 3లో



ఇంటిగ్రేటెడ్ ఫ్యామిలీ కోర్టుల ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ రామసుబ్రమణియన్. చిత్రంలో జస్టిస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్

కుటుంబ వివాదాలకు సత్వర పరిష్కారం

- న్యాయమూర్తులు మనసుతోనూ ఆలోచించాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్ సూచన
- హైదరాబాద్‌లో కుటుంబ వివాదాల సమీకృత కోర్టుల ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు సీజే

- 3లో



శనివారం నాగ్‌పూర్‌లో సీఆర్‌పీఎఫ్ డేర్‌డెవిల్ ప్రదర్శనలో భాగంగా బైక్‌లపై విన్యాసాలు ప్రదర్శించిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ మహిళా సిబ్బంది.

ఉద్యోగుల సమ్మెతో నిలిచిన సేవలు

- పాత పింఛను పద్ధతిని పునరుద్ధరించాలని కోరుతూ ఐదు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెతో సేవల రంగం స్తంభించిపోయింది. ప్రాంతీయ రవాణ కార్యాలయం(ఆర్టీఓ), ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా ఆర్టీఓలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, పర్మిట్ల జారీ, పన్ను చెల్లింపు తదితర పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా ముంబైలోని ప్రభుత్వ జే.జే.ఆస్పత్రిలో వైద్య సేవలు, ఆపరేషన్లు నిలిచిపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. - వివరాలు 7లో

శిందే వర్గంతో కలసే బీజేపీ పోటీ!

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గం, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వర్గం ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనేది సూచనప్రాయంగా ఓ అంగీకారానికి వచ్చామని, వచ్చే ఎన్నికల్లో శిందే వర్గంతో కలిసే పోటీచేయనున్నట్లు బీజేపీ ప్రదేశ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ భావన్‌కుళే వెల్లడించారు.

- వివరాలు 7లో



అరెస్టు వారెంట్ ఇచ్చినందుకు వాళ్ల మీద దాడి చేద్దామనడం కరెక్ట్ కాదేమో సార్!



హైదరాబాద్ ఈఎస్ఐ వద్ద శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జలమయమైన రోడ్లు..

వడగళ్లు.. ఈదురుగాలులు

రాష్ట్రవ్యాప్తంగా ముంచెత్తిన అకాల వర్షాలు

- ఖమ్మం జిల్లాలో విద్యుత్ తీగలు తెగి వృద్ధ దంపతుల మృతి
- పలు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం
- హైదరాబాద్‌లో సుమారు అరగంటపాటు కుండపోత
- కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావం
- నేడు పలుచోట్ల తేలికపాటి వర్షాలు..

- 5లో

అటకెక్కిన పంటల బీమా పథకాలు

ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం.. రైతులకు తీవ్ర నష్టం

జగిత్యాల అగ్రికల్చర్: ప్రతి ఏడాది జిల్లాలోని రైతులు అధిక వర్షాలు, బలమైన ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతున్నారు. అరుగాలం కష్టించి పండించిన పంటలు తమ కళ్ల ముందే ధ్వంసమై, కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. రైతన్నకు అండగా ఉంటామన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కనీసం పంటల బీమా పథకాలైనా ఆదుకుంటాయనుకుంటే అవి ఆటకెక్కాయి. దీంతో పంటనష్టపోయిన రైతులు తమ ఖర్మ అనుకుంటూ దేవుడిపై భారం వేస్తున్నారు.

నష్టపరిహారం ఇవ్వకుండా లేనిపోని నిబంధనలు..

పంటలకు నష్టం జరిగినప్పుడు ప్రభుత్వాలు పరిహారం అందించాలి. పరిహారం అందించే ప్రయత్నాలను ప్రభుత్వాలు ఎప్పుడో మర్చిపోయాయి. దీనికి తోడు, పంట నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టింది. దీంతో, 33శాతానికి పైగా పంట నష్టపరిహారం వాటిల్లితేనే వ్యవసాయాధికారులు నివేదికలు తయారుచేసే పరిస్థితి ఉంది. ఒకవేళ నివేదికలను అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు పంపించినప్పటికీ పరిహారం అందడం గగనంగానే మారింది. ఈ ఏడాది వానాకాలంలో అధిక వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నప్పటికీ, అధికారులు నివేదికలకే పరిమితం చేశారు. దీంతో ప్రభుత్వం నుంచి రూపాయి వచ్చిన పాపాన పోలేదు. మళ్లీ యాసంగి సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న, రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు నేలవాలి నష్టం వాటిల్లినప్పటికీ, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటనష్టం జరగలేదని అధికారులు నివేదికలు రూపొందించడం లేదు. చివరకు రైతులకు పరిహారం అందించడం ఏమో కానీ రాజకీయ నాయకుల పరామర్శలే ప్రాప్తంగా మారాయి.

అటకెక్కిన బీమా పథకాలు...

రైతులు వేసిన పంటలకు నష్టం జరిగినప్పుడు, పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు, గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రెండు పంటల బీమా పథకాలు అమలయ్యేవి. మొదటిది.. పంటల బీమా పథకం(ఫసల్‌బీమా యోజన), రెండోది.. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం. ఈ పథకాలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుండగా, మరికొంత రైతులు చెల్లించేవారు. ఈ పథకాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టినప్పటికీ, సరైన నిబంధనలు లేక రైతుల అభిమానాన్ని చూరగొనలేకపోయాయి.

పంటల బీమా పథకం రద్దు...

పంటలబీమా పథకంలో భాగంగా.. పంట రుణం పొందిన రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్స్ సంస్థలకు చెల్లించేవి. కానీ పంటనష్టం జరిగినప్పటికీ రైతులకు పరిహారం చెల్లించడంలో ఇన్సూరెన్స్ సంస్థలు మీనమేషాలు వేశాయి. దీనికి తోడు, పంట నష్టపోయిన రైతులను యూనిట్‌గా కాకుండా, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో, ఏ ఒక్క రైతుకు పంట నష్టపరిహారం రాలేదు. ఈ పథకంలో లోపాలున్నాయంటూ, ఈ పథకాన్ని రాష్ట్రప్రభుత్వం రద్దుచేసింది.

క్లుప్తంగా...

కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

వ్యతిరేకంగా మాట్లాడితే లాఠీచార్జి, అక్రమ కేసులు: తరుణ్‌ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ అన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అహంకార ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అధికారంలోకి రాలేమనే భయంతో కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ప్రజల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు రాజ్యాంగంపై ఏమాత్రం నమ్మకం లేదన్నారు. సీబీఐ, కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలతో పాటు రాజ్యాంగాన్ని సైతం గౌరవించడంలేదని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే కేసీఆర్ ప్రభుత్వం లాఠీచార్జీలు చేస్తూ, తప్పుడు కేసులు బనాయిస్తోందని ధ్వజమెత్తారు.

పోలీసు కస్టడీకి లీకేజ్ నిందితులు

6 రోజుల పాటు సిట్ విచారణ

చంచల్‌గూడ/హిమాయత్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలను విచారించేందుకు శనివారం సిట్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆరు రోజుల పాటు వీరిని విచారించనున్నారు. అంతకుముందు 9 మంది నిందితులను కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చారు. వారికి వైద్యులు కోవిడ్ పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలను నిర్వహించారు. అనంతరం పోలీసులు వీరిని హిమాయత్‌నగర్‌లోని సిట్ కార్యాలయానికి తరలించారు.

ఎన్‌ఐఏ కస్టడీకి ఉగ్రవాదులు

సైదాబాద్‌లో బాంబు పేలుళ్లకు ప్రయత్నించిన ఉగ్రవాదులను కూడా పోలీసు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ నలుగురు ఉగ్రవాదులు చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. ప్రధాన నిందితుడు అబ్దుల్ జాహిద్‌తో పాటు ముగ్గురిని 4 రోజుల పాటు విచారించేందుకు ఎన్‌ఐఏ కస్టడీకి తరలించారు.

లీకేజీ.. ప్రభుత్వ వైఫల్యమే..: రాణీరుద్రమ



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నందున ఐటీశాఖ మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు ఐటీశాఖ వారే కాబట్టి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, ఆయన చేయకుంటే.. కేటీఆర్‌ను సీఎం కేసీఆరే తప్పించాలని డిమాండ్ చేశారు. లీకేజీపై ప్రభుత్వం సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇరుక్కున్న కవితను కాపాడుకునేందుకు కేటీఆర్ ఢిల్లీలో మకాం వేశారని, స్కామ్ చేసిన చెల్లిపై ఉన్న ప్రేమ ఆయనకు నిరుద్యోగులపై లేదని ఎద్దేవా చేశారు. లీకేజీ నిందితుల్లో ఒకడైన రాజశేఖర్ బీజేపీకి చెందిన వాడంటున్నారని, అతడిని ఉద్యోగిగా తీసుకునే ముందు నేపథ్యమేమిటో పరిశీలించరా? అని ప్రశ్నించారు. లీకేజీ నెపాన్ని పార్టీలపై రుద్ది కేసును నీరుగార్చొద్దని, అలాచేస్తే తాము ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు.

'లీకేజీ'లకు నిరసనగా నేడు కాంగ్రెస్ ధర్నాలు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఆదివారం రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలకు పిలుపు నిచ్చింది. దీంతో పాటు రాష్ట్ర మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ శ్రేణులను కోరారు. 'రాష్ట్రంలో పాలన అధ్వాన్నంగా మారింది. ఉద్యోగాల భర్తీలో ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగడం లేదని దశాబ్దాల పాటు యువత పోరాటం చేశారు. జీవితాలను త్యాగం చేసి ఉద్యమిస్తే సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ కేసీఆర్, కేటీఆర్ పాలనలో తెలంగాణలో ఉద్యోగ నియామకాలు ప్రహసనంగా మారాయి. అవినీతికి పాల్పడి డబ్బులకు ఉద్యోగాలను అమ్ముకుంటున్నారు. తాజాగా టీఎస్‌పీఎస్సీ టౌన్ ప్లానింగ్ పరీక్ష పత్రాల లీక్ ఉదంతం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట'అని ఆయన దుయ్యబట్టారు. ఇంటర్ పరీక్ష పత్రాల లీక్, సింగరేణి పరీక్ష పత్రాలు లీక్, ఎస్సై, కానిస్టేబుల్స్ పరీక్షల్లో అవకతవకలు, గ్రూప్ 1 పత్రాలు లీక్ ... ఇలా అన్నింటా యువతకు నష్టం జరిగిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వతీరుపై నిరసన వ్యక్తం చేసేందుకు ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలన్నారు. కేటీఆర్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



గోదావరిఖనిల

- సాక్షి ప్రతినిధి, కరీంనగర్

సిన్మా సంబురం

'సిన్మా తీయాలంటే ఏ హైదరాబాద్‌కే పోకుండా.. గీ గోదావరిఖనిల తీసుడు ఎందుకే బావా?..'..
'ఏతులు గొట్టకుండా సింగిల్ లైన్‌లో ఒక్కటి చెప్పన్నారా?
గోదావరి ఖనిల సిన్మా తియ్యాల్నంటే 100 దళపతులు, 100 రక్తచరిత్రలు తీయొచ్చు..'

.. ఇటీవల గోదావరిఖని నేపథ్యంలో వచ్చిన 'కొత్త సినిమా' చిత్రం ట్రైలర్‌లోని సంభాషణలివి.. ఇవి కేవలం సినిమాలో డైలాగులు మాత్రమే కాదు. జరుగుతున్న వాస్తవం కూడా. ఒకప్పుడు కేవలం బొగ్గు వెలికితీతకు కేంద్రంగా మాత్రమే సింగరేణి పారిశ్రామిక ప్రాంతానికి గుర్తింపు ఉండేది. అడపాదడపా సినిమాల షూటింగులు జరిగినా.. కార్మిక హక్కుల కోసం తీసిన సినిమాల్లో ఒకట్రెండు సన్నివేశాలనే చిత్రీకరించారు. కాలక్రమంలో పరిస్థితి మారింది. నాలుగేళ్ల కింద గనుల నేపథ్యంలో విడుదలైన 'కేజీఎఫ్' సినిమా మంచి జనాదరణ దక్కించుకుంది. ఓపెన్ మైన్లలో పోరాట సన్నివేశాలు ఆ చిత్రానికి హైలైట్‌గా నిలిచాయి. అలాంటి సన్నివేశాలు, పోరాట దృశ్యాలు ఉండాలని కొందరు సినీహీరోలు, దర్శకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో గనులకు నిలయమైన గోదావరిఖనికి ఆదరణ పెరిగింది.

గోదావరి లోయలో సినిమా షూటింగ్‌ల సందడి

- పోరాట సన్నివేశాలకు అనుకూలంగా గనుల ప్రాంతం
- ఓపెన్ కాస్టుల్లో చిత్రీకరించేందుకు దర్శకుల ఆసక్తి
- 'సలార్, దసరా, ఓడెల రైల్వేస్టేషన్' వంటి సినిమాలతో పెరిగిన డిమాండ్
- గతంలోనూ ఇక్కడ పలు సినిమాల నిర్మాణం



ఓపెన్‌కాస్ట్‌లో దసరా సినిమా షూటింగ్

ఎన్నో ప్రత్యేకతలతో..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా) గోదావరి లోయను ఆనుకుని సింగరేణి పారిశ్రామిక ప్రాంతం ఉంది. విశాలమైన గోదావరి నది, దాని లోయను ఆనుకుని ఏర్పడిన సింగరేణి గనులు, ఎన్టీపీసీ, బొగ్గురవాణా కోసం ఏర్పాటైన ప్రత్యేక రైల్వే లైన్లు, రైల్వే బ్రిడ్జీలు, కన్వేయర్ బెల్టులు, 40 నుంచి 50 అడుగుల ఎత్తయిన భారీ డంపర్లు, క్రేన్లు ఇలా భారీ యంత్రాలు, హంగామా వంటివి ఇక్కడ కనిపిస్తాయి.

రెండు రకాల గనులతో..

ఇక్కడి గనుల్లో రెండు రకాలు ఉంటాయి. బొగ్గు నిక్షేపాలను గుర్తించిన కొత్తలో ఏటవాలుగా క్రమపద్ధతిలో లోపలికి తవ్వి బొగ్గు తీస్తే అది భూగర్భ మైనింగ్. నిల్వలు చివరిదశకు వచ్చాక పేలుళ్లతో మిగతా బొగ్గును వెలికితీసి, భారీ యంత్రాలతో తరలిస్తే ఓపెన్‌కాస్ట్ (ఉపరితల మైనింగ్). ఇవి వందల మీటర్ల లోతు వరకు ఉంటాయి. బొగ్గు కోసం నిత్యం జరిపే పేలుళ్లతో బొగ్గు పెళ్లలు వందల అడుగులు పైకెగిరి పడుతూ ఉంటాయి. ఆ బొగ్గును తరలించేందుకు భారీ క్రేన్లు, డంపర్లు ఉంటాయి. బయటి ప్రాంతాల వారికి ఇదంతా కొత్త ప్రపంచం. కేజీఎఫ్ సినిమా కూడా ఇలాంటి ఓపెన్ కాస్ట్ ఇనుప ఖనిజం గనుల్లో తీసిందే కావడం గమనార్హం.



సలార్ షూటింగ్ సన్నివేశం

మెల్లగా పెరుగుతున్న షూటింగ్‌లు..

భారీ యాక్షన్ సినిమాలకు ప్రాధాన్యం పెరుగుతున్న క్రమంలో సింగరేణి ఓపెన్ కాస్టుల్లో షూటింగులు పెరుగుతున్నాయి. ప్రభాస్ నటిస్తున్న 'సలార్' చిత్రంలోని పలు యాక్షన్ సన్నివేశాలను ఇటీవలే సెంటినరీ కాలనీ సమీపంలోని ఓపెన్‌కాస్టుల్లో షూట్ చేశారు. నాని నటించిన 'దసరా' సినిమా పూర్తిగా గోదావరిఖని పట్టణానికి ఆనుకుని ఉన్న 'వీర్లపల్లె' నేపథ్యంగా వచ్చినదే. ఆ చిత్రాన్ని కూడా ఓపెన్‌కాస్టు గనుల్లోనే చిత్రీకరించారు. ఇక జాతిరత్నాలు సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు అనుదీప్ తొలి చిత్రం 'పిట్టగోడ' కూడా గోదావరిఖని నేపథ్యంలో తీసినదే. ఇక ఇటీవల విడుదలైన క్రైం థ్రిల్లర్ 'ఓడెల రైల్వేస్టేషన్' సినిమాకు కూడా మంచి మార్కులే పడ్డాయి. తాజాగా 'సిరోంచ' పేరుతో తీసిన సినిమాను నేరుగా యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఆ సినిమా నచ్చినవారు దర్శకుడికి ఇప్పటికీ డబ్బులు పంపుతున్నారు. ఇవే కాకుండా 'కొత్త సినిమా' పేరుతో ఒక చిత్రం, మరికొన్ని సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకొంటున్నాయి. గతంలో ఆర్.నారాయణమూర్తి చీకటిసూర్యులు, రానా నటించిన లీడర్ వంటి సినిమాల్లోని పలు సీన్లను ఈ ప్రాంతంలోనే చిత్రీకరించారు.

సినిమా షూటింగ్‌లకు అనుకూలం



గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం సినిమా షూటింగ్‌లకు ఎంతగానో అనుకూలం. సలార్ సినిమా షూటింగ్ ఓసీపీ–2లో రెండువారాల పాటు సాగింది. భూగర్భగనులు, ఓసీపీలు, ఓబీ ప్రాంతాల్లో షూటింగ్‌లు చేయవచ్చు. సినిమాలతో పాటు టెలిఫిల్మ్‌లు, చిన్న సినిమాల చిత్రీకరణ జరుగుతోంది. స్థానిక కళాకారులను ప్రోత్సహించేందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధంగా ఉంది.

– కె.నారాయణ, ఆర్జీ–1 గని జనరల్ మేనేజర్

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈరోజు ప్రశ్న	ఎన్ని ఎడిషన్లు, ఎన్ని లక్షల చందాదారులతో సాక్షి ఆవిర్భవించింది?	ఎ) 25 ఎడిషన్లు-11 లక్షలు బి) 32 ఎడిషన్లు-10 లక్షలు సి) 23 ఎడిషన్లు-12 లక్షలు డి) 31 ఎడిషన్లు-14 లక్షలు

కవిత పిటిషన్‌పై మా వాదనలూ వినండి

సుప్రీంకోర్టులో ఈడీ కేవియట్ దాఖలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌లో తమ వాదనలు వినాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు శనివారం ఈడీ కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో తనపై ఈడీ తీవ్ర చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని ఇటీవల కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కవిత చేసిన అభ్యర్థనను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం తోసిపుచ్చింది. సుప్రీంకోర్టు ఈ కేసును ఈనెల 24న విచారించనుంది. మరోవైపు 20న ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కవితకు ఈడీ ఇప్పటికే సమన్లు జారీ చేసింది.

లీకేజీలో కేటీఆర్ పీఏ..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణ

- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్
- నేడు గాంధారిలో నిరుద్యోగ నిరసన దీక్ష



చిన్నమల్లారెడ్డిలో కూలిపోయిన తన ఇంటిని రేవంత్‌రెడ్డికి చూపుతున్న మహిళ

సాక్షి, కామారెడ్డి: టీఎస్‌పీఎస్సీ పరీక్షపత్రాల లీకేజీలో మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతికి భాగస్వామ్యం ఉందని, ఆయన ద్వారా సిరిసిల్ల జిల్లా మల్యాల మండలానికి చెందిన వందమందికి వందకుపైగా మార్కులు వచ్చినట్టు తమకు సమాచారం ఉందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం కామారెడ్డి జిల్లా రాజంపేట కార్నర్ మీటింగ్, కామారెడ్డిలో జరిగిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సీబీఐపై నమ్మకం లేకుంటే సిట్టింగ్ జడ్జి చేత ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లీకేజీలో మంత్రి కార్యాలయానికి సంబంధం ఉండటం వల్లే విచారణ జరగకుండా చూస్తున్నారని ఆరోపించారు. లీకేజీ వ్యవహారంలో తొమ్మిది మందిని అరెస్టు చేస్తే, కేటీఆర్ మాత్రం ఇద్దరే దొంగలన్నట్టు చెప్పడంలో మతలబేంటని ప్రశ్నించారు. ఆ ఇద్దరి గురించి కేటీఆర్, బండి సంజయ్ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారని, వీరి వ్యవహారం చూస్తుంటే నిరుద్యోగుల జీవితాలతో రెండు పార్టీలు కూడబలుక్కుని ఆడుకుంటున్నట్టుగా ఉందని ఆరోపించారు. ఐటీ మంత్రిగా తాను బాధ్యుడినెట్లా అవుతానని మంత్రి కేటీఆర్ అంటున్నారని, అలాంటప్పుడు ఏ హోదాలో దానిపై సమీక్ష చేశారో చెప్పాలన్నారు.

లీకేజీల్లో రికార్డులు

2015లో సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాల్లో ప్రశ్నపత్రాలు లీకైనందున ఒక కుటుంబంలో భార్య, భర్తకు, ఏబీసీడీలు రాని 30 మందికి కొలువులు వచ్చాయని రేవంత్ అన్నారు. గుర్గావ్ ప్రెస్‌లో ప్రశ్నపత్రాలు లీకయ్యాయంటూ 2016లో మెడిసిన్‌కు సంబంధించి ఎంసెట్ పరీక్ష రద్దు చేశారని, 2017లో సింగరేణిలో ఎలక్ట్రికల్, మెకానికల్ ఉద్యోగ పరీక్షపత్రాలు లీకయ్యాయన్నారు. 2022 లో సదరన్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాల ప్రశ్నపత్రాలు బయటపడ్డాయని, పోలీసు రిక్రూట్‌మెంట్ గందరగోళంగా తయారై వేలాదిమంది యువత ఇబ్బందులు పడ్డారన్నారు. పేపర్ లీకేజీపై ఈ నెల 21న కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలంతా గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు.

నేడు నిరుద్యోగ నిరసన దీక్ష...

ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై విచారణ కోరుతూ ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండల కేంద్రంలో నిరుద్యోగ నిరసన దీక్ష చేపడుతున్నట్టు రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంతకాలం 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేశామని గొప్పగా చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు టీఎస్‌పీఎస్సీ పత్రాలు లీకేజీ కావడంతో 37 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తనకు తానే బయటపెట్టిందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలో చిన్నచేపలను బలి చేసి, చైర్మన్, బోర్డు మెంబర్లు, సీఎం కేసీఆర్, కేటీఆర్ తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు.

పీవీ కృషితోనే ఆర్థికంగా దేశం బలోపేతం

'ది క్వింటెస్సెన్షియల్ రెబల్' పుస్తకం ఆవిష్కరణలో సుప్రీం న్యాయమూర్తులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ పీఎస్ నరసింహ, రిటైర్డ్ జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు, కృష్ణారావు తదితరులు

బంజారాహిల్స్: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితంలోని పలు అంశాలతో ప్రముఖ జర్నలిస్టు కృష్ణారావు రచించిన 'ది క్వింటెస్సెన్షియల్ రెబల్' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ పీఎస్ నరసింహ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడంతోపాటు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని కష్టాల నుంచి గట్టెక్కించడంలో పీవీ నరసింహారావు కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుత దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. జస్టిస్ ఎల్.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పీవీ పాలనలో తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టంగా నిలపడంలో దోహదపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో నల్సార్ వర్సిటీ వీసీ కృష్ణదేవరావు, ప్రముఖ పాత్రికేయుడు వెంకట్‌నారాయణ్, శాస్త్రి, కేవీపీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కుట్ర కోణం!



బీఆర్‌కేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు గంగుల, సబిత, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

▶ మొదటి పేజీ తరువాయి

వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు, భవిష్యత్తులో ఇలాంటివి మళ్లీ జరగకుండా అమలు చేయాల్సిన సంస్కరణలపై శనివారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, సీఎస్ శాంతి కుమారి, టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ అనితా రామచంద్రన్ తదితరులతో మంత్రి కేటీఆర్ సమావేశమై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పిల్లలకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వడమే కుట్ర అనే ధోరణిలో మాట్లాడిన వ్యక్తి (బండి సంజయ్) పార్టీకి సంబంధించిన వ్యక్తి ఏ2గా దొరకడం చూస్తే ఇందులో కుట్రకోణం ఏమైనా ఉందా? ప్రభుత్వాన్ని బద్నాం చేసి యువతలో లేని పోని అనుమానాలు కలిగించే విధంగా నిందలు వేసి అప్రతిష్టపాలు చేయాలని కుట్ర ఉందా? అన్నది శోధించాలని డీజీపీని కోరుతున్నాం.

ఇది వ్యవస్థ వైఫల్యం కాదు..

టీఎస్‌పీఎస్సీలోని ఇద్దరు వ్యక్తులు చేసిన ఒక తప్పుతో మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. దీనిని నివారించి ఉండాల్సింది. రాష్ట్ర యువతలో భరోసా నింపాల్సిన బాధ్యత ఉందని భావించి సీఎం కేసీఆర్ ఆదేశించడంతో ఈ సమావేశం నిర్వహించాం. గత 8 ఏళ్లలో దేశంలోని 28 రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా టీఎస్‌పీఎస్సీ అత్యధిక సంఖ్యలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ పూర్తి చేసింది. 155 నోటిఫికేషన్లు ఇచ్చి 37వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసింది. ఉమ్మడి ఏపీలో ఏదైనా పరీక్ష జరిగిందంటే ఏపీపీఎస్సీ మీద పుంఖానుపుంఖాలుగా ఆరోపణలు వచ్చేవి. టీఎస్‌పీఎస్సీ 37 వేల ఉద్యోగాలు భర్తీ చేసినా ఏ ఒక్క ఆరోపణ రాలేదు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో పక్షపాతం ఉండేదని ఆరోపణలున్న నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ ఇంటర్వ్యూల విధానాన్ని రద్దు చేసింది.

సంస్కరణలపై చర్చించాం..

ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులే కాదు.. వారి వెనకాల ఎవరున్నా నిష్పక్షపాతంగా సిట్ దర్యాప్తు పూర్తయిన తర్వాత చట్టపరంగా కఠినాతి కఠినంగా శిక్షించే బాధ్యత మాది. ఇది వ్యవస్థ వైఫల్యమో, సంస్థాగత వైఫల్యమో కాదు. కేవలం ఇద్దరు వ్యక్తులు చేసిన తప్పు. లక్షల మంది పిల్లలకు ఇబ్బంది ఎదురైంది. ఇలా మళ్లీ జరగకుండా చేయాల్సిన మార్పులు, సంస్కరణలపై సుదీర్ఘంగా చర్చించాం.

విపక్షాలు పిల్లల జీవితాలతో ఆడుకోవద్దు

లీకేజీ అంశాన్ని చిలువలు పలువలు చేసి ఇష్టమొచ్చినట్టు మాట్లాడి యువతలో అశాంతి, అసహనం చెలరేగేలా, ప్రభుత్వం మీద వ్యతిరేకత వచ్చేలా విపక్షాల నేతలు వ్యాఖ్యలు చేయడం సరికాదు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి ఉంది. రాజకీయ నిరుద్యోగులు, బేహారుల రెచ్చగొట్టే మాటలను నిరుద్యోగులు పట్టించుకోవద్దు. ఆరేడు నెలల్లో ఎన్నికలు ఉన్నాయి. కొందరు నేతలు ఎన్ని చిల్లర ప్రయత్నాలు, ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు ఏం చేయాలో అదే చేస్తారు.

మీరా మాకు నీతులు చెప్పేది?

కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి అక్కడ ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పోయేటట్టు చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని స్వయంగా ప్రధాన మంత్రి అన్నారు. ఎక్కడ పోయాయి ఆ ఉద్యోగాలు అని అడిగితే.. పకోడీలు వేయడం కూడా ఉద్యోగాలని అంటారు. అలాంటి మీరు (బీజేపీ నేతలు) వచ్చి ఉద్యోగాలపై మాకు చెప్తే చాలా దరిద్రంగా ఉంటుంది. చెప్పి మాటపడొద్దు.

యువత ఆందోళన చెందవద్దు

లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నాం. నిరుద్యోగ యువతకు సంబంధించి ఏవో కొన్ని వార్తలు (ఆత్మహత్యల వార్తలు) వస్తున్నాయి. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి వెంట ప్రభుత్వం ఉంది. నాలుగు పరీక్షలను రద్దుచేసిన నేపథ్యంలో ఆ అభ్యర్థులు మళ్లీ ఫీజులు కట్టాల్సిన అవసరం లేదు. పటిష్టమైన నివారణ చర్యలతో సాధ్యమైనంత త్వరగా పరీక్షలు నిర్వహిస్తాం. గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా మళ్లీ పరీక్ష రాసేందుకు అర్హులే. టీఎస్‌పీఎస్సీలో హ్యాకింగ్ జరగలేదని సిట్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

రాష్ట్రంలోని ప్రతి కంప్యూటర్‌కి నేనే బాధ్యుడినా?

రాజ్యాంగబద్ధమైన టీఎస్‌పీఎస్సీ రోజువారీ వ్యవహారాల్లో ప్రభుత్వం పాత్ర ఉండదు. ప్రభుత్వం తరఫున ఒక సెక్రటరీ మాత్రమే ఉంటారు. కానీ ఐటీ మంత్రిని బర్తరఫ్ చేయాలని ఒకరు అంటారు. రాష్ట్రంలోని ప్రతి కంప్యూటర్‌కు నేనే బాధ్యుడినా? ఇంటర్ బోర్డు, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లలో ఏం జరిగినా ఐటీ మంత్రిది తప్పు అంటారు. గుజరాత్‌లో 8 ఏళ్లలో 13 పేపర్లు లీకైతే అక్కడ ఎవరైనా మంత్రిని బర్తరఫ్ చేశారా? రాజీనామా చేశారా? మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణంలో నేరుగా సీఎం మీద ఆరోపణలు వస్తే ఆయన రాజీనామా చేశారా? అస్సాంలో మొన్న పోలీసు నియామకాల ప్రశ్నపత్రం లీకైతే ముఖ్యమంత్రి రాజీనామా చేశారా..'' అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కావొద్దు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి మహిళా కమిషన్ హెచ్చరిక
- ఎమ్మెల్సీ కవితనుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై విచారణ.. హాజరైన బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్ల చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళలపట్ల ఇలాంటి వ్యాఖ్యలు సరికావని, అనుచిత వ్యాఖ్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కవితనుద్దేశించి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై శనివారం మహిళా కమిషన్ విచారణ చేపట్టింది. దీనికి సంజయ్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు ఈ విచారణ సాగిందని, సంజయ్ లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారని తెలిసింది. ఈ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావని, అనుకోకుండా మాట్లాడిన మాటలని ఆయన కమిషన్‌కు తెలిపినట్లు సమాచారం. మహిళలపై సామెతలను ప్రయోగించొద్దంటూ సంజయ్‌ను కమిషన్ ఆదేశించినట్లు తెలిసింది. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి హెచ్చరించినట్లు సమాచారం. ఈ అంశంపై మహిళా కమిషన్ మరోసారి విచారించే అవకాశం ఉన్నట్లు కమిషన్ వర్గాల ద్వారా తెలిసింది.

..అరెస్ట్ చేయడం లేదేం?

▶ మొదటి పేజీ తరువాయి

కామన్ సెన్స్ ఉందో, ఎవరికి లేదో ప్రజలకు తెలుసు. ఎవరి నిర్వాకం వల్ల ఇంటర్ పిల్లలు చనిపోయారు? ధరణి వల్ల లక్షల మంది రైతులు ఎందుకు ఇబ్బంది పడుతున్నారు? తన (కేటీఆర్) శాఖ పరిధిలోనే కుక్కలు కరిచి పిల్లలు చనిపోతుంటే కనీసం పట్టించుకోనోడు, నాలాల్లో పడి జనం చస్తే పట్టించుకోనోడు, సిటీలో అగ్ని ప్రమాదాల్లో జనం చనిపోతున్నా పట్టించుకోకుండా, బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు.

ఈడీ, సీబీఐ రాజ్యాంగబద్ధ సంస్థలు కావా?

టీఎస్‌పీఎస్సీ రాజ్యాంగబద్ధ సంస్థ, ప్రభుత్వానికేం సంబంధమని కేటీఆర్ అంటున్నడు. మరి ఈడీ, సీబీఐ రాజ్యాంగబద్ధ సంస్థలు కావా? మీకు నచ్చితే, చెప్పినట్టు వినేవే రాజ్యాంగబద్ధ సంస్థలా? లేకుంటే బీజేపీ సంస్థలు అవుతాయా? 30లక్షల మంది జీవితాలను నాశనం చేసిన మీరు.. కనీసం వాళ్లకు భరోసా కల్పించే ప్రయత్నం చేయకుండా గాలికొదిలేసి లిక్కర్ క్వీన్‌ను కాపాడుకునేందుకు ఢిల్లీకి పోయి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నరు..''

సీఎం ఆఫీసు నుంచే లీకేజీ తతంగం: సంజయ్

సిద్దిపేట జోన్: సీఎంఓ కార్యాలయంలో రిటైర్డ్ అధికారికి టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో సంబంధం ఉందని, లీకేజీ తతంగం అంతా సీఎం ఆఫీసు నుంచే జరిగిందని బీజేపీ రాష్ట్ర చీఫ్ బండి సంజయ్ ఆరోపించారు. సదరు అధికారికి గతంలో సింగరేణి పేపర్ లీకేజీతో కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. లీక్ వెనుక అసలు వ్యక్తుల వివరాలు బయటపెట్టాలని, దీనిపై తక్షణమే సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. శనివారం రాత్రి సిద్దిపేటలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడారు. లీకేజీ వ్యవహారంపై ప్రభుత్వం నిరుద్యోగులకు క్షమాపణ చెప్పి, రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై సీఎం కేసీఆర్ స్పందించాలన్నారు.



మహిళా కమిషన్ కార్యాలయం వద్ద సంజయ్

తెలంగాణ సామెతనే ప్రస్తావించా..

కవితను ఉద్దేశించి తెలంగాణ సామెత ప్రస్తావించానే తప్ప నాకు మరే ఉద్దేశమేదీ లేదు. మహిళా కమిషన్ నాపై సీరియస్ అయిందంటూ మీడియాలో, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవం. లీకుల పేరుతో ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదు. మహిళా కమిషన్ లీక్ ఇచ్చినట్టు నేను భావించడం లేదు. కానీ ఈ ప్రచారంపై మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలి. ప్రజల్లోకి మంచి సంకేతాలు వెళతాయనే ఉద్దేశంతోనే మహిళా కమిషన్ పిలవగానే హాజరై సమాధానమిచ్చా.

– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

క్లుప్తంగా...

21న గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ భేటీ



సాక్షి, హైదరాబాద్: డివిజన్ల వారీగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణతో పాటు రాబోయే రోజుల్లో నిర్వహించాల్సిన పార్టీ కార్యకలాపాలపై చర్చించేందుకు ఈ నెల 21న గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో శనివారం కీలక సమావేశంజరిగింది. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, శాసన మండలిలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మితోపాటు పార్టీ సమన్వయకర్త దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ ముఖ్య నేతలు భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'లీడర్.. కేడర్.. కనెక్ట్' నినాదంతో ప్రజలతో మమేకం అవుతూ ఈ నెల 20 వరకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో హైదరాబాద్ అంతటా సంబురాలు నిర్వహించేందుకు ఈ భేటీలో కార్యాచరణ రూపొందిస్తారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ఏప్రిల్ 14న హైదరాబాద్ నగరమంతటా సంబురాలు నిర్వహించడంపై దిశా నిర్దేశం చేస్తారు. ఏప్రిల్ 30న రాష్ట్ర సచివాలయం ప్రారంభం నేపథ్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జన సమీకరణ ఏర్పాట్లపై చర్చిస్తారు. పార్టీ కార్యకలాపాల నిర్వహణపై 21న జరిగే బీఆర్ఎస్ సమావేశంలో తగు సూచనలు చేస్తామని శ్రవణ్ వెల్లడించారు.

ఎన్నికల నిర్వహణలో రోల్‌మోడల్‌గా భారత్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి



కవాడిగూడ (హైదరాబాద్): ఎన్నికల నిర్వహణలో మన దేశం రోల్ మోడల్‌గా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. దోమలగూడ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల ఆడిటోరియంలో కె.వి.రంగారెడ్డి లా కాలేజ్ ప్రిన్సిపల్ సెమినార్ కన్వీనర్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు–సమస్యలు సవాళ్లు' అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అభ్యర్థులు నిలబెట్టుకునేలా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజును సెలవు దినంగా ప్రకటిస్తే చాలా మంది ఓటర్లు ఎంజాయ్ చేస్తూ ఓటు వేయడం లేదని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న జస్టిస్ పి.ఎస్.నారాయణ మాట్లాడుతూ ఎన్నికల సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆర్.దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు, ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కచ్చితంగా అమలు చేయాలనే నిబంధనలుండాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం: లాల్‌సింగ్ ఆర్య



సాక్షి, హైదరాబాద్: ఎస్సీల వర్గీకరణకు తమ పార్టీ మొదటి నుంచీ కట్టుబడి ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య తెలిపారు. గతంలోనే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వర్గీకరణకు అనుకూలంగా రాజకీయ తీర్మానం కూడా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం మారుస్తామని సీఎం కేసీఆర్ అంబేడ్కర్‌ను అవమానించారని మండిపడ్డారు. కేసీఆర్ దళితులకు, అంబేడ్కర్‌కు, రాజ్యాంగానికి వ్యతిరేకి అని, అంబేడ్కర్ విగ్రహం పెట్టి దళితులను మోసం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు అంబేడ్కర్ జయంతి పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దళిత వాడలు, దళిత బస్తీలలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తామన్నారు.

కుటుంబ వివాదాలకు సత్వర పరిష్కారం

న్యాయమూర్తులు మనసుతోనూ ఆలోచించాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్ సూచన
- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే యత్నం చేయాలన్న ఇతర న్యాయమూర్తులు
- హైదరాబాద్‌లో కుటుంబ వివాదాల సమీకృత కోర్టుల ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు జడ్జీలు, హైకోర్టు సీజే



కుటుంబ వివాదాల సమీకృత కోర్టులను ప్రారంభిస్తున్న జస్టిస్ వి.రామసుబ్రమణియన్. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ నరసింహ

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక సమీకృత కోర్టుల ద్వారా కుటుంబ వివాదాల కేసులు త్వరగా పరిష్కారం అవుతాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ చెప్పారు. కొన్నికేసుల విచారణ సాగుతున్నప్పుడు కక్షిదారుల కంటే న్యాయవాదులే ఎక్కువ ఉత్సాహం చూపిస్తుంటారని, అది సరికాదన్నారు. ఆయన శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ పి.నవీన్‌రావులతో కలసి హైదరాబాద్‌లో కుటుంబ వివాదాల సమీకృత కోర్టుల సముదాయాన్ని ప్రారంభించారు. జస్టిస్ రామసుబ్రమణియన్ మాట్లాడుతూ''దేశంలో దాదాపు 11.4 లక్షల కుటుంబ వివాదాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబ వివాదాల ప్రత్యేక కోర్టులు లేని రాష్ట్రాల్లో వీటి సంఖ్య ఎక్కువగా ఉంది. కల్పవృక్షం మనం ఏది అడిగితే అది ఇస్తుంది. అలాగే కల్పతరువుగా పేరు పెట్టుకున్న ఈ కోర్టులు కూడా కక్షిదారులు విడాకులు, మధ్యవర్తిత్వం ఇలా వారు ఏది కోరితే అది ఇస్తుంది. కానీ ఏది కోరుకున్నా అది వారి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందని మరవద్దు. కుటుంబ వివాదాలు పిల్లల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతాయన్న విషయం పెద్దలు గుర్తించాలి. మనోవికాసం కక్షిదారులకు మాత్రమే కాదు. బుద్ధి సరిగా లేని వారందరికీ అవసరమే. న్యాయమూర్తులు, న్యాయవాదులు కేసులను చట్టాల ఆధారంగానే కాకుండా మనసుతో ఆలోచించి పరిష్కరించాలి''అని రామసుబ్రమణియన్ సూచించారు. ఇక ''తల్లిదండ్రుల వివాదాల కారణంగా పిల్లలు చిన్న వయసులో కుంగుబాటుకు గురవుతున్నారు. ఎంతోమంది కోర్టు తమ సమస్యలకు పరిష్కారం చూపుతుందని వస్తారు. తొలుత మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా వారి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయాలి''అని జస్టిస్ నరసింహ పేర్కొన్నారు. ''1970లోనే కుటుంబ వివాదాలకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. 1980 తర్వాత అది కార్యరూపం దాల్చి కోర్టుల ఏర్పాటు ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 535 ఫ్యామిలీ కోర్టులు ఉండగా, అందులో 16 మాత్రమే తెలంగాణలో ఉన్నాయి''అని జస్టిస్ సంజయ్‌కుమార్ వివరించారు.

కక్షిదారులకు ఉపయుక్తం
జస్టిస్ ఉజ్జల్ భూయాన్

''హైదరాబాద్‌లోని అన్ని ఫ్యామిలీ కోర్టులు ఒకే భవన సముదాయంలో ఉండటం కక్షిదారులకు ఉపయుక్తం. కోర్టులకు వచ్చే వారికి వాటిని చూడగానే సాధారణంగా వ్యతిరేక భావన కలుగుతుంది. అయితే మెడిటేషన్ రూం, ప్లే ఏరియా, మీడియేషన్ రూం ఇలా ఈ కోర్టును చూస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుంది''అని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చెప్పారు. దాదాపు 5,900 కేసులు ఈ కోర్టులకు బదిలీ కానున్నాయని జస్టిస్ నవీన్‌రావు వెల్లడించారు. కార్యక్రమంలో ఇతర హైకోర్టుల న్యాయమూర్తులతోపాటు అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రఘునాథ్, నల్సార్ యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణ దేవరావు, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



అగ్రి లీగల్ క్లినిక్ ప్రారంభోత్సవంలో న్యాయమూర్తులు తదితరులు

రైతులకు ఉచిత న్యాయ సేవలు

- రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లా బమ్మెరలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు
- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్/పాలకుర్తి టౌన్: రాష్ట్ర రైతులకు సాగుచట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, నల్సార్ యూనివర్సిటీ సాంకేతిక సహకారంతో మొదటిసారిగా 'అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్'ను శనివారం ప్రారంభించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెరలో ఏర్పాటు చేసిన తొలి అగ్రి క్లినిక్‌ను హైదరాబాద్ నుంచి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ పి.నవీన్‌రావు కలసి వర్చువల్‌గా ప్రారంభించారు. వ్యవసాయ విధానాలు వైవిధ్యాన్ని, ఆధునీకరణను సంతరించుకున్న తరుణంలో రైతులకు చట్టబద్ధంగా అందాల్సిన ఫలాలు, రైతు సాధికారతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ క్లినిక్‌లు పనిచేయనున్నట్టు వారు తెలిపారు. కాగా.. ప్రభుత్వం అనేక సాగుచట్టాలను రూపొందించినా రైతులకు అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనగామ జిల్లా కోర్టు జడ్జి బాల భాస్కర్ పేర్కొన్నారు. నకిలీ ఎరువులు, పురుగుమందులతో నష్టం వాటిల్లినపుడు, మార్కెట్‌లో మోసాలు జరిగినపుడు, పంటల బీమా అందనపుడు రైతులకు చట్టంతో అవసరం ఏర్పడుతుందని చెప్పారు. రైతులు అగ్రి క్లినిక్ ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేద పాఠశాలలతో ధర్మ పరిరక్షణ

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ నరసింహ

శామీర్‌పేట్: ధర్మ పరిరక్షణకు వేదపాఠశాలలు మూలమని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ నరసింహ అన్నారు. రూ.3 కోట్లతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన శ్రీ శంకర గురుకుల వేద పాఠశాల (ఎస్ఎస్‌జీవీపీ) తరగతి గదులు వేదభవన్స్‌ను శనివారం శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత సంస్కృతీ, సంప్రదాయాలకు నిదర్శనంగా వేద పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. వేదమంటేనే ధర్మమని, ధర్మపరిరక్షణకు వేదం అవసరమని, ప్రపంచానికి దారిచూపే దిశగా భారతదేశం అభివృద్ధి చెందుతోందని సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో వేదబోధన, ప్రాచీన భారతీయ కళలు, సంస్కృతిని ప్రోత్సహించడానికి 1984లో శ్రీ శంకర గురుకుల వేద పాఠశాల స్థాపించినట్లు వెల్లడించారు. వేదసదనం బ్లాక్ పేరుతో భవనాన్ని నిర్మించిన అరబిందో ఫార్మా ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో రక్షణ శాఖమంత్రి సలహాదారు జి.సతీశ్‌రెడ్డి, శ్రీ శంకర గురుకుల వేద పాఠశాల మేనేజింగ్ ట్రస్టీ వి.శ్రీరామ ఘనాపాఠి, అరబిందో ఫౌండేషన్ డైరెక్టర్ శివకుమారన్, అరబిందో ఫార్మా డైరెక్టర్ సదానందరెడ్డి పాల్గొన్నారు.

'లీక్'పై రాజ్యాంగ పరిధిలో చర్యలు తీసుకోండి

గవర్నర్ తమిళిసైకు బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ విజ్ఞప్తి

- రాజ్‌భవన్‌కు వెళ్లిన ఈటల రాజేందర్ నేతృత్వంలోని బృందం
- టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- నష్టపోయిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారమివ్వాలి
- ఈ దిశగా తగిన విధంగా స్పందించాలంటూ వినతిపత్రం



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈటల రాజేందర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కారకులు, దీని వెనుక ఉన్న వారిపై రాజ్యాంగపరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు బీజేపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని.. కమిషన్ చైర్మన్, సభ్యులను తొలగించి కొత్త బోర్డును నియమించే దిశలో తగిన విధంగా స్పందించాలని కోరింది. టీఎస్‌పీఎస్సీ అధికారుల కుమ్మక్కుతోనే ప్రశ్నపత్రాలు బయటికి వచ్చినట్టుగా అనుమానాలు ఉన్నాయని వివరించింది. ఈ మేరకు శనివారం బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ నేతృత్వంలో పేపర్ లీకేజీపై పార్టీ ఏర్పాటు చేసుకున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ కన్వీనర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్, సభ్యులు మాజీ ఐఏఎస్ చంద్రవదన్, మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ నేతలు ఎన్.రామచంద్రరావు, మర్రి శశిధర్‌రెడ్డి, బూరనర్సయ్యగౌడ్ తదితరులు రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే టీఎస్‌పీఎస్సీ పనిచేస్తున్నందున లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని.. ఐటీ సెక్యూరిటీ ప్రోటోకాల్స్ వైఫల్యంతో లీకేజీకి ఆస్కారం ఏర్పడినందున ఐటీ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని తమ డిమాండ్లలో పేర్కొన్నారు. వివిధ పరీక్షలు రాసి నష్టపోయిన నిరుద్యోగ యువతకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలన్నారు.

యువత బరిగీసి కొట్లాడాలి: ఈటల

పేపర్ లీకేజీ నేపథ్యంలో యువత మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని.. ధైర్యంగా బరిగీసి కొట్లాడాలని ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులపక్షాన బీజేపీ నిలుస్తుందని, అందరం కలసి ప్రభుత్వం మెడలు వంచుదామని పేర్కొన్నారు. రద్దయిన పరీక్షలను వెంటనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ విద్యార్థుల కళ్లలో మట్టికొట్టారని మండిపడ్డారు. రద్దయిన పరీక్షలు రాసిన ప్రతి విద్యార్థి మళ్లీ ప్రిపేర్ కావడానికి ప్రభుత్వమే రూ.లక్ష చొప్పున సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలన్నీ రీషెడ్యూల్?

- ఇంతకుముందే పలు పేపర్ల తేదీలు ప్రకటించిన కమిషన్
- రద్దు కారణంగా ఆరు పరీక్షలను తిరిగి నిర్వహించాల్సిన పరిస్థితి
- గ్రూప్–1 మెయిన్స్ అనివార్యంగా వాయిదా!
- గ్రూప్–2, గ్రూప్–4 పరీక్షల తేదీలూ మారే అవకాశం?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించనున్న ఉద్యోగ అర్హత పరీక్షల తేదీల్లో మార్పులు జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే జరిగిన నాలుగు పరీక్షలను రద్దు చేసిన కమిషన్.. మరో రెండు పరీక్షలను నిర్వహించకుండానే వాయిదా వేసింది. వీటితోపాటు వచ్చే నెలలో నిర్వహించే పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను కొత్తగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటన్నింటి క్రమంలో ఇప్పటికే నిర్దేశించిన తేదీల్లో ఉద్యోగ అర్హత పరీక్షల నిర్వహణ సాధ్యమయ్యే పరిస్థితి లేదని.. కొంత కాలం వాయిదా పడే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి. దీనిపై టీఎస్‌పీఎస్సీ నుంచి త్వరలోనే ప్రకటన వెలువడవచ్చని అంటున్నాయి.

కొత్త ప్రశ్నపత్రాల రూపకల్పన కోసం..

టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో పరీక్షల నిర్వహణ గందరగోళంగా మారింది. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీతోపాటు ఏఈఈ, డీఏఓ, ఏఈ అర్హత పరీక్షలను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. ఈ నెల 12న జరగాల్సిన టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్.. 15, 16 తేదీల్లో నిర్వహించాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలను వాయిదా వేసింది. ఈ ఆరు పరీక్షలను తిరిగి నిర్వహించాలి. మరో తొమ్మిది రకాల పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ప్రకటించింది. లీకేజీ, రద్దు, వాయిదాల క్రమంలో ప్రశ్నపత్రాలను కొత్తగా రూపొందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నిపుణులతో సంప్రదింపులు, కొత్త ప్రశ్నపత్రాల తయారీ, అందులో ఇప్పటికే రూపొందించిన ప్రశ్నపత్రాలతో సంబంధం లేకుండా ప్రశ్నల ఎంపిక, వివిధ దశల్లో ఆమోదం, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు వంటి కార్యాచరణ అవసరం. ఇదంతా పూర్తయ్యేందుకు దాదాపు రెండు నెలల సమయం పడుతుందని అంచనా. రద్దయిన పరీక్షలను ముందుగా నిర్వహించాలంటే.. ఇప్పటికే నిర్దేశించిన ఇతర పరీక్షల తేదీల్లో మార్పులు చేయాల్సి రానుంది. షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించాలని భావించినా.. రద్దయిన, వాయిదా పడిన పరీక్షలకు ఇబ్బంది వస్తుంది. ఈ నేపథ్యంలో ఉద్యోగ పరీక్షల షెడ్యూళ్లలో మార్పులు చేసి.. కొత్త తేదీలను ప్రకటించాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తున్నట్టు తెలిసింది. కానీ దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.

గ్రూప్–1 మెయిన్స్‌కు తప్పని వాయిదా!

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ.. ఈ ఏడాది జూన్ 11న తిరిగి నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన తర్వాత మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసి.. మెయిన్స్ పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రకటించిన గ్రూప్–1 మెయిన్స్ తేదీలు దాదాపు రద్దయినట్లేనని అధికారులు చెప్తున్నారు. ప్రిలిమ్స్ ఫలితాల తర్వాత మెయిన్స్ షెడ్యూల్ విడుదల అవుతుందని అంటున్నారు.

ఇప్పటికే ఉన్న షెడ్యూల్ మేరకు జరగాల్సిన పరీక్షలివీ..

పోస్టు	పరీక్ష తేదీ
హార్టికల్చర్ ఆఫీసర్	04.04.2023
ఏఎంవీఐ	23.04.2023
అగ్రికల్చర్ ఆఫీసర్	25.04.2023
డ్రగ్ ఇన్‌స్పెక్టర్	07.05.2023
లెక్చరర్స్(సాంకేతిక విద్య)	13.05.2023
లైబ్రేరియన్ (జేఐఈ, టీఈ)	17.05.2023
ఫిజికల్ డైరెక్టర్ (జేఐఈ, టీఈ)	17.05.2023
గ్రూప్-1 మెయిన్స్	05.06.2023 నుంచి 12.06.2023
గ్రూప్-4	01.07.2023
గ్రూప్-2	29.08.2023

లీకేజీకి కరీంనగర్‌తో లింకులు

- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో రాజశేఖర్ బంధువుల పాత్రపై అనుమానాలు
- బినామీలుగా ఆ 'ఇద్దరు'?
- మొత్తం నగదు రూపంలోనే జరిగిన లావాదేవీలు
- రాజశేఖర్‌కు హ్యాకింగ్ కోర్సు పరిజ్ఞానంపై సిట్ ఆరా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలో సూత్రధారిగా భావిస్తోన్న రాజశేఖర్‌రెడ్డిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా లీకేజీ, డబ్బుల వసూలు, లావాదేవీల్లో కీలకంగా వ్యవహరించారన్న ప్రచారంతో రాజశేఖర్‌రెడ్డి బంధువులపై సిట్ సభ్యులు దృష్టి సారించారు. జగిత్యాల జిల్లా తాటిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో నిపుణుడని గ్రామస్తులు తెలిపారు. అదే అర్హత మీద అతను ఆఫ్ఘనిస్తాన్ వెళ్లి కొంత కాలంపాటు అక్కడ పనిచేశాడు. తరువాత టీఎస్‌పీఎస్‌లో చేరాక అతని లైఫ్‌స్టైల్ మారిందని అంటున్నారు. ఈ మొత్తం వివరాలను సిట్ అధికారులు సేకరిస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్‌లో ఉన్న అతని బంధువుల వివరాలు, వారి కార్యకలాపాలపై తీగ లాగుతున్నారు.

బొమ్మకల్ వాసులే కీలకమా?

రాజశేఖర్‌రెడ్డికి కంప్యూటర్ హ్యాకింగ్ కోర్సుపై అవగాహన ఉండే ఉంటుందని, దాని ఆధారంగానే అతను ప్రశ్నపత్రాలు తస్కరించి ఉంటాడని భావిస్తున్న సిట్ బృందం అతని మిత్రుల ద్వారా ఈ విషయాన్ని నిర్ధారించుకునే పనిలో పడింది. రాజశేఖర్‌రెడ్డి గతంలో తన బంధువులు ఇద్దరికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పించాడని జరుగుతున్న ప్రచారంపై కూడా దృష్టి సారించారు. ఈ మొత్తం వ్యవహారంలో కరీంనగర్‌లోని బొమ్మకల్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రాజశేఖర్‌రెడ్డికి సహకరించారని తెలిసింది. వారిద్దరే లీకైన ప్రశ్నపత్రాలను కావాల్సిన వ్యక్తులకు అందజేయడం, వారి నుంచి డబ్బులు వసూలు చేయడం తదితర వ్యవహారాలను చక్కదిద్దేవారని సమాచారం. ఉద్యోగార్థుల నుంచి మొత్తం నగదు రూపంలోనే డబ్బులు తీసుకునే వారని, బ్యాంకులు, ఆన్‌లైన్ లావాదేవీలు అస్సలు అంగీకరించలేదని తెలిసింది.

ఆ అధికారి తన బంధువని చెప్పుకునే వాడు!

వీరిద్దరే రాజశేఖర్‌రెడ్డికి బినామీలు వ్యవహరించారని, జగిత్యాల జిల్లా కేంద్రంలోనూ వీరికి పలు ఆస్తులు ఉన్నాయని సమాచారం. అయితే, ఈ ఆస్తులు 2017 రాజశేఖర్‌రెడ్డి టీఎస్‌పీఎస్సీలో చేరిన తరువాత సంపాదించారా? ముందే సమకూర్చుకున్నారా? అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. రాజశేఖర్‌రెడ్డికి ఓ ఉన్నతాధికారితో దూరపు బంధుత్వం ఉందని, అతని సిఫారసుతోనే తను టీఎస్‌పీఎస్‌లో తాత్కాలిక పద్ధతిన కొలువు సాధించగలిగాడన్న ప్రచారం ఇక్కడ జోరుగా సాగుతోంది. ఆ అధికారిని పలుమార్లు తన బంధువుగా చెప్పుకున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు.

1,756 కేసుల పరిష్కారం

- ప్రత్యేక బ్యాంక్ లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- బ్యాంకర్లకు రూ.10 కోట్ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక బ్యాంక్ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఒకేరోజు 1,756 కేసులు పరిష్కారమయ్యాయి. బ్యాంకర్లకు రూ.10,26,16,702 కోట్ల రుణ బకాయిలు వసూలయ్యేలా కేసులు పరిష్కారమైనట్టు ఉత్తర్వులు జారీఅయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.నవీన్ రావు మార్గదర్శకాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అదాలత్ కార్యక్రమం జరిగింది. కక్షిదారులు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకున్నట్టు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశ్నపత్రం ప్రచురణ ఎక్కడనే పరిస్థితి దాపురించింది

జేఎన్టీయూహెచ్ 11వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై వ్యాఖ్యలు

- పరోక్షంగా పోటీ పరీక్షల లీకేజీ అంశం ప్రస్తావన
- సమాజానికి ఉపయోగపడని డిగ్రీలు వ్యర్థమే
- పద్మవిభూషణ్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



జేఎన్టీయూహెచ్ స్నాతకోత్సవంలో కస్తూరి రంగన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థులు గతంలో పరీక్షలంటే ఎలా చదవాలని అడిగే వారని.. ప్రస్తుతం ప్రశ్నపత్రం ప్రచురణ ఎక్కడ జరుగుతోందని అడిగే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర గవర్నర్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్సలర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించి పరోక్షంగా పోటీ పరీక్షల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు. పదేళ్ల కిందట మెడికల్ కళాశాలలో తాను విద్యార్థులకు క్లాస్ తీసుకుంటుండగా పరీక్షలు రాసేందుకు సర్వ సన్నద్ధమైన ఓ విద్యార్థి తనను ప్రశ్న పత్రాలు ఎక్కడ తయారవుతాయంటూ ప్రశ్నించడం ఆ నాడు జోక్‌గా ఉంటే ప్రస్తుతం అది వాస్తవరూపం దాల్చడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

జేఎన్టీయూహెచ్ 11వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీ ఆవరణలోని ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌డీ, ఎంటెక్, ఎం.ఫార్మ్, ఎంబీఏ, ఎంఎస్ఐటీ, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంఎస్, ఫార్మ్–డి, ఫార్మ్ డి (పీబీ), పీజీ డిప్లొమా, బీటెక్, ఇంటిగ్రేటెడ్ అండ్ ఎంటెయూ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలతో పాటు పతకాలను ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ గురువుల ద్వారా ఆర్జించిన జ్ఞానాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా సమాజ వికాసానికి పంచినప్పుడే సార్థకత లభిస్తుందన్నారు. సమాజానికి ఉపయోగపడని విద్యా డిగ్రీలు, పతకాలు ఎన్ని సాధించినా వ్యర్థమేనని వ్యాఖ్యానించారు. నిత్యం టెక్నాలజీతో సహజీవనం చేస్తున్న ప్రస్తుత రోజుల్లో ఆ సాంకేతికతను సన్మార్గంలో వినియోగించుకున్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇంటా, బయటా ఎన్నో సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. ఉద్యోగాలు వెతుక్కునే స్థితి వద్దని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో ఉండాలని పిలుపునిచ్చారు. ఎప్పుడూ కరెన్సీ మాత్రమే లెక్కబెట్టడం కాదని, కేలరీస్‌ను కూడా లెక్కించాలని పేర్కొంటూ ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేశారు. మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలని ఉద్బోధించారు.

పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్

శాస్త్ర సాంకేతిక సంస్థలు, అనేక ఉత్పత్తుల తయారీ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తోందని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్తాన్, ఎన్ఐటీ చాన్సలర్, పద్మవిభూషణ్ డాక్టర్ కృష్ణ స్వామి కస్తూరి రంగన్ అన్నారు. వ్యవసాయ, వైద్య, ఔషధ, పరిశోధనలకు కేంద్ర బిందువుగా నగరం మారిందన్నారు. జాతీయ అవసరాలకు మాత్రమే కాకుండా ప్రపంచ డిమాండ్లను కూడా నగరం తీరుస్తోందని చెప్పారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఇక్కడ ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటుచేసి కార్యకలాపాలను కొనసాగిస్తోందని ఆయన వెల్లడించారు. అండర్‌గ్రాడ్యుయేట్ విద్యలో వృత్తి విద్యను విలీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైబ్రిడ్ ఉద్యోగాల సంఖ్య పెరుగుతోందని, ఈ దిశగా విద్యా వ్యవస్థను సిద్ధం చేయడంతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. డాక్టర్ కృష్ణ స్వామి కస్తూరి రంగన్‌కు జేఎన్టీయూహెచ్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొ.కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్వప్నలోక్'ను పరిశీలించిన జేఎన్‌టీయూ నిపుణులు

రాంగోపాల్‌పేట్/కేపీహెచ్‌బీకాలనీ: అగ్ని ప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను శనివారం జేఎన్‌టీయూ హెచ్ఓడీ డీఎన్ కుమార్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎన్ కుమార్ మాట్లాడుతూ.. కాంప్లెక్స్ అయిదో అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగినప్పటికీ మంటల తీవ్రతతో నాలుగు, ఆరు అంతస్తులు కూడా దెబ్బ తిన్నాయన్నారు. బిల్డింగ్స్‌లోని కాలమ్స్, బీమ్స్, స్లాబ్ పరీక్షలు నిర్వహించిన అనంతరం నివేదిక ఇస్తామని చెప్పారు. అనంతరం భవనాన్ని కూల్చివేయాలా లేక మరమ్మతులు చేయాలా అనే విషయంపై స్పష్టత వస్తుందన్నారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు మరో రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు?..: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగిన అయిదో అంతస్తులోని కేడియా ఇన్ఫోటెక్, క్యూనెట్‌లకు చెందిన ముగ్గురిని మహంకాళి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. క్యూనెట్‌కు ఇండియాలో అనుబంధంగా కొనసాగుతున్న విహాన్ అనే సంస్థకు చెందిన భాను, శివలతో పాటు కేడియా ఇన్ఫోటెక్‌కు చెందిన యజమానికి కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. స్వప్నలోక్–సూర్యకిరణ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేషన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గత ఐదారేళ్ల నుంచి మెయింటెనెన్స్ చూస్తున్నా ఇప్పటి వరకు ఫైర్ సేఫ్టీ తర్వాత అత్యవసర ద్వారాలు మూసివేసినా పట్టించుకోకుండా ఉండటం, నిర్వహణ పూర్తిగా వదిలి వేయడంతో ప్రమాదం జరుగడానికి వీరు కూడా ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. త్వరలోనే విచారణ పూర్తి చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.



సంతోషముగా నుండుటకంటెను, తమ బ్రదుకును సుఖముగా వెళ్లబుచ్చుట కంటెను, శ్రేష్ఠమైనదేదియు నరులకు లేదని నేను తెలిసి కొంటిని. (ప్రసంగి ఉవాచ)

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ. ద్వాదశి ఉ.6.09 వరకు, తదుపరి త్రయోదశి రా.3.52 వరకు, **నక్షత్రం:** ధనిష్ఠ రా.8.54 వరకు తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.3.41 నుండి 5.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.19 వరకు, **అమృతఘడియలు:** ప.11.13 నుండి 12.42 వరకు.

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం : 6.06
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వరుణ్ గాంధీ (బీజేపీ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇంటి విషయాలు ఎవరైనా బయట ఎందుకు మాట్లాడతారు? ఇంటికి మానసికంగా దూరం అవడం వల్లా? లేక, బయట ఉన్నది కూడా తన ఇల్లే అని అనుకోవడం వల్లా? రాహుల్ విషయమైతే నేను స్పష్టంగా చెప్పగలను. ఆయనకు ఇరుగిల్లన్నది, పొరుగిల్లన్నది లేదు. అలాగే తన ఇల్లన్నది కూడా!

రాహుల్ కంటే నేను పదేళ్లు మాత్రమే చిన్నవాడిని అయినప్పటికీ ఆయనలోని విశ్వమానవ భావన ఎంచేతనో నాలో ఏర్పడి లేదు. ఇంటి విషయాలను నేను బయట మాట్లాడలేను. అందుకే.. ఆక్స్‌ఫర్డ్ నుంచి మ్యాథ్యూ డిక్ ఫోన్ చేసి, "మిస్టర్ గాంధీ.. 'మోదీ పాలనలో భారత ప్రజాస్వామ్యం..' అనే అంశంపై మీరొక అతిథి ప్రసంగం ఇవ్వాలని మేము కోరుకుంటున్నాం.." అని అన్నప్పుడు ఆ మాట నాకు.. "మీ ఇంటి విషయాలను తెలుసుకోగోరుతున్నాం.." అన్నట్లే ఉంది!

ఉదయం లేస్తే మనింట్లో ఎవరు ఎవరితో కొట్లాడుకుంటూ ఉంటారు, మన తగాదాల్లో ఎవరు ఎవరి జట్టులో చేరిపోతుంటారు అన్నవి చెప్పడానికి ఇంకొకరి ఇంటికి ప్రత్యేక ఆహ్వానంపై అతిథిగా వెళ్లడం ఏమిటి?!



"దిస్ ఈజ్ అన్‌ఫెయిర్.. డిక్.." అన్నాను నవ్వుతూ.

"కానీ మిస్టర్ గాంధీ.. మోదీ గురించి మాట్లాడ్డం మీకు అన్‌ఫెయిర్‌గా అనిపిస్తోం దంటే, మోదీలో ఫెయిర్ కానిదేదో ఉన్నట్లే కదా.." అన్నాడు డిక్ వినయంగా నవ్వుతూ.

డిక్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్. ఇటీవలే ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. ఆ ఉత్సాహపు వేడిలో కావచ్చు మోదీజీపై వ్యతిరేక ప్రసంగానికి నన్ను ఒప్పిం చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు.

"మిస్టర్ గాంధీ.. భారత రాజకీయాల్లో నిర్మోహమాటస్థులైన అన్నదమ్ములుగా ప్రపంచ విశ్వవిద్యాలయాలు మిమ్మల్ని, మీ సోదరుడు రాహుల్‌ను పరిగణిస్తుంటాయి. రాహుల్ ఈమధ్యే కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో మాట్లాడారు కనుక మీరు మా ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చి మాట్లాడితే కేంబ్రిడ్జ్‌కి, ఆక్స్‌ఫర్డ్‌కి పోటాపోటీ అన్నట్లు ఉంటుంది.." అన్నాడు! నవ్వొచ్చింది నాకు. పోటాపోటీ రెండు లండన్ యూనివర్సిటీలకా, ఇద్దరు ఇండియన్ బ్రదర్స్‌కా?!

"నేను మాట్లాడలేను మిస్టర్ డిక్. ఇంటి విషయాలు బయట మాట్లాడ్డం డిజానరబుల్ యాక్ట్ అవుతుంది" అన్నాను.

"బట్ మిస్టర్ గాంధీ.. అధికార పార్టీ ఎంపీ అయ్యుండీ మీరు మీ మోదీని ఎన్నిసార్లు బహిరంగంగా డిజానర్ చేయలేదు?! దేశంలో హిందువులు ముస్లింలు కుక్కలు–పిల్లుల్లా కొట్లాడుకుంటున్నారని అన్నారు. పార్ట్‌టర్మ్ అగ్నిపథ్ స్కీము యువతలో అసంతృప్తి జ్వాలల్ని రాజేస్తుందని అన్నారు. ఇందిరా గాంధీ విల్‌పవర్ ప్రపంచ పటాన్నే మార్చే సిందని అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయిని 'ఎ వైజ్ మ్యాన్', 'ఎ బిగ్ హార్టెడ్ లీడర్' అన్నారు. ఇవన్నీ కూడా మీరు మోదీకి వ్యతిరేకంగా అన్నవే కదా.." అన్నాడు డిక్!

"అవన్నీ నేను మీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి అతిథిగా వచ్చి ఏమీ అనలేదు కదా డిక్.." అని నవ్వాను. "పైగా అవేమీ మోదీజీకి వ్యతిరేకంగా అన్నవి కావు.." అని చెప్పాను.

"పోనీ, రాహుల్‌పై భారత పార్లమెంటులో ప్రస్తుతం జరుగుతున్న.." అంటూ ఇంకా ఏదో డిస్కస్ చేయబోయాడు డిక్!

"దయచేసి వినండి డిక్.. నేను ఆక్స్‌ఫర్డ్‌కి రాలేనని చెప్పాను కదా.." అన్నాను. డిక్ నుంచి మళ్లీ ఫోన్ రాలేదు.

భారత ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోం దని రాహుల్ లండన్‌లో వ్యాఖ్యలు చేయడం తప్పయితే.. ఆ వ్యాఖ్యలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని పార్లమెంటులో గత ఐదు రోజులుగా రాజ్‌నాథ్‌సింగ్, రవిశంకర్ ప్రసాద్, ప్రహ్లాద్ జోషి, కిరణ్ రిజిజు రచ్చ చేస్తూ సభల్ని నడవనివ్వకపోవడం కూడా తప్పే అవుతుంది.

పార్లమెంటు భవనంపై దాడి చేసిన వాళ్లను ఉగ్రవాదులు అంటున్నాం. మరి పార్లమెంటు లోపల చర్చా సమయంపై దాడి చేస్తున్నవాళ్లను ఏమనాలి?!

పబ్లిక్ పాలసీ – 'పట్టభద్ర'త



జనతంత్రం

వర్ధెల్లి మురళి

చేరవలసిన గమ్యం ఎంత దూరమున్నా, దారంతా గతుకు లున్నా, చీకటి ముసురుకొస్తున్నా, చేతిలో చిన్న దీపం లేకున్నా గుండెలో ధైర్యం ఉంటే చాలంటాడు కవి తిలక్. లోకరీతి పలుకు బడి గలవారి పక్షం వహిస్తున్నప్పుడు, సాంఘిక న్యాయం శాప గ్రస్తమైనప్పుడు న్యాయం పక్షాన నిలబడటానికి కూడా ధైర్యం కావాలి. అటువంటి ధైర్యం దారి చూపినప్పుడే చరిత్ర కూడా కొత్త మార్గాలను అనుసరిస్తుంది. లోకరీతిని సవరిస్తుంది. 'నేను యుద్ధం చేస్తున్నది పెత్తందార్లతో. నా ఎకనామిక్స్, నా పాలి టిక్స్ పేదవర్గాల ప్రజలకోసమ'ని ఏపీ అసెంబ్లీలో ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి విస్పష్టంగా ప్రకటించారు. సామాజిక న్యాయం కోసం చేసిన యుద్ధ ప్రకటన ఇది.

సరకులు, ఉత్పత్తి, మార్కెట్లు, లాభాలు, డిమాండ్, సప్లై వగైరాలు ముమ్మరించిన తర్వాత భూమి తన చుట్టూ తాను తిరుగుతూ డబ్బు చుట్టూ తిరగడం ప్రారంభించింది. తన చుట్టూ పరిభ్రమించే భూమ్మీద ఆట నియమావళిని అప్పటినుంచే డబ్బు రూపొందిస్తున్నది. ఎకనామిక్స్ పితామహుడుగా భావిస్తున్న ఆడమ్ స్మిత్ జన్మించి ఈ సంవత్సరానికి సరిగ్గా మూడొం దల యేళ్లయింది. ఎకనామిక్స్ వయసు కూడా ఇంచు మించు అంతే! ఆయన రాసిన 'జాతుల సంపద' అనే ఉద్గ్రంథం లేజేఫెయిర్ (స్వేచ్ఛా వాణిజ్యం) ఎకనామిక్స్ పాలిటి పవిత్ర గ్రంథం. ఈ పవిత్ర గ్రంథం వెలుగులోనే మన పెట్టు బడిదారీ ఆర్థిక వ్యవస్థ ఈనాటికీ కొన్ని మార్పు చేర్పులతో వెలుగు లీనుతున్నది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నిబంధనావళిని గతంలో చాలామంది సవాల్ చేశారు. కారల్ మార్క్స్ గురించి అందరికీ తెలిసిన విషయమే. ఎకనామిక్స్‌ను పేద ప్రజల పక్షాన పునర్నిర్మించడానికి ఆయన చేసిన ప్రయత్నాలు పెను సంచ లనాలకు కారణమయ్యాయి. అయినప్పటికీ ఆడమ్ స్మిత్‌ను మార్క్స్ పూర్తిగా ఓడించలేకపోయారు. కాలాను గుణమైన మార్పులతో ఆడమ్ స్మిత్ కొనసాగుతూనే ఉన్నాడు. అయినా వ్యవస్థలో సమానత్వం కోసం సాగు తున్న పోరాటాలు ఆగలేదు. 'మానవ చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే' అని మార్క్స్ ప్రకటించినట్లుగానే, సమా నత్వం కోసం జరిగే పోరాటాల చరిత్రగా థామస్ పికెటీ అభివర్ణిస్తున్నారు. ఈయన ఫ్రెంచి ఆర్థికవేత్త.

చరిత్రలో జరిగిన యుద్ధాలు, విప్లవాలు, విధ్వంసం, వ్యవస్థల మార్పు వగైరా పరిణామాల్లోంచి కూడా క్రమంగా మానవ సమాజం సమానత్వం వైపు కొద్దికొద్దిగా పురోగమిం చిందని పికెటీ సూత్రీకరించారు. గతంతో పోలిస్తే లింగ, జాతి వివక్షలు కొంచెం తగ్గాయి. ఆర్థిక వనరుల పంపిణీ మెరుగైంది. మెజారిటీ ప్రజలకు విద్య, వైద్యం అందు బాటులోకి వస్తున్నది. పౌరులకు హక్కులు సంక్రమి స్తున్నాయి. ఈ మార్పులకు కారణమైన విద్య, వైద్య, సాంఘిక, ఆర్థిక, న్యాయ వగైరా వ్యవస్థలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారాసంపూర్ణ సమానత్వం వైపు పయనించవచ్చని ఈ తరహా ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. అంటే పేద, ధనిక, కుల, మత, లింగ ప్రాంత భేదాలు లేకుండా ప్రజలందరికీ సమానావ కాశాలు కల్పించడం, సమాన స్థాయిలో పోటీ పడగలిగేలా ప్రభుత్వ వ్యవస్థలు అం డగా నిలవడం ద్వారా సమానత్వ సాధన సులభ సాధ్య మవుతుందని వారి అభిప్రాయం.

ఆర్థికవేత్తలే కాదు, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొందరు రాజకీయ ప్రముఖులు కూడా ఇందుకోసం ప్రయత్నించిన ఉదాహరణలు లేకపోలేదు. భారతదేశంలో పరిమితమైన వనరులతో కూడిన ఒక రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ వ్యవస్థల దన్నుతో సమా నత్వ సాధనకు కృషి చేస్తున్న వారిలో అతి ముఖ్యమైన నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత విస్తృత స్థాయిలో సమానత్వ సాధనకు కృషి చేసి ఉండలేదు. నాణ్య మైన విద్య, మెరుగైన వైద్యం ఉచితంగా ప్రజలందరికీ అందుబాటులోకి తేవడానికి జగన్ ప్రభుత్వం చేపట్టిన బృ హత్తర కార్యక్రమం ఏ రాష్ట్రంలో ఇంత వరకు జరగలేదు. విత్తు నుంచి విపణి వరకు రైతును చేయి పట్టుకొని నడిపిం చే విస్తృతమైన రైతు భరోసా కార్యక్రమం చరిత్రలో ఇదే మొదటిసారి. వెనుకబడిన కులాలన్నింటికీ కార్పొరేషన్‌ల ఏర్పాట్ల ద్వారా ఆత్మగౌరవ ప్రకటన చేయించారు. దేవా లయ కమిటీలతోపాటు, అన్ని నామినేటెడ్ పదవుల్లో బల హీన వర్గాలకు, మహిళలకు సింహభాగం వాటా కల్పిం చారు. రాష్ట్ర మంత్రిమండలి నుంచి పెద్దల సభల వరకు అత్యధిక పదవులు బలహీనవర్గాలకు కేటాయించారు.

ఆర్థిక రంగంలో పేదల అనుకూల విప్లవాన్ని స్వయంగా ప్రభుత్వమే ప్రారంభించింది. బటన్ నొక్కడం ద్వారా లబ్ధి దారుల ఖాతాల్లోకి నేరుగా రెండు లక్షలకోట్ల రూపాయలను బదిలీ చేసింది. ప్రభుత్వ ఆసరాతో బలం పుంజుకున్న డ్వాక్రా సంఘాలు సకాలంలో అప్పులు చెల్లిస్తున్నందు వలన లక్ష కోట్ల రూపాయలకు పైగా వాటికి బ్యాంకుల రుణాలు లభించాయి. ఈ మొత్తం ఇంకా పెరుగుతూ వస్తున్నది. ఇక్కడే మూడు లక్షల కోట్ల రూపాయలు పేద వాడలను చుట్టేస్తూ ప్రవహిస్తున్న వైనం మన కళ్లకు కనబడుతున్నది.



గతంలో సంక్షేమం పేరుతో కేటా యించిన పద్దుల్లోంచి అవినీతి కమీషన్లు పోనూ మిగిలిన సొమ్ము మాత్రమే ఈ వాడల్లోకి బట్వాడా అయ్యేది. పేద మహి ళల పేర్ల మీద ఇంటి స్థలాలను కేటాయించి ఇళ్ల నిర్మాణం మరో హెర్క్యులస్ టాస్క్! ప్రభుత్వం తలపెట్టిన 30 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే కనీస పక్షం ఒక్కో ఇంటికి పది లక్షల చొప్పున మరో మూడు లక్షల కోట్ల ఆస్తి పేద మహిళల చేతిలో ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన మరో ప్రత్యేక శ్రద్ధ వలన దాదాపు లక్షకు పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కొత్తగా వచ్చి చేరాయి. పది లక్షలమందికి పైగా అదనంగా ఉపాధి దొరికింది. ఇందులో అత్యధికులు దిగువ మధ్యతరగతి వర్గ ప్రజలేనని ప్రత్యే కంగా చెప్పవలసిన అవ సరం లేదు. 'నాడు–నేడు' కింద చేపట్టిన విద్య–వైద్య సంస్థల పునరుజ్జీవనం గురించి, ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల నిర్మాణం గురించి వేలాది గ్రామీణ సెక్రటేరియట్‌లు, ఆర్బీకే కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. డీబీటీ కాకుండా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన లక్షల కోట్ల కిమ్మతు చేసే కార్యక్రమాల గురించి కూడా చర్వితచర్వణం అవసరం లేదు.

ప్రపంచంలోని తత్వవేత్తలెందరో స్వప్నించిన విధంగా, మన దేశ రాజ్యాంగ నిర్మాతలు అభిలషించిన విధంగా సంపూర్ణ సమానత్వానికి వేగంగా బాటలు వేయగల కార్యక్రమాలను వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. మెజారిటీ ప్రజలకు ఇది స్వాగతించదగిన కార్యక్రమమే కావచ్చు. కానీ పాతకాలపు వ్యవస్థలో ప్రయోజనం పొందుతున్న పెత్తందారీ వర్గాలకు ఇది కంటగింపు కలిగించే కార్యక్రమమే. అందుకే ఈ వర్గాలు కత్తిగట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం మినహా మిగిలిన అన్నిరకాల పబ్లిక్ సంస్థలపై, వ్యవస్థలపై ఈ పెత్తందార్ల పట్టు ఇంకా కొనసాగుతూనే ఉన్నది. తిమ్మిని బమ్మిగా, బమ్మిని తిమ్మిగా చూపెట్టగల సామర్థ్యం ఇంకా ఈ వర్గాలకు ఉన్నది. తాము చెప్పిందే న్యాయంగా, తాము చెప్పిందే ధర్మంగా, తాము చెప్పిందే అభివృద్ధిగా ఒప్పించగల నైపుణ్యం ఇంకా పెత్తందార్లకు ఉన్నది. ఎందుకంటే ఇంతకాలం గేమ్ రూల్స్‌ను నిర్ణయిం చింది వీరే కనుక. మీడియా వీరి చేతిలో ఉన్నది. వ్యవస్థలు వీరి చేతిలో ఉన్నాయి. జగన్ ప్రభుత్వ సమానత్వ ఎజెండా వలన ప్రజలు సోమరిపోతులవుతున్నారని ప్రచారం మొదలు పెట్టింది. అభివృద్ధి ఆగిపోయిందనే భ్రాంతిని సృష్టి స్తున్నది.

జగన్ ప్రభుత్వ కార్యక్రమాల వలన ప్రత్యక్షంగా లబ్ధిపొందుతున్న అరవై నుంచి డెబ్బయ్ శాతం పేద వర్గాలకు పైనున్న వర్గాల్లో విషం చిమ్మే కార్యక్రమాన్ని చేపట్టింది. మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి శ్రేణుల మెదళ్లను కలుషితం చేస్తున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వో ద్యోగుల్లో కొందరు, ఉన్నత ప్రైవేట్ ఉద్యో గులు, వ్యాపార వర్గాలు ఈ శ్రేణుల్లోకి వస్తారు. పేద ప్రజలను పేదరికం నుంచి విముక్తి చేసి అభివృద్ధి పథం వైపు పయనింప జేయడంలో ముందువరసన నిలబడవలసిన వారు ప్రభుత్వోద్యోగులు. పేద ప్రజలూ – ప్రభుత్వోద్యోగులు శత్రు వర్గాలు కాదు. ప్రభుత్వోద్యోగుల్లో మెజారిటీ పేద వర్గాల నుంచి వచ్చిన వారే. రాజ్యాంగ లక్ష్యాల మేరకు పేదలకు అండగా నిలబడ వలసిన వారు కూడా ప్రభుత్వో ద్యోగులే. పేద ప్రజల ప్రయోజ నాలకు వ్యతిరేకంగా వీరిలో కొందరి మనసులను కలుషితం చేయడంలో పెత్తందార్లు విజయం సాధించడం ఒక విషాదం. రాష్ట్ర ప్రభుత్వ విధా నాలు పెత్తందార్లకు వ్యతిరేకం. తమకు వ్యతిరేకమైన ప్రభు త్వాన్ని ఉద్యోగ వ్యతిరేకిగా ఉద్యోగుల ముందు చిత్రించే ప్రయత్నం పెత్తందారీ వర్గం చేస్తున్నది.

పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి రాష్ట్ర శాసన మండలికి జరిగిన ఎన్నికల్లోనూ పెత్తందారీ వర్గం ఈ ప్రయత్నాలను యథేచ్ఛగా చేసింది. ఇంత చేసినా వారు ఆశిం చిన ప్రయోజనం నెరవేరిందా? నెరవేరిందని ఎల్లో మీడియా, కొందరు విశ్లేషకులు, జగన్ ప్రభుత్వ వ్యతిరేకులు ఢంకా భజాయిస్తు న్నారు. ఇదెంతవరకు వాస్తవం? గతంలో అధికారంలో ఉన్న పార్టీలు కూడా పట్ట భద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో గెలిచిన దృష్టాంతాలు చాలా తక్కువ. ఈ పరిణామం కొత్తది కాదు. ఈసారి రెండు స్థానాలను టీడీపీ గెలవడం, మూడో స్థానంలో గట్టి పోటీలో గట్టెక్కడం వెనుక ప్రత్యేక కారణాలు న్నాయి. ఒకటి – ఈ ఓటర్లలో అత్యధిక సంఖ్యలో ఉండే ప్రభుత్వోద్యోగులలో ప్రభుత్వ వ్యతిరేకత నింపడం, రెండు – ఈ నియోజకవర్గాల్లో సంప్రదాయకంగా బలంగా పోటీ పడే పీడీఎఫ్ (సీపీఎం అనుకూలురు) అభ్యర్థులు పేలవ మైన పోటీ ఇవ్వడం (తమ ఓట్లను గంపగుత్తగా టీడీపీకి బదిలీ చేయడం కారణం). మూడు – గతంలో ఉత్తరాంధ్రలో గెలిచిన బీజేపీ ఓట్లు కూడా టీడీపీకి బదిలీ చేయడం. నాలుగు – టీడీపీ తరఫున ఉత్తరాంధ్ర, తూర్పు రాయల సీమల నుంచి పోటీచేసిన అభ్యర్థులు ఓటర్లలో విస్తృత పరిచయాలు కలిగి ఉండడం, ఏడాది కాలంగా వారు ఓటర్ల నమోదు, ప్రచార కార్య క్రమాల్లో నిమగ్నమై ఉండటం. ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలు. ఇంకో ముఖ్య విషయమేమిటంటే ఈ మూడింటిలో ఒక్కటి మాత్రమే (పశ్చిమ రాయలసీమ) గతంలో వైసీపీ మద్దతుతో ఇండిపెం డెంట్ గెలిచిన సీటు. మిగిలిన రెండు సీట్లలో వైసీపీ ఎన్నడూ పోటీ చేయలేదు. ఆ ఒక్క సీటులోనూ తొలి లెక్కింపులో ఆధిక్యతను నిలబెట్టుకున్నది. రెండో లెక్కింపులో బీజేపీ – పీడీఎఫ్ ఓట్ల సాయంతో టీడీపీ గెలవగలిగింది.

ఇక ఈ మూడు సీట్లలో గెలుపుతో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచినట్టేనని ఎల్లో మీడియా ప్రచారాన్ని ప్రారంభించింది. మూడు పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో 108 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయనీ, వాట న్నింటిలో టీడీపీ గెలిచినట్టేనని 'ఈనాడు' గాలిమేడలు కట్టేసింది. గతంలో ఉత్తరాంధ్ర నుంచి జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా బీజేపీ – పీడీఎఫ్ అభ్యర్థులు పోటీ పడ్డారు. బీజేపీకి గానీ, సీపీఎంకు గానీ చెరో అసెంబ్లీ సీటు కూడా దక్కలేదు. చిత్తూరు నుంచి తూర్పు గోదావరి వరకు మూడు పట్టభద్రుల స్థానా లనూ పీడీఎఫ్ గెలిచింది. 'ఈనాడు' లెక్క ప్రకారం సీపీఎంకు ఎన్ని అసెంబ్లీ సీట్లు వచ్చి ఉండాలి? అరవై శాతం పేద వర్గాల్లో గణనీయమైన పలుకుబడితో ఉన్న వైసీపీ ప్రభావాన్ని తక్కువ చేసి చూపడం కోసం, కొంతమందిని ప్రభావితం చేయడం కోసం ఎల్లో మీడియా ప్రచారం ఉపయోగపడవచ్చేమో కానీ ఫలితాలను తారు మారు చేయగలంత బలమైన సీన్ ఈ సినిమాలో లేదు. కాకపోతే వరస విజయాలతో మత్తెక్కి ఉన్న వైసీపీ మత్తేభానికి పట్టభద్రులు సరైన సమయంలో వాతలు పెట్టినట్టు భావించాలి. ఆ మేరకు పట్టభద్రులకు వైసీపీ కృత జ్ఞతతో ఉండాలి.

vardhelli1959@gmail.com

నదీజలాలపై ఆధిపత్య దుర్నీతి

హిమాలయ పర్వత ప్రాంతాలలోని టిబెట్‌లో పుట్టిన బ్రహ్మ పుత్ర నదిని అక్కడ 'యర్లుంగ్ ఝంగ్బొ' అంటారు. అరుణా చల్‌ప్రదేశ్‌లో భారత్‌లో ప్రవేశించి అస్సాంలో ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే ముందు, బంగ్లాదేశ్‌లో ప్రవహిస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని భారత్ సరిహద్దుల సమీపంలో మిడాగ్ ప్రాంతంలో కొండవాగు కనుమలలో చైనా, సూపర్ జల విద్యుత్ కేంద్రం నిర్మిస్తున్న ఉపగ్రహ చిత్రాలు ఇటీవల ట్విట్టర్‌పై వెలుగు చూశాయి. నదిలో దిగువ ప్రవాహంలో ఉన్న ఇండియా, బంగ్లా దేశ్‌లు బ్రహ్మపుత్ర నదీ జలాల వినియోగం విష యంలో తమ ప్రయోజనాలకు భంగం కలుగకుండా వ్యవహరించాలని చైనాను హెచ్చరిస్తున్నా, చైనా పట్టించుకోవడం లేదు. ఇండియా, నేపాల్ సరిహద్దుల త్రిభుజ కూడలి 2021 మే నెలలో టిబెట్ బురంగ్ కంట్రీ ప్రాంతంలోని లోతైన కనుమలలో రిజర్వాయర్‌తో బండ్ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ఏడాది జనవరి 19న, 'డేమియన్ సైమన్' అనే జియో స్పాటియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుని ట్విట్టర్ ప్రొఫైల్ పోస్ట్‌ను భారతీయ పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. సెక్యూరిటీ వ్యవస్థ సం బంధిత సమాచారం ప్రకారం ఉత్తరాఖండ్ కాలాపానీ ప్రాంతంలో త్రికోణ కూడలి దగ్గరలో ఈ జలాశయ నిర్మాణం సాగుతోంది. టిబెట్‌లో ఈ నది, ఇండియాలో గంగా నదిలో కలిసే ముందు ఘాఘర నదిలోకి నేపాల్ మీదుగా ప్రవహిస్తోంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా ఘాఘర, కర్నాలి నదుల నీటి మట్టాలు క్షీణిస్తాయి. పైగా సరిహద్దుల సమీపంలో ఈ జలాశయ నిర్మాణం వలన వివాదాస్పద ప్రాంతాలలో చైనా ఆధిపత్యం చలాయిస్తుంది. త్రికోణ కూడలిలో చైనా మిలటరీ స్థావరం ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. 70 జీడబ్ల్యూ విద్యుత్ ఉత్పత్తి సాధించనున్న ఈ భారీ జల విద్యుత్ కేంద్రం... సరిహద్దు దురాక్రమణల నేపథ్యంలో ఉద్రిక్తత సృష్టించగలదు. చైనా, భారత్‌కు సృష్టించదలచిన కొత్త బెడద ఈ జల విద్యుత్ ప్రాజెక్టు.

బ్రహ్మపుత్ర నదీ జలాలలో 2021– 2025, 14వ పంచవర్ష ప్రణాళిక అమలులో భాగంగా చైనా నీటి దోపిడీకి యథేచ్ఛగా పాల్పడుతోంది.



2015లో టిబెట్‌లో 'ఝున్‌గ్ము' తొలి జల విద్యుత్ కేంద్రం తర్వాత డాగు, జైక్సు, జియాచ అప్పర్, మిడిల్ నదీ పరీవాహక ప్రవాహాలలో చేపట్టింది. చైనా ప్రభుత్వ హైడ్రో పవర్ కంపెనీ దిగువ నదీ ప్రవాహంలో కూడా నిర్మిస్తున్న ప్రాజెక్టుకు, టిబెట్ అటానమస్ రీజియన్ (టీఏఆర్)తో ఒప్పందం చేసుకొంది. 'మూడు త్రి గార్జెస్' భారీ విద్యుత్ కేంద్రాల సామ ర్థ్యం కంటే ఈ కొత్త విద్యుత్ కేంద్రం ఉత్పత్తి చేసే 60 మిలియన్ కెడబ్ల్యు హెచ్ జల విద్యుత్, 300 బిలియన్‌ల కెడబ్ల్యుహెచ్ స్వచ్ఛమైన, పునర్విని యోగ, జీరో కార్బన్ వార్షిక ఉత్పత్తి సాధించగలదని చైనా మాట.

బ్రహ్మపుత్ర నదీ ప్రవాహంలో అప్పర్, మిడిల్, డౌన్ రీచెస్‌లోని జల విద్యుత్ కేంద్రాలు నిస్సందేహంగా భారత్– చైనా దౌత్య సంబంధాలపై ప్రభావం చూపిస్తున్నాయి. మన దేశ సరిహద్దులలో ఉన్న అరుణా చల్‌ప్రదేశ్‌పై చైనా కన్ను పడింది. సిచుయన్ – టిబెట్ రైల్వే లైన్ నిర్మాణం రెండేళ్ల క్రితమే ప్రారంభమైంది. చైనా అధికార పత్రిక చైనా న్యూస్ ప్రకారం, అరుణా చల్‌ప్రదేశ్‌కు అత్యంత సమీపంలో ఉన్న 'లింఝి'కి రాకపోకలు ప్రారంభమవుతున్నాయి.

ప్రస్తుత దశాబ్దాలలో ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా, అమెరికా సామ్రాజ్యాధిపత్యాన్ని నిలదీస్తోంది. మూడో సారి 69 ఏళ్ల జిన్‌పింగ్ మళ్ళీ అధ్యక్షుడయ్యాడు. భూగోళం మొత్తానికి 'జియో పొలిటికల్ పెను ప్రమాదం' సృష్టించే రాజనీతి కమ్యూనిస్ట్ చైనా అనుసరిస్తోంది.

టిబెట్, తైవాన్, హాంగ్‌కాంగ్ తమ దేశ అంతర్గత సంఘర్షణలు, నినాదాలుగా చైనా నియంతృత్వ ధిక్కార స్వరంతో కుతంత్ర వ్యూహాలు అమలు చేస్తోంది. ఇక చైనాకు దలైలామా ఆగర్భశత్రువే. 60 ఏళ్ల నుంచి సరిహద్దు దురాక్రమణలకు పాల్పడుతూనే చైనా శాంతి మంత్రం జపిస్తోంది. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా 60 ట్రిలియన్ బ్యాం కింగ్ సంపన్నత సాధించి, ఒక దశాబ్దంలో 54 ట్రిలియన్ యూఎస్ (సుమారు 7.6 ట్రిలియన్ యూఎస్ డాలర్లు) నుంచి 114 ట్రిలియన్ యూఎస్ డీడీపీ పెరగడంతో 18.5 శాతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకొంది.

ప్రస్తుత ప్రపంచ రాజకీయ అగ్ర రాజ్య మేధావులు డ్రాగ న్‌కు ఏనుగుకు ముఖాముఖి ఊహిస్తున్నారు. డ్రాగన్ గాలిలోకి ఎగిరే భీకర జంతువే కానీ అది వాస్తవంగా లేని మిథ్యా మృగం. భూగోళంపై అతిపెద్ద జంతువైన ఏనుగు మృదు స్వభావి అయినా, ఆగ్రహం కలిగితే మిన్నూమన్ను ఏకం చేస్తుంది.

– జయసూర్య, సీనియర్ జర్నలిస్ట్

అప్పటి పెళ్లి సరదా వేడుకలు ఉన్నాయా?

అభిప్రాయం



వనం జ్వాలా నరసింహారావు

పెళ్లంటె ఎన్నో ఆచారాలు, సంప్ర దాయాలు, ఉద్వేగాలు, సరదాల సమ్మే ళనం. హిందూమత ప్రకారం జరిగే పెళ్లిలో ఒకప్పుడు కనిపించిన ఆచార సంప్రదాయాలు ఇప్పుడు పెద్దగా కనిపిం చడం లేదు. భవిష్యత్తులో ఇవి పూర్తిగా కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. హిందూ కుటుంబాల్లో పెళ్లిరోజుకు ఒక రోజు ముందర 'స్నాతకం' అనే ముఖ్య మైన కార్యక్రమం జరుపుకోవడం ఆచారం. పెళ్ళి కుమారుడి ఇంట్లో కానీ, కల్యాణ మండపంలో కానీ లేదా విడిది (ఆడ పెళ్ళివారు ఏర్పాటుచేసిన అతిథిగృహం)లో కానీ, పురోహితులు స్నాతక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. విఘ్నేశ్వర పూజతో మొదలుపెట్టి, అన్ని ప్రాయశ్చిత్తాల కోసం, శరీర శుద్ధి కోసం బ్రాహ్మణులు వరుడితో గోత్ర ప్రవరలు చేయిస్తారు. స్నాతకం అనే ఈ 'సంస్కారం', ప్రధానంగా, వరుడిని 'బ్రహ్మచర్యం' నుండి గురువు (ఇక్కడ పురోహితుడు) ఆదేశంతో, అంగీకారంతో 'గృహస్థాశ్రమం' స్వీకరించడానికి సిద్ధం చేస్తున్న వేడుక. ఆ సమ యంలో గురువు చేయాల్సిన హితబోధ తైత్తిరీయోపనిషత్తులోని 'సత్యాన్న' అన్న ఒక శ్లోక రూపంలో ఉంటుంది.

'సత్యం, ధర్మం, తెలివితేటల విషయాల్లో పొరపాటు పడవద్దు' అన్న ఆదేశం అది. పెద్దవారి నుంచి ధర్మ సూక్ష్మా లను తెలుసుకొని, వారు అనుసరించిన మార్గాన్ని ఎంచుకోమని అంటూ... 'వరుడికి శుభం కలుగుగాక' అని ఆశీర్వదించి గురువు వరుడిని గృహస్థాశ్రమానికి సిద్ధం చేస్తాడు. స్నాతకానికి 'సమావర్తనం' అన్న పేరు కూడా ఉంది. సమావర్తనమంటే, తిరిగి రావడమని అర్థం. విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, గురువు హిత బోధతో పాదయాత్ర చేస్తూ తిరిగి రావడాన్నే సమావర్తనం అంటారు.

హోమ కార్యాలు నిర్వర్తించి, దండాన్ని ధరించి, గొడుగు పట్టుకొని కాశీ యాత్రకు బయలుదేరే ఘట్టం మరో ముఖ్యమైన ఆచారం. వరుడు కాశీ ప్రయాణం, బాజా భజంత్రీల మధ్య గొడుగు పట్టుకొని, చేత్తో కర్ర పుచ్చుకొని, కాళ్లకు పావుకోళ్లు ధరించి, మెడలో పసుపు బట్టను వేసుకొని, సన్యాసం స్వీకరించేం దుకు కాశీకి పోతున్నానని చెప్పి బయలుదేరుతాడు. కాశీ యాత్రా ఘట్టం స్నాతకంలో చాలా సరదాగా జరిగే కార్యక్రమం. తన శేష జీవితం ఇక కాశీలో గడపాలని భావిస్తున్నాననీ; దానికి బంధు, మిత్రుల అనుజ్ఞ కావాలనీ వరుడు కోరతాడు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం సరైందికాదనీ, గృహస్థాశ్రమం స్వీకరించి,



ధర్మబద్ధంగా ఇంద్రియ సుఖాలను అనుభవించి, పరిపూర్ణమైన వైరాగ్యం కలిగిన తర్వాతనే భార్యా సమేతంగా వానప్రస్థాశ్ర మంలో ప్రవేశించాలనీ పురోహితుడు హితవు పలుకుతాడు.

వధువు సోదరుడు వచ్చి 'అయ్యా, బ్రహ్మచారిగారూ! మీ కాశీ ప్రయాణం విరమించుకోండి. మా సోదరిని వివాహం చేసు కొని గృహస్థుగా జీవించండి' అని చెప్పి బొట్టు పెట్టి, బెల్లం (తీపి పదార్థం) నోటికి రుచి చూపించి, నూతన వస్త్రాలను ఇచ్చి వరుడిని వెనుకకు తీసుకొని వస్తాడు. శాస్త్రం ప్రకారం కాబోయే బావమరిదికి వరుడు నూతన వస్త్రాలను బహూకరిస్తాడు. ఆనాటి పెళ్లిళ్లలో ఇదొక ప్రధానమైన వేడుక. చాలా కోలాహలంగా పెళ్ళికి 'తరలి పోయే ముందర' జరిగే సరదా కార్యక్రమం ఇది.

ఇలా స్నాతకం వ్రతాన్ని పూర్తి చేసుకొని, వరుడి బంధు, మిత్రులందరూ బయలుదేరే ముందు, మంగళ స్నానాలు చేయడం, అలంకరించుకోవడం, పల్లకీ లాంటి వాహనాలు సిద్ధం చేసుకోవడం మామూలే. శుభకార్యానికి బయలుదేరుతున్నామనీ, వెనక్కు పిలవడం, నిందించడం, దగ్గడం, తుమ్మడం లాంటివి లేకుండా ఉండాలన్న అర్థం వచ్చే మంత్రాన్ని చదువుతారు.

పెళ్ళికి ముందర ఒక మంచి రోజున గానీ; స్నాతకం, అంకు రార్పణల రోజున గానీ పెళ్ళికొడుకును, పెళ్ళికూతురును (సిద్ధం) చేయడం ఒక ఆచారం. మంగళ స్నానాలతో ఆ ఉదయం కార్యక్రమం మొదలవుతుంది. వధూవరుల ఇళ్లలో, ఉదయం తెల తెలవారుతుండగానే, మంగళ వాద్యాల మధ్య ఇంటి ముందర మామిడి ఆకులతో తోరణం కట్టే కార్యక్రమం ముందుగా జరుగు తుంది. వధువుకు, కన్యాదాత దంపతులకు, తోటి పెళ్ళి కూతు రుకు (వధువు సొంత చెల్లెలు గాని, వరుసకు చెల్లెలు గాని), తెల్లవారక ముందే, ముత్తయిదువలు బొట్టు పెట్టి, మాడుపై నూనె అద్ది, హారతిచ్చి, మంగళ స్నానాలకు సిద్ధం చేస్తారు. అలానే వరుడికీ, తల్లితండ్రులకూ, తోటి పెళ్ళికొడుకుకూ (వరుడి సొంత తమ్ముడు గాని, వరుసకు తమ్ముడు గాని) కూడా జరుగుతుంది. అంకురార్పణగా పిలిచే ఆ వేడుకకు కన్యాదాత దగ్గరి బంధు వులందరూ వస్తారు. నవధాన్యాలను మట్టి మూకుళ్లలో పుట్ట మన్నులో కలిపి మొలకెత్తే విధంగా అమర్చడాన్ని 'అంకురార్పణ' అంటారు.


అలనాటి మంగళ స్నానాలు, మామిడితోరణాలు, స్నాతకం, కాశీయాత్ర లాంటి వేడుకలు ఇంకా ఉన్నాయా? అక్కడక్కడా ఉండవచ్చునేమో!

వ్యాసకర్త తెలంగాణ సీఎం సీపీఆర్ఓ

అప్పుడు కదా సుఖించడం!

'నాకు సుఖం ఎప్పుడు?' అని ప్రశ్నించుకున్నప్పుడు, మామూలు మనుషుల జీవితాల్లో, ఎవరెవరి ఆశలకు, ఆశయా లకు తగినట్లుగా వారికి సమాధానం దొరుకుతుంది. లోక కల్యాణం కోరే మహర్షుల సంగతి ఇందుకు భిన్నంగా ఉంటుందని ఒక అందమైన ఊహ చేశాడు బిజ్జల తిమ్మభూపా లుడు తన 'అనర్ఘ రాఘవం' కావ్యంలో (ద్వితీయా శ్వాసం, 125వ పద్యం).

అప్పటి దాకా అంతా స్తబ్ధుగా ఉన్న దశరథుని ఆస్థానం విశ్వామిత్రుని ఆగమ నంతో ఉలిక్కిపడినట్లవుతుంది. ఆ ఉలికి పాటు నుండి తేరుకోని దశరథుడిని– రామలక్ష్మణులను తనతో పాటు పంపమని విశ్వామిత్రుడు అడగ డంతో కథ మొదలవుతుంది. ఇంకా పసి వాళ్ళని మథనపడుతున్న దశరథునికి, వారి క్షేమానికి తానే భరోసాగా నిలబడి, రామలక్ష్మణులను తనతో పాటు తెచ్చు కుంటాడు విశ్వామిత్రుడు. వాళ్ళను మళ్ళీ క్షేమంగా దశరథునికి అప్పగించినదాకా అతనికి శాంతి లేదు. శ్రీరాముడిని తిరిగి అప్పగించడం ఒంటరిగా కాదు, సీతమ్మతో కలిపి జంటగా! ఈ సందర్భంలో విశ్వామిత్రుడు స్వగతాన్ని వివరించాడు తిమ్మభూపాలుడు.



జ్యోతిర్మయం

'తలపెట్టిన యజ్ఞం ఇక నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ముగిసే సమయానికి తనయునితో సహా తాటకి నశిస్తుంది. శివ ధనుర్భంగం చేసిన శ్రీరాముడిని సీతమ్మ వరిస్తుంది. ఇనకుల తిలకుడైన శ్రీరాముడు, తన వంశంలో పూర్వులు నడిచిన దారి లోనే తానూ నడుస్తూ, రాజ్యపాలనకు సంబంధించిన విధుల్ని నిర్వర్తించడంలో మునిగిపోతాడు. జరగవలసిన పనులను పూర్తిగా జరిపించిన వాడినై, అప్పుడు కదా నేను కాస్త సేదదీరి సుఖించడం!' అని విశ్వామిత్రుడంతటివాడు తాను చేయవల సిన పనులను ఒకటొకటిగా తలుచుకుంటూ లెక్క వేసుకోవడం సముచితమైన ఊహగా పాఠకుని మనసును రంజింపజేస్తుంది.

– భట్టు వెంకట్

క్లుప్తంగా...

డబ్బులు ఎరచూపి బీజేపీలో చేర్చుకుంటున్నారు



భూపాలపల్లి/ములుగు రూరల్: 'ఇతర పార్టీల నేతలకు డబ్బులు, పదవులు ఎరగా చూపి బీజేపీలో చేర్చుకుంటున్నారు. వినని వారిపై కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తున్నారు' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య బస్సు యాత్ర శనివారం ములుగు జిల్లా కేంద్రం నుంచి భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో తమ్మినేని మాట్లాడారు. బీజేపీ పాలన దేశానికి ప్రమాదకరమన్నారు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న తెలంగాణ, కేరళ, తమిళనాడుకు నిధులు కేటాయించకుండా కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. పలు రాష్ట్రాల సీఎంలను సైతం బెదిరిస్తున్నారని, ఎమ్మెల్సీ కవితను కావాలని ఈడీ చేత ఇబ్బందులకు గురి చేయిస్తున్నారని అన్నారు.

ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వండి



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు రూ. 3,016 నిరుద్యోగ భృతి ఇవ్వాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ 2018 మేనిఫెస్టోలో రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటిస్తే..కేసీఆర్ ప్రభుత్వం రూ. 3016 ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. రెండో సారి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా..హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తే నిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుందని, పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు కూడా ఊరట ఇచ్చినవారు అవుతారని తెలిపారు.

మంచి జరిగితే మీది.. చెడు అయితే ఇతరుల ఖాతానా?



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ విజయాలను ప్రభుత్వ విజయాలుగా చెప్పుకున్నప్పుడు..టీఎస్‌పీఎస్సీలో జరిగిన తప్పులు ప్రభుత్వానివి కాదా అని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల నిరుద్యోగి నవీన్ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని, నవీన్ కుటుంబ సభ్యులను ఎవరూ కలవకుండా కేటీఆర్ మేనేజ్ చేశారని ఆరోపించారు. మంచి జరిగితే మీ ఖాతాలో.. చెడు జరిగితే ఇతరుల ఖాతాలో వేస్తారా అని పొన్నం నిలదీశారు. ఐటీ మంత్రి కేటీఆర్‌కు పేపర్ లీక్ కాకుండా సాంకేతికత సమకూర్చాల్సిన బాధ్యత లేదా అని ధ్వజమెత్తారు.

తెలంగాణ తరహాలో బీసీ ఉద్యమం: ఆర్. కృష్ణయ్య



కాచిగూడ: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమాన్ని చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బీసీల సమస్యలపై అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయమైన జనాభా లెక్కలు లేకపోవడం వల్లే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో బీసీలకు సరైన న్యాయం జరగడం లేదని స్పష్టం చేశారు. జనగణనలో కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ బీసీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ ప్రగతిపై చూపండి

గువ్వలను అడ్డుకున్న గ్రామస్తులు

మన్ననూర్: పార్టీ ఫిరాయింపులకు ఇచ్చే ప్రాధాన్యం.. తమ గ్రామ సమస్యల పరిష్కారంపై చూపాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్మపల్లి గ్రామస్తులు అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అడ్డుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో శనివారం కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల రాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే ఆ గ్రామం నుంచి వెళ్తున్నప్పుడు ఆయన కాన్వాయ్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. అక్కడే ఉన్న అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి, పోలీసులు గ్రామస్తులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. వివాదం జరిగిన ఎల్మపల్లి డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వగ్రామం.



స్వగృహం నుంచి వినయ్‌భానురెడ్డి పార్థివదేహాన్ని వ్యవసాయక్షేత్రానికి తీసుకెళ్తున్న ఆర్మీ అధికారులు (ఇన్‌సెట్) తండ్రి వినయ్‌భానురెడ్డి అంతిమసంస్కారాల్లో సెల్యూట్ చేస్తున్న చిన్న కూతురు



లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న గవర్నర్ తమిళిసై

సైనిక లాంఛనాలతో లెఫ్టినెంట్ కల్నల్ అంత్యక్రియలు

- వినయ్‌భానురెడ్డికి బొమ్మలరామారంలో అంతిమ సంస్కారాలు
- వ్యవసాయక్షేత్రంలో వినయ్ చితికి నిప్పంటించిన తండ్రి, కూతురు
- హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి, యాదాద్రి/మల్కాజిగిరి/సాక్షి, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్‌లో మూడు రోజుల క్రితం హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి (వీవీబీరెడ్డి) అంత్యక్రియలు శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో సైనిక లాంఛనాలతో జరిగాయి. భానురెడ్డి తల్లిదండ్రులు, భార్య, కూతుళ్లు, బంధువులు, గ్రామస్తులు, ఆర్మీ అధికారులు, ప్రజాప్రతినిధులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వినయ్‌భానురెడ్డి తండ్రి నర్సింహారెడ్డి, కూతురు హనిక.. చితికి నిప్పంటించారు. సైనికులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఆర్మీకి చెందిన కల్నల్ మనీశ్ దేవగణ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వినయ్ భార్య స్పందనారెడ్డి భారత సైన్యంలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలోని వినయ్‌భానురెడ్డి ఇంటి నుంచి ఆయన పార్థివ దేహాన్ని శనివారం ఉదయం సైనిక వాహనంలో స్వగ్రామం బొమ్మలరామారానికి తీసుకువచ్చారు.

ప్రముఖుల నివాళి: వినయ్‌భానురెడ్డి పార్థివదేహాన్ని బొమ్మలరామారంలోని ఆయన ఇంటికి తీసుకువచ్చి గంటపాటు ప్రజల సందర్శనార్థం ఉంచారు. అంతకు ముందు మల్కాజిగిరి నివాసంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై, ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే, సదరన్ కమాండ్ జనరల్ ఆఫీస్ కమాండింగ్ చీఫ్ లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సింగ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆయనకు నివాళులర్పించారు. బొమ్మలరామారంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్, యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేశ్‌చంద్ర తదితరులు వినయ్ భానురెడ్డికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా నిలవాలి: ఎంపీ కోమటిరెడ్డి

దేశం కోసం విధులు నిర్వహిస్తూ.. ప్రాణాలు విడిచిన లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 50 లక్షల ఎగ్స్‌గ్రేషియా ఇవ్వాలని శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- రాహుల్ గాంధీపై నడ్డా వ్యాఖ్యలు దారుణం: సీఎల్పీనేత భట్టి
- పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేకుండా చేయాలని బీజేపీ కుట్ర
- నిరుద్యోగి ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే



గద్దర్ పాటకు స్టెప్పులు వేస్తున్న భట్టి, మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

సాక్షి, ఆదిలాబాద్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న నరేంద్ర మోదీ పాలనలో నిజమైన దేశభక్తులు, ప్రజాస్వామ్యవాదులు నలిగిపోతున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేకుండా చేయాలని కుట్ర చేస్తున్న వారే దేశ ద్రోహులని బీజేపీ నేతలనుద్దేశించి విమర్శించారు. జాతీయ వ్యతిరేక సాధన సమితిలో రాహుల్‌గాంధీ శాశ్వత భాగం అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా చేసిన వ్యాఖ్యలు దారుణమంటూ ఆయన ఖండించారు. రాహుల్‌గాంధీని పార్లమెంట్‌కు రాకుండా సస్పెన్షన్ చేయాలనుకోవడం మోదీ నియంతృత్వ పాలనకు నిదర్శనమన్నారు. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ జిల్లాలో మూడో రోజు కొనసాగింది. శనివారం ఖానాపూర్ నియోజకవర్గంలోని సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో ఆయన పాదయాత్ర సాగింది. ఇంద్రవెల్లిలో సాయంత్రం కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కొలువుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పోటీ పరీక్షలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందడంతో ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న నిరుద్యోగులకు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సిరిసిల్లలో నిరుద్యోగి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలన్నారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం పీపుల్స్‌మార్చ్‌లో పాల్గొన్నారు.

నిరుద్యోగుల గోసపై గద్దర్ ఆట పాట..

పాదయాత్రలో ప్రజాగాయకుడు గద్దర్ పాల్గొన్నారు. తెలంగాణ వచ్చిన మా బిడ్డలకు కొలువు రాలే రేలారే రేలా అంటూ నిరుద్యోగుల గోసపై పాట పాడి అలరించారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని భట్టి సందర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గండ్రత్ సుజాత, వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నాయకులు భరత్ చౌహాన్, చారులత, అడె గజేందర్ పాల్గొన్నారు.

లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

పంజగుట్ట (హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సిట్‌తో కాకుండా, సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరపాలని బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ 30 లక్షల నిరుద్యోగుల జీవితాలు అగమ్యగోచరంలో పడ్డా ఇప్పటివరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కవితను లిక్కర్ స్కాం నుంచి కాపాడటంలో బిజీగా ఉన్నారని, వారికి నిరుద్యోగుల బాధలు అవసరం లేదని మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్తిగా ప్రక్షాళన చేసేవరకు, నిరుద్యోగులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం ఆగదన్నారు. కేవలం ఇద్దర్ని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారని, గోప్యంగా ఉండాల్సిన చోట ఎవరెవరు విధులు నిర్వహిస్తున్నారో అందర్నీ విచారించాలని డిమాండ్ చేశారు.

సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే స్కేలు

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు కొత్త పే స్కేలు వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు, అసెంబ్లీలో గత మార్చి 15న సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం సెర్ప్ ఉద్యోగులకు సవరించిన వేతనాలతో కూడిన కొత్త పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో విడుదల చేశారు. శనివారం ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా జీవో జారీ చేశారు. దీంతో 23 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగుల కల నెరవేరినట్లయింది. కొత్త పేస్కేలు ప్రకారం వారి జీతాలు, వేతనాలు పెరుగుతాయి. ఏప్రిల్ 1 నుంచి కొత్త పే స్కేలు అమలులోకి రానుండగా, దీనివల్ల మొత్తం 3,978 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. పేస్కేలు పెంపుదలతో ప్రభుత్వంపై ఏడాదికి రూ.58 కోట్ల అదనపు భారం పడనుంది. ఉద్యోగుల కోరికను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, తమ డిమాండ్ సాకారం అయ్యే విధంగా కృషి చేసిన మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ కవితలకు సెర్ప్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటారు. కాగా, ఉద్యోగుల కోరికను మన్నించి, వారి కలను నిజం చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

పేస్కేళ్లు, హోదాలు ఇలా...: సెర్ప్ ఉద్యోగుల్లో భాగంగా ఉన్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్, ఫీల్డ్, మినిస్టీరియల్, సపోర్టింగ్ స్టాఫ్, మండల సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు కొత్త పే స్కేళ్లు ఫిక్స్ చేశారు. వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించే విధులు, బాధ్యతలకు అనుగుణంగా ఆయా కేటగిరీల్లోని సెర్ప్ ఉద్యోగుల విద్యార్హతలను బట్టి ఈ పే స్కేళ్లు వర్తింపజేస్తారు.

విద్యుత్ ఉద్యోగులకు 3.724 % డీఏ మంజూరు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు 3.724 శాతం కరువు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జూలై 1 నుంచి 28.638 శాతం డీఏ చెల్లిస్తుండగా, గత జనవరి 1 నుంచి 32.362% పెంచుతూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలకు సంబంధించి..పెరిగిన డీఏ బకాయిలను మార్చి నెల జీతంతో ఏప్రిల్ నెలలో చెల్లించనున్నట్టు వెల్లడించారు.

వేతనాలను సవరించాల్సిందే!

టీఎస్‌పీఈఏ జేఏసీ డిమాండ్... 24న చలో విద్యుత్ సౌధకు పిలుపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, 1999 నుంచి 2004 మధ్య కాలంలో నియమితులైన ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యాన్ని వర్తింపజేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టిజన్ల సమస్యను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీఎస్‌పీఈఏ జేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకే సన్నాహక సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీరెడ్డి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. వేతన సవరణ 2022 కోసం మార్చి 24న ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు, ఇందుకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులంతా పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. 20న వరంగల్, 21న పాల్వంచలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ప్లాస్టిక్ రీసైకిల్ గోదాంలో అగ్ని ప్రమాదం

బహదూర్‌పురా: కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆయూబ్ అనే వ్యక్తి కొంతకాలంగా మీరాలం ఫిల్టర్ అన్సారీ రోడ్డులో ప్లాస్టిక్ రీసైకిల్ గోదాంను నిర్వహిస్తున్నాడు. ఇళ్లల్లో వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్లాస్టిక్ ఉండలుగా రీసైక్లింగ్ చేస్తాడు. శనివారం ఉదయం గోదాంలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన వాచ్‌మన్ సమాచారాన్ని యజమానికి అందించాడు. కాలాపత్తర్ పోలీసులు వెంటనే బీఆర్ఎఫ్‌తో పాటు ఫైరింజిన్లతో ఘటన స్థలానికి చేరుకున్నారు. 20 ఫైరింజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ గోదాం పక్కనే ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షల కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులను స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. డీసీఎం దగ్ధమైందని, దాదాపు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్లాస్టిక్ రీసైక్లింగ్ గోదాం మేనేజర్ అక్బర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగిందనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోఠీ నుంచి అమెరికన్ కాన్సులేట్‌కు సిటీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: కోఠి, సీబీఎస్‌ల నుంచి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్‌కు సిటీ బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి 12 నిమిషాలకో బస్సు అందుబాటులో ఉండేలా ప్రతిరోజు 14 బస్సులను నడపనున్నారు. ఈ బస్సులు కోఠి నుంచి బయలుదేరి మెహిదీపట్నం, టోలీచౌకి, దర్గా, నానక్‌రాంగూడ, క్యూ సిటీ, అమెరికన్ కాన్సులేట్ వరకు రాకపోకలు సాగించనున్నాయి. మొదటి బస్సు కోఠి నుంచి ఉదయం 5.10 గంటలకు, చివరి బస్సు రాత్రి 8.16 గంటలకు బయలుదేరుతాయి. అమెరికన్ కాన్సులేట్ నుంచి మొదటి బస్సు ఉదయం 5.02 గంటలకు, చివరి బస్సు రాత్రి 9.39 గంటలకు బయలుదేరుతాయి.



బోథ్‌లో వడగళ్ల వాన



వికారాబాద్ జిల్లా ఎర్రవల్లిలో ముద్దగా మారిన వడగళ్లను చూపిస్తున్న వ్యక్తి



రాములు మృతదేహం



రంగమ్మ మృతదేహం

వడగళ్లు.. ఈదురుగాలులు

రాష్ట్రవ్యాప్తంగా ముంచెత్తిన అకాల వర్షాలు

- ఖమ్మం జిల్లాలో తెగిపడ్డ విద్యుత్ తీగలు తగిలి వృద్ధ దంపతుల మృతి
- పలు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం
- హైదరాబాద్‌లో సుమారు అరగంటపాటు కుండపోత
- నేడు పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురవొచ్చన్న వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా శనివారం సైతం అకాల వర్షాలు కురిశాయి. చాలా జిల్లాల్లో వడగళ్ల వాన కురవగా కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం వందనం గ్రామంలో వర్షానికి తెగిపడిన కరెంటు తీగలు తగిలి వృద్ధ దంపతులు మృతిచెందగా పలు జిల్లాల్లో పంటలకు భారీ నష్టం వాటిల్లింది.

నేలరాలిన పంటలు..

జనగామ జిల్లా కొడకండ్ల, దేవరుప్పుల, జనగామ, భూపాలపల్లి జిల్లా గణపురం, మొగుళ్లపల్లి, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి, తొర్రూరు మండలాల్లో కురిసిన వడగళ్ల వర్షానికి వరి పైరు నేలకొరగగా, మామిడి, ఇతర తోటలకు నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా కనగల్ మండలం మంచినీళ్లబావిలో నిమ్మతోటలు వేర్లతో సహా కూలిపోయాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో వరిపైరు నేలకొరిగింది. తిరుమలగిరి మండలంలో కురిసిన వడగళ్లకు పెంకుటిళ్లు దెబ్బతిన్నాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కురిసిన వడగళ్ల వానకు మొక్కజొన్న చేలు నేలకొరిగాయి. చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గద్వాల జిల్లా గట్టు, ధరూర్ మండలంలో వడగండ్ల వానకు వందల ఎకరాల్లో పొగాకు, మామిడి, ఆముదం పంటలు నాశనమయ్యాయి. నారాయణపేట జిల్లా మక్తల్, కోస్గి మండలంలో మునగ, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. వనపర్తి జిల్లా కేంద్రంతోపాటు పాన్‌గల్, చిన్నంబావి, ఆత్మకూరు, అమరచింత, మదనాపురం, రేవల్లి మండలాల్లో కురిసిన గాలివానకు వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో దాదాపు 365 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

దంపతుల మృతి

ఖమ్మం జిల్లా చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన దంపతులు బానోతు రాములు (65), రంగమ్మ (62) ప్రతిరోజు మాదిరిగానే మేకలను మేపేందుకు శనివారం ఉదయం పొలాలకు వెళ్లి సాయంత్రం తిరిగొస్తుండగా భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో కొదుమూరు గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి వెంగళరావు సుబాబుల్ తోటలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. వాటిపై రాములు, రంగమ్మ కాలుపెట్టడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. 4 మేకలు కూడా మృతిచెందాయి.

గ్రేటర్‌లో దంచికొట్టిన వాన..

భాగ్యనగరంలో శనివారం సాయంత్రం సుమారు అరగంటపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లపై ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ పరిసర ప్రాంతాల్లో వడగళ్ల వాన కురవగా పంజగుట్ట, అమీర్‌పేట్, ఖైరతాబాద్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, సైదాబాద్, సికింద్రాబాద్, బేగంపేట, అల్వాల్‌లను భారీ వర్షం ముంచెత్తింది. చిలకలగూడ, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, ఓయూ క్యాంపస్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్‌లలో ఓ మోస్తరు వర్షం కురిసింది. కుషాయిగూడ, టోలిచౌకీ, బేగంపేట, సికింద్రాబాద్‌ల పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. అత్యధికంగా గాజులరామారంలో 4.4 సెంటీమీటర్ల వర్షం కురవగా జీడిమెట్లలో 4.2, రామచంద్రాపురంలో 4.0, చర్లపల్లిలో 3.6 సెంటీమీటర్ల మేర వర్షం పడింది.

నేడు అక్కడక్కడా తేలికపాటి వానలు

దక్షిణ కర్ణాటక నుంచి జార్ఖండ్, అంతర్గత కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తర ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

ఏపీలో భారీ వర్షాలు.. పిడుగులు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/సాక్షి నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో పిడుగులు, వడగళ్లు హడలెత్తిస్తున్నాయి. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి జార్ఖండ్ వరకు.. రాయలసీమ, తెలంగాణ, ఒడిశాల మీదుగా ఉత్తర ఛత్తీస్‌గఢ్ వరకు కొనసాగుతున్న ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్లలో శనివారం అత్యధికంగా 8 సెం.మీ. వర్షం కురిసింది.

కేబుల్ 'ఫాల్ట్'



విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లపైనే

- అయినా చిన్నపాటి ఈదురు గాలికే తెగిపడుతున్న తీగలు
- ఏబీ కేబుళ్లు, కవర్ కండక్టర్ల నాణ్యతపై అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: కాలనీల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. మూడు నెలలకోసారి లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతున్నా విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు వేలాడుతూనే ఉన్నాయి. ఈదురుగాలితో కూడిన వర్షానికి విరిగిపడుతూనే ఉన్నాయి. ఫలితంగా 11 కేవీ హెచ్‌టీ, ఎల్‌టీ కండక్టర్లు, ఏబీ కేబుళ్లు తెగిపడుతుండటంతో పాటు కొమ్మల బరువుకు కండక్టర్‌కు అటు ఇటుగా ఉన్న కరెంట్ స్తంభాలు సైతం నేల కూలుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కులో ఏబీ కవర్ కండక్టర్ కేబుల్ తెగిపడటం, సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోక పోవడం.. ఉదయాన్నే పార్కులో వాకింగ్ కోసం వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడటాన్ని నిశితంగా పరిశీలిస్తే.. కవర్ కండక్టర్ల నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కండక్టర్లు తెగిపడినప్పుడు భూమికి ఆనుకోవడంతో ఎర్తింగ్ వచ్చి ఈఎల్ ట్రిప్పవుతోంది. అదే ఫేజ్ టు ఫేజ్ ఎర్తింగ్ అయితే.. ఓఎల్ ట్రిప్పవుతుంది. దీంతో సరఫరా నిలిచిపోయి.. విద్యుత్ ప్రమాదాలు వాటిల్లకుండా నివారిస్తుంది. కానీ ఈ ఘటనలో ఇవేవీ చోటుచేసుకోకపోవడం గమనార్హం.

చెట్ల మధ్యన కవర్ కండక్టర్లు: మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఏటా ఈదురు గాలులతో కూడిన వర్షాలు సృష్టించే బీభత్సం అంతా ఇంతా ఉండదు. సరూర్‌నగర్, హబ్సిగూడ, రామంతాపూర్, రాజేంద్రనగర్, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, ఆస్మాన్‌గఢ్ డివిజన్ల పరిధిలో చెట్ల సమస్య ఎక్కువగా ఉంది. ఈదురు గాలితో కూడిన వర్షం కురిసిన ప్రతిసారీ చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతుండటం, వైర్లు తెగిపడుతుండటం, స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలుతుండటం పరిపాటిగా మారింది. సంస్థకు ఆర్థికంగా నష్టాలను తెచ్చిపెడుతుండటంతో పాటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూ.. వినియోగదారుల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టాలని డిస్కం భావించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అత్యాధునిక ఏబీ పవర్ కండక్టర్ కేబుళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆ మేరకు హైరిస్క్ ఏరియాల్లో ఏర్పాటు చేశారు.

నాణ్యతపై ఆందోళన వద్దు..

మొదటిసారి వర్షానికి సాంకేతిక సమస్యలు సర్వసాధారణమే. ఒకటి రెండు వరుస వర్షాల తర్వాత పరిస్థితి మెరుగుపడుతుంది. కేబుళ్ల నాణ్యతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని పరిశీలించిన తర్వాతే వాటికి అనుమతి ఇచ్చాం. బరువైన చెట్ల కొమ్మలు పడటం వల్లే తెగిపడుతున్నాయి. కవర్ కండక్టర్లు తెగి కింద పడినప్పటికీ.. భూమికి ఆనుకోకపోవడం వల్ల ఎర్తింగ్ కాలేదు. ఫీడర్ ట్రిప్ కాక పోవడానికి ఇదే కారణం.

– శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్, ఆపరేషన్స్ విభాగం, సీపీడీసీఎల్

క్లుప్తంగా...

నన్ను అరెస్ట్ చేస్తారేమో: ట్రంప్



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనపైనున్న లైంగిక ఆరోపణల విషయాలు బయటకు రాకుండా కొందరు మహిళలకు భారీగా డబ్బులు ఇచ్చారన్న కేసుపై న్యూయార్క్ పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. న్యూయార్క్ ప్రాసిక్యూటర్ ఈ కేసులో నేరాభియోగాలు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారని, బహుశా మంగళవారం తనను అరెస్ట్ చేస్తారని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. మన్‌హాటన్ జిల్లా అటార్నీ కార్యాలయం ద్వారా ఈ మేరకు సంకేతాలు వెలువడ్డాయన్నారు. ట్రంప్ అధ్యక్షుడు కాక ముందు 2006 ప్రాంతంలో ఒక ప్లేబాయ్‌లా ఎందరో మహిళలతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపణలున్నాయి. వారిలో ఇద్దరి నోరు మూయించేందుకు 2016లో వారికి ట్రంప్ డబ్బులిచ్చారంటూ ఆయన మాజీ లాయర్ మైకేల్ కొహెన్ కూడా సాక్ష్యమిచ్చారు.

భారత్ నుంచి బంగ్లాకు పైప్‌లైన్ ద్వారా డీజిల్

ఆన్‌లైన్‌లో ప్రారంభించిన మోదీ, హసీనా

న్యూఢిల్లీ: భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు డీజిల్ రవాణా కోసం రూ.377 కోట్లతో నిర్మించిన పైప్‌లైన్‌ను ప్రధాని మోదీ, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా శనివారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించారు. భారత్–బంగ్లాదేశ్ సంబంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఈ లైన్ వల్ల రవాణా ఖర్చులతోపాటు కాలుష్యం కూడా తగ్గుతాయని చెప్పారు. ప్రస్తుతం డీజిల్ భారత్ నుంచి 512 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గంలో బంగ్లాదేశ్‌కు సరఫరా అవుతోంది. నూతనంగా అస్సాంలోని నుమాలిఘడ్ నుంచి బంగ్లాదేశ్‌కు 131.5 కిలోమీటర్ల మేర నిర్మించిన పైప్‌లైన్ ద్వారా ఏడాదికి 10 లక్షల టన్నుల డీజిల్ రవాణాకు వీలుంటుంది. ఈ 15 ఏళ్ల ఒప్పందాన్ని దశలవారీగా విస్తరించుకునే వీలుంది.

రాజస్తాన్‌లో 19 కొత్త జిల్లాలు

జైపూర్: రాజస్తాన్‌లో కొత్తగా 19 జిల్లాలను, మూడు డివిజన్లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 50కి చేరనుంది. 2008 తర్వాత రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు ఇదే తొలిసారి. కొత్త జిల్లాల్లో అత్యధికంగా జైపూర్‌లో నాలుగు జిల్లాలు, జోధ్‌పూర్‌లో మూడు ఏర్పాటు కానున్నట్టు గహ్లోత్ వెల్లడించారు. కొత్త జిల్లాలు, డివిజన్లలో మౌలిక వసతులు, మానవ వనరుల కల్పనకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించామన్నారు. విస్తీర్ణపరంగా దేశంలో రాజస్తాన్ అతిపెద్ద రాష్ట్రమన్న విషయం తెలిసిందే.

ఆ వారెంట్ చిత్తు కాగితమేనా?

పుతిన్‌ను బోనెక్కించడం ఐసీసీకి సాధ్యమేనా?



రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాదికి పైగా ఉక్రెయిన్‌పై దండయాత్ర సాగిస్తున్నారు. బాంబులు, ఫిరంగులు, క్షిపణులతో దారుణ కాండ సాగిస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా, పాశ్చాత్య దేశాలు ఎన్ని ఆంక్షలు విధించినా డోంట్ కేర్ అన్న ధోరణిలో పోతున్నారు. అలాంటి సమయంలో ఐసీసీ ఆయనపై అరెస్ట్ వారెంట్లు జారీ చేయడం సంచలనంగా మారింది. ఇంతకీ ఈ వారెంట్లతో పుతిన్‌ను అరెస్ట్ చేయొచ్చా? మాస్కో చెబుతున్నట్టుగా ఆ వారెంట్లు చిత్తు కాగితాలతో సమానమా?

పుతిన్‌పైనున్న ఆరోపణలేంటి?

ఉక్రెయిన్‌లో ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యాకు పిల్లల్ని చట్టవిరుద్ధంగా తరలిస్తున్నారు. ఇప్పటివరకు ఉక్రెయిన్ నుంచి రష్యాకి దాదాపుగా 16,221 మంది తరలివెళ్లారని ఐక్యరాజ్య సమితి విచారణలో తేలింది. ఈ పిల్లల్ని తాత్కాలికంగా తరలిస్తున్నట్టు బయటకి చెబుతున్నారు. కానీ ఆ చిన్నారుల్ని రష్యాలో పెంపుడు కుటుంబాలకు ఇచ్చేసి వారిని శాశ్వతంగా రష్యా పౌరుల్ని చేస్తున్నారు. దీంతో ఉక్రెయిన్‌లో మిగిలిపోయిన తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుతోంది. ఇలా పిల్లల్ని తరలించడం అంతర్జాతీయ నిబంధనల ప్రకారం యుద్ధ నేరం కిందకే వస్తుంది. పిల్లల్ని తరలిస్తున్న సైనికుల్ని, ఇతర అధికారుల్ని నియంత్రించలేకపోయిన పుతిన్ యుద్ధ నేరస్తుడేనని ఐసీసీ చెబుతోంది. పుతిన్‌తో పాటుగా రష్యా బాలల హక్కుల కమిషనర్ మారియా లోవా బెలోవా కూడా సహ నిందితురాలుగా ఉంది.

పుతిన్ అరెస్ట్ అవుతారా?

పుతిన్ సొంత దేశంలో అపరిమితమైన అధికారాలను అనుభవిస్తున్నారు. రష్యాలో ఉన్నంత కాలం ఆయన సేఫ్. ఐసీసీకి సొంత పోలీసు బలగం లేదు. ఏ పని చెయ్యాలన్నా సభ్యదేశాలపైనే ఆధారపడుతుంది. రష్యాను వీడి పుతిన్ వేరే దేశానికి వెళితే ఐసీసీ అరెస్ట్ చేయొచ్చు. ఈ అరెస్ట్ వారెంట్ల జారీతో ఆయన విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు ఏర్పడ్డాయి. అయితే 2022లో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించడం తెలిసిందే. ఐసీసీ నోటీసులతో అంతర్జాతీయ సమాజం కూడా ఇక పుతిన్ కదలికలను నిశితంగా గమనిస్తుంది కాబట్టి ఆయన వేరే దేశం వెళితే మాత్రం అరెస్ట్ కాక తప్పకపోవచ్చు.

విచారణ ఎదుర్కొంటారా?

పుతిన్ విచారణకు కొన్ని అడ్డంకులున్నాయి. ఐసీసీని రష్యా గుర్తించడంలేదు. అమెరికా, రష్యా వంటి దేశాలు ఇందులో సభ్యులు కావు. ఐసీసీ విచారణ పరిధిని అగ్రరాజ్యం అమెరికా కూడా ఆమోదించడం లేదు. మరో అడ్డంకి ఏమిటంటే ఐసీసీ వాద, ప్రతివాదులిద్దరూ హాజరైతే తప్ప విచారణ కొనసాగించదు. ఎవరైనా విచారణకు గైర్హాజరైతే విచారణ ముందుకు సాగదు. పుతిన్‌ను విచారించాలంటే ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన దేశాల్లో విచారణ చేయొచ్చు. పుతిన్‌ను అలా వేరే దేశానికి తీసుకురావడం అసాధ్యం.

ఉక్రెయిన్ యుద్ధంపై ప్రభావం ఎంత?

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న అరాచకాలు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని మరోసారి పుతిన్‌కు స్పష్టంగా తెలిసేలా, అంతర్జాతీయ సమాజం దీనిపై ఆగ్రహంగా ఉందని సంకేతాలు ఇచ్చేలా ఈ అరెస్ట్ వారెంట్లు ఉన్నాయి. అయితే రష్యా ఈ వారెంట్లను లెక్క చేయలేదు. తాము ఐసీసీని గుర్తించడం లేదు కాబట్టి ఆ వారెంట్లు చిత్తు కాగితంతో సమానమని మాస్కో పెద్దలు వ్యాఖ్యానించారు. పుతిన్ అధికార ప్రతినిధి ఒకరు ఈ వారెంట్లు ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని అన్నారు. ఐసీసీని ఏ మాత్రం పట్టించుకోని పుతిన్ ఈ వారెంట్లకి భయపడి ఉక్రెయిన్ అంశంలో వెనకడుగు వేస్తారని అనుకుంటే పొరపాటేనని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఏమిటీ ఐసీసీ?

ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) 1998లో ''రోమ్ స్టాచ్యూట్'' ఒప్పందం కింద ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఉంది. అంతర్జాతీయ సమాజంపైనా, మానవత్వంపైన జరిగే తీవ్రమైన నేరాలు, మారణహోమాలు, యుద్ధనేరాలను విచారించి శిక్షలు విధిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో న్యూరెంబర్గ్ విచారణ తరహాలోనే ఐసీసీ ఏర్పాటైంది. ప్రస్తుతం బ్రిటన్, జపాన్, అఫ్గానిస్తాన్, జర్మనీ సహా 123 దేశాలు ఇందులో సభ్యులుగా ఉన్నాయి. రష్యా, అమెరికా దీనిని గుర్తించలేదు. అదే విధంగా భారత్, చైనా కూడా సభ్యత్వాన్ని తీసుకోలేదు. తీవ్రమైన నేరాల విషయాల్లో ఆయా దేశాల దర్యాప్తు సంస్థలు విచారణలో విఫలమైతే ఐసీసీ జోక్యం చేసుకుంటుంది.

ఇప్పటిదాకా ఏ దేశాల నేతలను శిక్షించారు?

- అరాచకాలు సృష్టించిన జర్మనీ నాజీ నాయకుల్ని రెండో ప్రపంచ యుద్ధం తర్వాత న్యూరెంబర్గ్, టోక్యో ట్రిబ్యునళ్లలో విచారించి శిక్షించారు. నియంత అడాల్ఫ్ హిట్లర్‌కు కుడిభుజంగా చెప్పుకునే రుడాల్ఫ్ హెస్‌కి జీవిత ఖైదు పడింది.
- బోస్నియా, రువాండా, కాంబోడియా దేశాల నాయకుల్ని కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్రిబ్యునళ్లలో విచారించారు
- 1990లో యుగోస్లోవియా ముక్కలైనప్పుడు అక్కడ హింసాకాండను ప్రేరేపించిన ఆ దేశాధ్యక్షుడు స్లొబోడాన్ మిలోసెవిచ్‌ను ఐక్యరాజ్యసమితి హేగ్‌లో విచారించింది. తీర్పు వచ్చేలోపే ఆయన జైల్లో గుండెపోటుతో మరణించారు. ఆ సమయంలో ఏకంగా 90 మందికి శిక్ష పడింది.
- అత్యాచారాలను ప్రేరేపించిన లైబీరియా మాజీ అధ్యక్షుడు చార్లెస్ టేలర్‌కు 50 ఏళ్ల కారాగార శిక్ష విధించారు
- చాడ్ దేశం మాజీ నియంత హిస్సేని హాబ్రేకి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.
- ఐసీసీ ఏర్పాటయ్యాక 40 మందిపై నేరారోపణలు రుజువయ్యాయి. వీరంతా ఆఫ్రికా దేశాలకు చెందినవారు.

ఎక్స్‌బీబీ.1.16

- దేశంలో కరోనా కొత్త వేరియంట్
- 76 కేసుల్ని గుర్తించాం: ఇన్సాకాగ్

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్–19 కొత్త వేరియంట్ ఎక్స్‌బీబీ.1.16 వైరస్‌ను 76 నమూనాల్లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్–కోవ్–2 జెనోమిక్స్ కన్సార్టియం (ఇన్సాకాగ్) తెలిపింది. ఇటీవలి కాలంలో దేశంలో కరోనా కేసుల్లో పెరుగుదలకు ఈ వేరియంటే కారణం కావచ్చని పేర్కొంది. 76 కేసుల్లో కర్ణాటకలో 30, మహారాష్ట్రలో 29, పాండిచ్చేరిలో 7, ఢిల్లీలో 5, తెలంగాణలో 2, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశాల్లో ఒక్కోటి ఉన్నాయి. ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ మొదటగా జనవరిలో 2 శాంపిళ్లలో బయటపడింది. ఫిబ్రవరిలో 59కి చేరింది. మార్చిలో 15 శాంపిళ్లలో బయటపడ్డట్టు ఇన్సాకాగ్ పేర్కొంది. ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ 12 దేశాల్లో బయటపడినప్పటికీ అమెరికా, బ్రూనై, సింగపూర్, యూకేల కంటే భారత్‌లోనే అత్యధిక కేసులు నమోదైనట్లు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అండ్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ మాజీ కన్వీనర్ విపిన్ ఎం. వశిష్ఠ చెప్పారు. ఈ వేరియంట్ కారణంగా దేశంలో గత 14 రోజుల్లో కేసులు 281%, మరణాలు 17% పెరిగాయని ట్వీట్ చేశారు. దేశంలో ఒక్క రోజు వ్యవధిలో 800 పైగా కరోనా కేసులు నమోదయ్యాయి. 126 రోజుల తర్వాత ఇదే అత్యధికం. యాక్టివ్ కేసులు 5,389కు చేరాయని కేంద్రం తెలిపింది.

ఇమ్రాన్‌కు ఊరట

- అరెస్ట్ వారెంట్ రద్దు చేసిన కోర్టు
- తోషాఖానా కేసు విచారణ వాయిదా



ఇస్లామాబాద్: తోషాఖానా కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను కోర్టు రద్దు చేసింది. శనివారం ఆయన ఇస్లామాబాద్‌లోని జిల్లా కోర్టులో హాజరయ్యారు. చేరుకున్నారు. పరిస్థితులు తీవ్రంగా ఉద్రిక్తంగా మారడంతో ఇమ్రాన్ హాజరైనట్లు కోర్టు ఆవరణలో వాహనంలోనే సంతకం తీసుకున్నారు. కోర్టు కాంప్లెక్స్‌లోకి ఇమ్రాన్ మద్దతుదారులు రాళ్లు రువ్వగా పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. దాంతో విచారణ సాగదన్న జడ్జి, ఇమ్రాన్‌పై జారీ అయిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి అభియోగపత్రం లేకుండానే అక్కడి నుంచే తిరిగి వెళ్లేందుకు ఆయన్ను అనుమతించారు. విచారణను ఈనెల 30కి వాయిదా వేశారు. ఇమ్రాన్ ఇస్లామాబాద్‌లో ఉండగానే లాహోర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు సోదాలు జరిపారు. 20 రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు దొరికాయన్నారు. విచారణకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఇమ్రాన్ కాన్వాయ్‌లో మూడు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి.

ఆహార సంక్షోభానికి 'చిరు' పరిష్కారం

- ప్రపంచ చిరుధాన్యాల సదస్సులో మోదీ
- వాటి వాడకం బాగా పెరగాలని సూచన



న్యూఢిల్లీ: ప్రపంచ ఆహార సంక్షోభానికి చిరుధాన్యాలు పరిష్కారం కాగలవని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. అంతేగాక తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే రోగాలను కూడా ఇవి దూరం చేస్తాయన్నారు. ''ప్రస్తుతం భారత్‌లో చిరుధాన్యాల వాడకం 5 నుంచి 6 శాతమే ఉంది. దీన్ని ఇతోధికంగా పెంచి, ఆహారంలో చిరుధాన్యాలు తప్పనిసరిగా మారేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలి'' అని పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ ప్రపంచ చిరుధాన్యాల (శ్రీ అన్న) సదస్సును ఆయన ప్రారంభించారు. అందులో పాల్గొంటున్న దేశ, విదేశీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచం నేడు రెండు రకాల ఆహార సవాళ్లను ఎదుర్కొంటోందని ఈ సందర్భంగా మోదీ అభిప్రాయపడ్డారు. ''దక్షిణార్ధ గోళంలోని దేశాల్లోనేమో పేదలకు తినడానికి తిండి దొరకని దుస్థితి! ఉత్తరార్ధ గోళంలోనేమో తప్పుడు ఆహారపుటలవాట్ల వల్ల రోగాలు కొనితెచ్చుకుంటున్న పరిస్థితి. ఒకచోట ఆహార సంక్షోభం. మరోచోట అలవాట్ల సమస్య. సాగులో రసాయనాల మితిమీరిన వాడకంపై ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతున్నాయి. వీటన్నింటికీ చిరుధాన్యాలు చక్కని పరిష్కారం'' అని వివరించారు. పలు రాష్ట్రాలు ప్రజా పంపిణీ పథకంలో చిరుధాన్యాలను కూడా చేర్చాయని చెప్పారు. మిగతా రాష్ట్రాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో కూడా చిరుధాన్యాలకు స్థానం కల్పించాలన్నారు. అలాగే పొలం నుంచి మార్కెట్ దాకా, ఒక దేశం నుంచి మరో దేశం దాకా చిరుధాన్యాలకు పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

చిన్న రైతులకు భాగ్యసిరి

చిరుధాన్యాలు గ్రామాలు, పేదలతో ముడిపడి ఉన్నాయని మోదీ అన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అవి సిరులు కురిపించగలవని అభిప్రాయపడ్డారు. ''దాదాపు 2.5 కోట్ల మంది రైతులు వీటిని పండిస్తున్నారు. ప్రభుత్వం ఉద్యమ స్ఫూర్తితో చేపట్టిన చిరుధాన్యాల ప్రచారం వారికి ఎంతో మేలు చేయనుంది. వీటిని రసాయనాల అవసరం లేకుండా, తక్కువ నీటితో పండించవచ్చు. తద్వారా వాతావరణ మార్పుల సమస్యకు కొంతవరకు అడ్డుకట్ట వేయవచ్చు. గనుకనే వీటికి శ్రీ అన్న అని నామకరణం చేశాం'' అని చెప్పారు. చిరుధాన్యాలు దేశమంతటా సమగ్ర ఆహారపుటలవాట్లకు మాధ్యమంగా మారుతున్నాయన్నారు. భారత్ తన వ్యవసాయ పద్ధతులను ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి, వారి అనుభవాల నుంచి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. చిరుధాన్యాలపై 500కు పైగా స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయన్నారు. హైదరాబాద్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐసీఏఆర్)ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించారు. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకుంటున్న నేపథ్యంలో అందుకు గుర్తుగా పోస్టల్ స్టాంపును, 75 రూపాయల నాణాన్ని మోదీ విడుదల చేశారు.

కొలీజియమే అత్యుత్తమం: సీజేఐ

జడ్జీల సామర్థ్యానికి లైంగిక ప్రవృత్తితో సంబంధం లేదు • కోర్టులపై కేంద్రం ఒత్తిళ్లు లేవన్న జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా పరిపూర్ణమూ, లోపరహితమూ కాజాలదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామక వ్యవస్థ అయిన కొలీజియాన్ని గట్టిగా సమర్థించారు. కేంద్రం, న్యాయవ్యవస్థ మధ్య కొలీజియం వ్యవస్థ తీవ్ర విభేదాలకు కారణంగా మారడం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఇండియాటుడే సదస్సులో సీజేఐ మాట్లాడుతూ కొలీజియంను అత్యుత్తమ వ్యవస్థగా అభివర్ణించారు. న్యాయవ్యవస్థపై బయటి ఒత్తిళ్లు, ప్రభావాలు లేకుండా కాపాడుకోవాల్సి ఉందంటూ నర్మగర్భ వ్యాఖ్యలు కూడా చేశారు. అప్పుడే అది స్వతంత్రంగా పని చేయగలుగుతుందన్నారు. కొలీజియం చేసిన కొన్ని సిఫార్సులకు ఆమోదం తెలపకపోవడానికి ప్రభుత్వం పేర్కొన్న కారణాలను కొలీజియం బయట పెట్టడంపై కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు అసంతృప్తిని సీజేఐ తోసిపుచ్చారు. ''వీటిపై న్యాయ మంత్రితో చర్చకు దిగదలచుకోలేదు. కానీ భిన్నాభిప్రాయాలు సర్వసాధారణం'' అన్నారు. అయితే కేసుల విచారణ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తమపై ఎలాంటి ఒత్తిడీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. ఏ కేసులో ఎలాంటి తీర్పు ఇవ్వాలో గత 23 ఏళ్లలో ఎవరూ తనపై ఒత్తిడి తేలేదన్నారు. అలాగే న్యాయమూర్తుల లైంగిక ప్రవృత్తికి, వారి సామర్థ్యానికి సంబంధం లేదంటూ ఈ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కొలీజియం సిఫార్సు చేసిన వారిలో కొందరు తాము స్వలింగ సంపర్కులమని ప్రకటించుకోవడం తెలిసిందే.

అమృత్‌పాల్ అరెస్టు!

సినీ ఫక్కీలో గంటలకొద్దీ చేజింగ్

- 100 కార్లలో వెంటాడిన పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా అనుచరుల అరెస్టులు



చండీగఢ్: ముందు ఓ ప్రైవేట్ కాన్వాయ్. దాన్ని తరుముతూ 100కు పైగా పోలీసు వాహనాలు! అచ్చం హాలీవుడ్ సినిమాను తలపించేలా గంటల కొద్దీ చేజింగ్!! ముందుజాగ్రత్తగా రాష్ట్రమంతటా ఇంటర్నెట్, ఎస్ఎంఎస్ సేవల నిలిపివేత. పంజాబ్‌లో వివాదాస్పద ఖలిస్తాన్ వేర్పాటువాద నేత, వారిస్ దే పంజాబ్ సంస్థ చీఫ్ అమృత్‌పాల్‌సింగ్‌ను పట్టుకునే ప్రయత్నంలో చోటుచేసుకున్న దృశ్యాలివి. అత్యంత నాటకీయ పరిస్థితుల నడుమ పంజాబ్ పోలీసులు శనివారం అతన్ని ఎట్టకేలకు అరెస్టు చేసినట్టు చెబుతున్నారు. ఆరుగురు మద్దతుదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదంతం పంజాబ్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన నేపథ్యంలో అమృత్‌పాల్ అరెస్టుపై పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎస్ఎంఎస్, ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. 78 మంది 'వారిస్ దే...' సంస్థ సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

ఏం జరిగింది?

గత నెలలో ఓ కిడ్నాపింగ్ కేసులో అమృత్‌పాల్ అనుచరుడు లవ్‌ప్రీత్‌సింగ్ అలియాస్ తూఫాన్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దాంతో ఫిబ్రవరి 24న అమృత్‌పాల్ వీరంగమే సృష్టించారు. వేలాదిగా తన అనుచరులతో కలిసి కత్తులు, తుపాకులు చేబూని అమృత్‌సర్ నగర శివార్లలోని అజ్నాలా పోలీస్ స్టేషన్‌పై దాడికి దిగారు. బారికేడ్లను ధ్వంసం చేస్తూ విధ్వంసం సృష్టించారు. దాంతో విధి లేక లవ్‌ప్రీత్‌ను పోలీసులు వదిలేయాల్సి వచ్చింది! విద్వేష ప్రసంగాలతో యువతను రెచ్చగొట్టారంటూ అమృత్‌పాల్, అతని ఆరుగురు అనుచరులపై కేసు నమోదైంది. మందీమార్బలంతో జలంధర్‌లోని షాకోట్ వెళ్తున్న అమృత్‌పాల్‌ను ఒక్కసారిగా చుట్టుముట్టారు. చాలాసేపు వెంటాడి చివరికి జిల్లా సరిహద్దుల్లోని మెహత్‌పూర్ సమీపంలో అమృత్‌పాల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెబుతున్నారు.

ఓర్వలేకే దేశంపై నిందలు

రాహుల్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ధ్వజం

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బ్రిటన్లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ తూర్పారబట్టారు. ఇండియాటుడే సదస్సులో మాట్లాడిన ఆయన రాహుల్ పేరు ప్రస్తావించకుండా దుయ్యబట్టారు. ''భారత ప్రజాస్వామ్యం సాధిస్తున్న ప్రగతిని, ఘన విజయాలను కొందరు ఓర్చుకోలేకపోతున్నారు. అందుకే దేశంపై నిందలేస్తున్నారు. మాటల దాడులు చేస్తున్నారు'' అంటూ విమర్శలు గుప్పించారు. ''దేశంలో ఆత్మవిశ్వాసం నిండుగా తొణికిసలాడుతోంది. ప్రపంచవ్యాప్తంగా నాయకులు, మేధావులు, ఆర్థికవేత్తలు అందరూ భారత్‌పై ఎంతో విశ్వాసం కనబరుస్తున్నారు. ఇలాంటి వేళ ప్రతికూల వ్యాఖ్యలతో దేశాన్ని తక్కువ చేసే, ప్రజల స్థైర్యాన్ని దెబ్బ తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. శుభ సందర్భాల్లో దిష్టిచుక్క పెట్టడం మన సంప్రదాయం. ఇలాంటి వ్యక్తులు తమ చేష్టల ద్వారా బహుశా అలా దిష్టిచుక్క పెట్టే బాధ్యత తీసుకున్నట్టున్నారు'' అంటూ చురకలంటించారు. ఇలాంటి కురచ ప్రయత్నాలను పట్టించుకోకుండా దేశం ప్రగతి పథంలో దూసుకుపోతూనే ఉంటుందన్నారు. ''గత పాలకుల హయాంలో అవినీతి, కుంభకోణాలే నిత్యం పతాక శీర్షికల్లో ఉండేవి. ఇప్పుడేమో అలాంటి అవినీతిపరులంతా వారిపై ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా ఒక్కటవుతున్న వార్తలు హెడ్‌లైన్స్‌గా మారుతున్న విచిత్ర పరిస్థితిని మనమంతా చూస్తున్నాం'' అంటూ ఎద్దేవా చేశారు.

సరిహద్దుల వద్ద ప్రమాదకర పరిస్థితి

ఉద్రిక్తంగానే తూర్పు లద్దాఖ్: జై శంకర్



న్యూఢిల్లీ: ''తూర్పు లద్దాఖ్‌లో చైనాతో సరిహద్దుల వెంట ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. చైనాతో మన సంబంధాలు సవాలుగా మారాయి. అసాధారణ దశకు చేరుకున్నాయని భావిస్తున్నా'' అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంట కొన్నిచోట్ల రెండు దేశాల సైన్యాలు అత్యంత సమీపంలో మోహరించి ఉండటంతో పరిస్థితులు కొంత ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. సమస్య పరిష్కారానికి 2020 సెప్టెంబర్‌లో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాల్సిన బాధ్యత చైనాదేనని స్పష్టం చేశారు. లేదంటే సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకునే అవకాశాల్లేవని శనివారం ఇండియా టుడే సదస్సులో కుండబద్దలు కొట్టారు. 2020లో ద్వైపాక్షిక ఒప్పందాలను చైనా ఉల్లంఘించడం మొదలు పెట్టినప్పటి నుంచే గల్వాన్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో ఘర్షణలు మొదలయ్యాయని జైశంకర్ వివరించారు. ''చైనాకు దీటుగా మనం కూడా సరిహద్దులకు అత్యంత సమీపంలోకి భారీగా బలగాలు, సైనిక సంపత్తి తరలించాల్సి వచ్చింది. బలగాల ఉపసంహరణపై చర్చలు కొనసాగుతున్నాయి. మేం శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించం, మీరు ఒప్పందాలను ఉల్లంఘించొద్దని చైనాకు చెప్పాం'' అన్నారు.

కోవిడ్ డేటాను చైనా తొక్కిపెడుతోంది

వైరస్ మూలాలపై డేటాను పంచుకోవాలి: డబ్ల్యూహెచ్‌వో

ఐరాస/జెనీవా: 2020లో వూహాన్ మార్కెట్‌లో సేకరించిన శాంపిళ్ల డేటాను చైనా తొక్కిపెడుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆరోపించింది. కరోనా మూలాలను అంచనా వేయడంలో ఈ సమాచారమే కీలకమని పేర్కొంది. కోవిడ్ పరిశోధనల ఫలితాలను అంతర్జాతీయ సంస్థలతో పంచుకుంటూ పారదర్శకంగా వ్యవహరించాలని హితవు పలికింది. మహమ్మారి పుట్టుకను అర్థం చేసుకోవడం నైతిక, శాస్త్రీయ అవసరమని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ ఘెబ్రెసియస్ అన్నారు. ''వూహాన్‌లోని హునాన్ మార్కెట్‌లో సేకరించిన నమూనాల డేటాను ఈ ఏడాది జనవరి చివర్లో ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దాన్ని తిరిగి అందరికీ అందుబాటులో ఉంచాలని చైనాకు చెప్పాం'' అన్నారు. చైనాలోని వూహాన్ నగరంలో 2019 ఆఖరులో పుట్టిన కరోనా వైరస్ సార్స్–కోవ్–2 ప్రపంచమంతటా వ్యాపించి, లక్షలాది మరణాలకు కారణంగా మారడం తెలిసిందే.

అమెరికాలో మన టెకీల మెడపై...

'గడువు' కత్తి!

- ఉద్యోగాలు కోల్పోయి దుర్భర పరిస్థితి
- ముగుస్తున్న '60 రోజుల' గ్రేస్ పీరియడ్
- కొత్త కొలువు రాకుంటే దేశం వీడాల్సిందే
- వేలాది కుటుంబాల్లో పెను సంక్షోభం
- బాధితుల్లో లక్ష మంది భారతీయులే



వాషింగ్టన్: అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయిన హెచ్–1బీ ప్రొఫెషనల్స్ పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోందని ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పొరా స్టడీస్ (ఎఫ్ఐఐడీఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. ''సదరు కుటుంబాలకు ఇది పెను సంక్షోభం. వారికి చూస్తుండగానే సమయం మించిపోతోంది. అమెరికాలో పుట్టిన తమ పిల్లలను వెంటపెట్టుకుని వారి త్వరలో దేశం వీడాల్సిన పరిస్థితులు దాపురించాయి'' అంటూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగం పోయిన 60 రోజుల గ్రేస్ పీరియడ్‌లోగా మరో ఉద్యోగం గానీ, ఉపాధి గానీ చూసుకోని పక్షంలో అమెరికా వీడాల్సి ఉంటుంది. జాబ్ మార్కెట్ అత్యంత ప్రతికూలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అంత తక్కువ సమయంలో మరో ఉద్యోగం వెతుక్కోవడం చాలామందికి దాదాపుగా అసాధ్యంగా మారుతోంది. దొరికినా అత్యంత సంక్లిష్టంగా ఉన్న హెచ్–1బీ మార్పు తదితర నిబంధనల ప్రక్రియను గ్రేస్ పీరియడ్‌లోపు పూర్తి చేయడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో దాన్ని కనీసం 180 రోజులకు పెంచాలంటూ ఆసియా అమెరికన్ల వ్యవహారాలకు సంబంధించిన అధ్యక్షుని సలహా కమిటీ ఇటీవలే సిఫార్సు చేయడం తెలిసిందే. ''దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకున్నా అవి ఆమోదం పొంది అమల్లోకి రావడానికి సమయం పడుతుంది. ఈలోపు 60 రోజుల గ్రేస్ పీరియడ్ పూర్తయ్యే వారికి నిస్సహాయంగా దేశం వీడటం మినహా మరో మార్గం లేదు'' అంటూ ఎఫ్ఐఐడీఎస్ ఆవేదన వెలిబుచ్చింది. ఈ నేపథ్యంలో గ్రేస్ పీరియడ్ పెంపు సిఫార్సును పరిశీలించి నిర్ణయం తీసుకునే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది.

భారీగా ఉద్వాసనలు...: గూగుల్, మైక్రోసాఫ్ట్ మొదలుకుని పలు దిగ్గజ కంపెనీలు కొన్నాళ్లుగా భారీగా ఉద్యోగుల తొలగింపు బాట పట్టడం తెలిసిందే. దాంతో గత నవంబర్ నుంచి అమెరికాలో కనీసం 2.5 లక్షల మందికి పైగా ఐటీ తదితర ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారు. ''వీరిలో దాదాపు లక్ష మంది దాకా భారతీయులేనని అంచనా. ఆదాయ పన్ను చెల్లించే హెచ్–1బి ఇమిగ్రెంట్లయిన వీరు 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగం వెదుక్కుని సదరు కంపెనీ ద్వారా హెచ్–1బికి దరఖాస్తు చేసుకోలేని పక్షంలో దేశం వీడాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు'' అని ఎఫ్ఐఐడీఎస్ పేర్కొంది.



రాష్ట్రంలో పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ షోలాపూర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు



శనివారం నాగపూర్‌లో బైక్ ర్యాలీలో సాహస విన్యాసాలు ప్రదర్శిస్తున్న సీఆర్‌పీఎఫ్ మహిళా బలగాలు



జి-20 సమావేశాల నేపథ్యంలో నాగపూర్‌లోని విధాన్ భవన్ కు ఎదురుగా ఉన్న ఓ భవనానికి జాతీయపతాకంలోని రంగులతో అందంగా అలంకరించిన దృశ్యం

ఉద్యోగుల సమ్మెతో నిలిచిన సేవలు

- పాత పింఛను విధానం పునరుద్ధరించాలని కోరుతూ సమ్మెకు దిగిన ఉద్యోగులు
- ఆర్టీఓ, ఆస్పత్రుల్లో స్తంభించిపోయిన సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సాక్షి, ముంబై: పాత పింఛను పద్ధతిని పునరుద్ధరించాలని కోరుతూ ఐదు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెతో సేవల రంగం స్తంభించిపోయింది. ప్రాంతీయ రవాణ కార్యాలయం(ఆర్టీఓ), ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా ఆర్టీఓలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, పర్మిట్ల జారీ, పన్ను చెల్లింపు తదితర పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా ముంబైలోని ప్రభుత్వ జే.జే.ఆస్పత్రిలో వైద్య సేవలు, ఆపరేషన్లు నిలిచిపోవడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. బంధువులే స్వయంగా రోగులను స్ట్రెచర్లలో ఎక్స్‌-రే, రక్త పరీక్షల ల్యాబ్‌కు తీసుకెళ్లడం, సెలైన్ బాటిళ్లు మార్చుకోవడం లాంటి పనులు చేసుకుంటున్నారు. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) సేవలు కూడా నిలిచిపోవడంతో దగ్గు, దమ్ము, జ్వరం, విరేచనాలు, వాంతులు వంటి వ్యాధులతో వచ్చే రోగులకు మందులు లభించక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది లేక అనేక ఆపరేషన్లు వాయిదా పడ్డాయి. ఎప్పటికప్పుడు జరగాల్సిన వివిధ ఆపరేషన్లలో రోజుకు 16 మాత్రమే జరుగుతున్నాయి. అదికూడా అత్యవసరమైతేనే వాటిని చేస్తున్నారు. మిగతా శస్త్ర చికిత్సలను వైద్యులు వాయిదా వేస్తున్నారు. ఇలా రెండు వారాల తర్వాత ఆపరేషన్లకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు. దీంతో రోగులు వెనుదిరిగి పోతున్నారు. వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు మందులు ఇచ్చే నాథుడే కరువయ్యాడు. వార్డులో వీల్ చైర్లు, స్ట్రెచర్లు, వార్డు బాయ్‌లు లేకపోవడంతో వార్డుల్లో చికిత్స పొందుతున్న అనేక మంది రోగులు స్వచ్ఛందంగా డిశ్చార్జి తీసుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు.



పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ నాగ్‌పూర్‌లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

రద్దీ పెరిగిన బీఎంసీ ఆస్పత్రులు

సమ్మె కారణంగా చాలామంది బీఎంసీకి చెందిన కేఈఎం, నాయర్, సైన్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన జే.జే.ఆస్పత్రిలో వైద్య సేవలు నిలిపివేయడంతో బీఎంసీ ఆస్పత్రుల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగిపోయింది. దీంతో ఇక్కడి వైద్య సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఎక్స్‌-రే, రక్తం, మూత్రం పరీక్షించే ల్యాబ్‌వద్ద, సోనోగ్రఫీ, సిటీ స్కాన్ కేంద్రాలలో బారులు తీరిన వరుసలు కన్పిస్తున్నాయి. సకాలంలో రిపోర్టులు రాకపోవడంతో వైద్యం అందించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో సాధారణ రోగుల పరిస్థితి విషమించే ప్రమాదముందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీవో కార్యాలయాల్లో నిలిచిపోయిన సేవలు

ముంబైలో తాడ్‌దేవ్, వడాల, అంధేరీ, బోరీవలి ఆర్టీఓలలో సిబ్బంది సమ్మెలో ఉన్నారు. నిత్యం వందలాది వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం, పాత లైసెన్స్‌లు రెన్యూవల్ చేయడం, లెర్నింగ్ లైసెన్స్, పర్మిట్లు జారీ చేసే పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా కొత్తగా కొనుగోలు చేసిన ప్రైవేటు కార్లు, ఫోర్స్ వీలర్స్ తదితర వాహనాలు, ఆటో, ట్యాక్సీల రిజిస్ట్రేషన్ పనులు కూడా నిలిచిపోయాయి. సిబ్బంది సమ్మెలో ఉన్నప్పటికీ కొందరు అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారిపై అదనపు భారం పడుతుండటంతో వారు కూడా చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం ఆర్టీఓకు వచ్చిన వేలాది మంది పనులు పూర్తికాకుండానే వెనుదిరుగుతున్నారు.

షోలాపూర్‌లో ఉద్యోగుల ఆందోళన

షోలాపూర్: పాత పించను పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారంతో ఐదో రోజుకు చేరిన సందర్భంగా వివిధ ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా పట్టణంలో పెద్ద ఎత్తున మోర్చా నిర్వహించాయి. చార్ పుత్లా చౌక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ మోర్చ అక్కడ సభ స్వరూపాన్ని దాల్చింది. ఇందులో ప్రతిపక్షాలకు చెందిన వివిధ రాజకీయ నేతలు, పదాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ...ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు విజయం సాధించేంత వరకూ వారికి అండగా నిలబడతామని పేర్కొన్నారు. మోర్చాలో మాజీ ఎమ్మెల్యేలు సిద్ధారాం మేత్రే, ప్రకాశ్ యల్గుల్వార్, నర్సయ్య ఆడం తో పాటు పలువుర ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రణతీ శిందే మాట్లాడుతూ...కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపైనా, రాష్ట్రంలోని బీజేపీ ఆధ్వర్యంలోని శిందే ప్రభుత్వంపైనా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో పనికి వచ్చే 50 ఖోకాలు ఇవ్వడానికి డబ్బులు సమకూరుతాయి కానీ, ఉద్యోగులకు పాత పింఛను అమలు చేయడానికి మాత్రం డబ్బులు ఉండవని ఎద్దేవా చేశారు. పాత పింఛను పద్ధతి అమలు చేసేంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని తేల్చి చెప్పారు. పాత పింఛను విధానాన్ని అమలు చేయకుండా సమ్మెను ఆపాలని చూస్తే భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఎమ్మెన్నెస్ టీజర్ విడుదల



సాక్షి, ముంబై: మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎమ్మెన్నెస్) చీఫ్ రాజ్ ఠాక్రే ఉగాది రోజున జరిగే బహిరంగ సభకు సంబంధించిన టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. మరాఠీ, హిందుత్వం అంశంపై రూపొందించిన ఈ టీజర్ తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోతో పాటుగా 'ఠాక్రే తత్వ్, మరాఠీ సత్వ్, ధర్మాభిమాని హిందుత్వ్'అనే నినాదాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కాగా ఈ టీజర్‌కు రాజ్ ఠాక్రే ఇచ్చిన నినాదానికి ప్రజలనుంచి విపరీతంగా లైక్ లు వస్తున్నాయి. 'మా ధర్మాన్ని ఎవరైనా చేతి గోరుతో తాకే ప్రయత్నం చేసినా ఒక హిందువుగా వారిపైకి దూసుకెళ్తాను'అని వీడియోలో పేర్కొన్నారు. ఏటా ఉగాది రోజున సాయంత్రం దాదర్, శివాజీపార్క్ మైదానంలో రాజ్ ఠాక్రే బహిరంగా సభ ఉంటుంది. ఆ రోజు పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశాలు చేయడం, వివిధ రాజకీయ పార్టీలను లక్ష్యంగా చేసుకుని వాస్తవ పరిస్థితులపై విమర్శలు చేయడం, నాయకుల వాయిస్‌ను అనుకరించడం (మిమిక్రీ) లాంటివి తన ప్రసంగంలో ఉంటాయి. దీంతో ఆయన ప్రసంగం వినేందుకు ముంబై, ఉపనగరాలు, శివారు ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఉగాది రోజు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై ఏ పార్టీని, ఎవరిని లక్ష్యంగా చేసుకుంటారోనని ఆసక్తి నెలకొంది.

క్లుప్తంగా...

వర్లీలో శ్రీవారి పల్లకి ఊరేగింపు

దాదర్: వర్లీలోని శ్రీ సప్తగిరి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉదయం శ్రీవారి పల్లకి ఊరేగింపు జరిగింది. వర్లీలోని పుర విధుల్లో పల్లకిని ఊరేగించారు. ఈ సందర్భంగా మార్గ మధ్యలో భక్తులు పల్లకీని దర్శించుకునేందుకు బారులు తీరారు. శ్రీ సప్తగిరి సేవా సమితికి చెందిన 90 మంది భక్తుల బృందం తిరుమలలో వారం రోజులపాటు సేవలు అందించి ఇటీవల ముంబైకి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ భక్త బృందం వర్లీ బీడీడీ చాల్ నం. 84–85 మధ్యనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి పల్లకీ ఊరేగింపు ప్రారంభించారు. పుర వీధుల్లో ఊరేగిస్తూ ప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ ఊరేంగిపులో సమితి అధ్యక్షుడు ఆసం రాజన్న, ధర్మకర్త చైర్మన్ పొట్టబత్తిని కృష్ణహరిస్వామి, మార్గం రాజగంగారాం, జక్కని శ్రీనివాస్, దాసరి గణేశ్, మద్ది వినోద్, ఓరం దత్తాద్రి, నాగుల రాజేశ్వరీ, జక్కని కరుణ పాల్గొన్నారు.

ఉద్ధవ్ ఠాక్రేతో నటుడు రజినీకాంత్ భేటీ



ముంబై: దక్షిణాది అగ్రనటుడు రజినీకాంత్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేతో శనివారం భేటీ అయ్యారు. శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే కు స్వతహాగా అభిమాని అయిన రజినీకాంత్ ముంబై సబర్బన్ బంద్రాలోని మాతోశ్రీ నివాసంలో ఉద్ధవ్ ఠాక్రేతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉద్ధవ్ ఠాక్రే భార్య రశ్మీ, ఆయన కుమారులు రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే, తేజాలు రజినీకాంత్‌కు స్వాగతం పలికారు. ఉద్ధవ్ ఠాక్రే కుటుంబసభ్యులు రజినీకాంత్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉద్ధవ్ ఠాక్రే-రజినీకాంత్‌లిద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఉద్ధవ్ ఠాక్రే-రజినీకాంత్‌ల భేటీ అయిన ఫొటోను రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కాగా, రాజకీయాలకు అతీతంగానే వీరిద్దరూ భేటీ సాగిందని, రజినీకాంత్ మాతోశ్రీ కి 2010లో వచ్చారని, మళ్లీ ఇప్పుడు తమ నివాసానికి రావడం ఆనందంగా ఉందని ఆదిత్య ఠాక్రే ట్వీట్ చేశారు.

నేడు మెగా బ్లాక్



దాదర్: రైల్వే ట్రాక్స్, సిగ్నల్స్, ఓవర్ హెడ్ వైరు తదితర విద్యుత్ పరికరాలకు నిర్వహణ పనులు ఆదివారం జరగనున్నాయి. ఫలితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మెగాబ్లాక్ తీసుకుంటున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో కొన్ని లోకల్ రైళ్లను దారి మళ్లించడం వల్ల ఆలస్యంగా నడుస్తాయని, మరికొన్ని లోకల్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలపై కూడా మెగా బ్లాక్ ప్రభావం చూపుతుందని అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ మార్గంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్లాక్ ఉంది. కానీ, పశ్చిమ, హార్బర్ మార్గంలో అర్ధ రాత్రి 12 గంటలు దాటిన తర్వాత–తెల్లవారు జాము 4 గంటల మధ్య బ్లాక్ ఉంటుంది. దీంతో ఈ రెండు మార్గాల్లో ప్రయాణించే వారికి ఈ ఆదివారం మెగా బ్లాక్ నుంచి కొంత ఉపశమనం లభించింది. సెంట్రల్ మార్గంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ)-విద్యా విహార్ స్టేషన్ల మధ్య ఉదయం 10.55 నుంచి సాయంత్రం 3.55 గంటల వరకు స్లో అప్, డౌన్ మార్గంలో బ్లాక్ ఉంటుంది. దీంతో స్లో మార్గంలోని రైళ్లన్నీ ఫాస్ట్ మార్గంలోకి మళ్లిస్తారు. లోకల్ రైళ్లను ఫాస్ట్ మార్గంలోకి మళ్లించడం వల్ల దూరప్రాంతాల ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లపై కొంత ప్రభావం చూపుతుందని అధికారులు తెలిపారు.

డబ్బావాలాలకు సమ్మె దెబ్బ

సాక్షి, ముంబై: పాత పింఛను పథకం (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె వల్ల ముంబైలోని కార్యాలయాలకు లంచ్ బాక్స్ సరఫరా చేస్తున్న ముంబై డబ్బావాలాలు ఇబ్బందుల్లో పడిపోయారు. సమ్మె కారణంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు శాతం గణనీయంగా తగ్గిపోయింది. వేళ్లపై లెక్కించే విధంగా ఉద్యోగులు విధులు హాజరవుతున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని డబ్బావాలాలు వాపోతున్నారు. కరోనా కారణంగా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌తో డబ్బావాలాలు ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారు. లాక్‌డౌన్ ఎత్తివేసినప్పటికీ డబ్బావాలాల పరిస్థితి దయనీయంగానే ఉంటోంది. ఒకప్పుడు ముంబైలో ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య, వ్యాపార సంస్థల కార్యాలయాల్లో పనిచేసే రెండు లక్షల ఉద్యోగులకు లంచ్ బాక్స్‌లు సరఫరా చేసేవారు. కానీ, లాక్‌డౌన్ తర్వాత దాదాపు 50% ఉద్యోగులు ఇంటి నుంచి విధులు (వర్క్ ఫ్రం హోం) నిర్వహిస్తున్నారు. ఎలాగో కుటుంబాలను నెట్టుకొస్తున్న ముంబై



డబ్బావాలాల నెత్తిన ఓపీఎస్ సమ్మె పేరుతో మరో పిడుగు పడింది. నిరవధిక సమ్మె కావడంతో ఇంకా ఎన్ని రోజులు సమ్మె కొనసాగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగులు లంచ్ బాక్స్‌లు చేరవేసినందుకు తమకు చెల్లించే రుసుంలో కోత విధిస్తారని డబ్బావాలాలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ద్వారా డబ్బావాలాలకు ఎలాంటి పథకాలు, ఫలాలు లభించడం లేదు. ఉన్న ఒక్క ఆధారం కూడా సమ్మె రూపంలో దెబ్బ తీస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమ్మెను వెంటనే విరమణ ప్రయత్నాలు ప్రారంభించాలని డబ్బావాల సంఘటనకు చెందిన విష్ణు కాళడోకే విజ్ఞప్తి చేస్తున్నారు.

లాంగ్ మార్చ్‌ను విరమించుకున్న రైతులు

ముంబై: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నాసిక్ జిల్లా నుంచి ముంబై వరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో రైతులు, గిరిజనులు చేపట్టిన లాంగ్ మార్చ్‌ను శనివారం నుంచి నిలిపివేశారు. ముంబై వరకు లాంగ్ మార్చ్ చేయాలన్న ఆలోచనను రైతులు విరమించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎంకు చెందిన ఎమ్మెల్యే వినోద్ నికోలే ఒకరు శనివారం మీడియాతో మాట్లాడుతూ...క్వింటా ఉల్లికి రూ.600 ప్రకటించాలని, వ్యవసాయానికి 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ రైతులు, గిరిజనులు ఈ నెల 12 నుంచి నాసిక్ జిల్లాలోని దిండోరి పట్టణం నుంచి ప్రారంభించిన లాంగ్ మార్చ్‌ను శనివారం నుంచి నిలిపివేస్తున్నామన్నారు. ఇప్పటివరకు థానే జిల్లాలోని వసింద్ పట్టణానికి రైతులు చేరుకున్నారు. కాగా, శుక్రవారమే ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే అసెంబ్లీలో ఉల్లి రైతులకు క్వింటాకు రూ.350 లు ఇస్తామని ప్రకటించడంతో లాంగ్ మార్చ్‌ను విరమించుకున్నట్లు ఆయన వివరించారు. రైతులు, గిరిజనుల డిమాండ్లకు శిందే సర్కారు తలొగ్గిందని, డిమాండ్ల అమలుకు కలెక్టర్లు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

లాభాల ఆశ చూపి రూ.300 కోట్లకు టోకరా!

- పుణెలో అష్ట వినాయక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ పేరుతో భారీ మోసం
- భారీగా డబ్బులు కట్టి మోసపోయిన వ్యాపారులు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

పుణె: తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆశజూపి వ్యాపారులనుంచి భారీగా డబ్బులు దండుకున్నాడు. లాభాలమాట దేవుడెరుగు...అసలు డబ్బు మాటేమిటా అని ఆరా తీయడంతో విషయం అర్థమైంది. ఇంకేముంది తాము నమ్మి పూర్తిగా మోసపోయామని అర్థం చేసుకున్న బాధితులు పోలీసుస్టేషన్‌కు పరుగులు తీశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పుణె పోలీసులు మీడియాకు వెల్లడించారు. పుణెకు చెందిన ఓ వ్యక్తి అష్ట వినాయక ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ పేరుతో ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశాడు. అయితే తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని వారికి ఆశ జూపాడు. దీంతో సుమారు 200 మంది అతడి కంపెనీలో భారీగా డబ్బులు పెట్టారు. ఇలా ప్రజల నుంచి సుమారు రూ.300 కోట్ల వరకు డబ్బులు దండుకున్నాడు. దీంతోపాటుగా భారీగా పెట్టుబడులు పెట్టిన వారి పేర్లతో వారికి తెలియకుండా అష్ట వినాయక కంపెనీ బ్యాంకుల నుంచి భారీగా రుణాలను పొందింది. వారి పేర్లమీద రుణాలున్నట్లు విషయం తెలియడంతో సదరు వ్యక్తిని వీరంతా కలసి నిలదీశారు. భారీ లాభాలు వస్తాయి ఓపిక పట్టండి అని వారికి నచ్చజెబుతూ కాలం గడిపేశాడు. ఎంతకీ సదరు వ్యక్తి లాభాల మాట ఎత్తకపోవడం...అష్ట వినాయక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలో డబ్బులు పెట్టిన వారికి ముఖం చాటేస్తుండటంతో డబ్బులు కట్టినవారిలో అనుమానం మొదలైంది. అయితే వారికి మాత్రం తీసుకున్న రుణం డబ్బుల్ని తిరిగి తన కంపెనీలోనే పెట్టుబడిగా పెట్టానని త్వరలోనే భారీగా లాభాలు వస్తాయని చెప్పుకొచ్చాడు. ఈ లోన్లకు సంబంధించి ఎవరూ రూపాయి చెల్లించనవసరం లేదని నమ్మబలికాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన ఓ వ్యక్తి తాను సదరు కంపెనీలో రూ.36 లక్షలు పెట్టుబడి పెట్టానని, లాభాల గురించి అడుగుతుంటే ముఖం చాటేస్తున్నాడని పుణెలోని బండ్ గార్డెన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు అష్ట వినాయక ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ యజమానిపై ఐపీసీ, మహారాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఆఫ్ డిపాజిటర్స్ చట్టం (ఎంపీఐడీ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఇంతవరకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేయలేదని తెలుస్తోంది.

శిందే వర్గంతో కలసే బీజేపీ పోటీ!

- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై బీజేపీ
- 240 స్థానాల్లో బీజేపీ... 48 స్థానాల్లో శిందే వర్గం పోటీ!
- వదంతులు నమ్మవద్దన్న సంజయ్ శిర్సాట్

సాక్షి, ముంబై: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గం, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వర్గం ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనేది సూచనప్రాయంగా ఓ అంగీకారానికి వచ్చామని, వచ్చే ఎన్నికల్లో శిందే వర్గంతో కలిసే పోటీచేయనున్నట్లు బీజేపీ ప్రదేశ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బావన్‌కుళే వెల్లడించారు. ఇరువురం కలిసి 200 స్థానాలకు పైగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున సీట్ల పంపకాలు, సర్దుబాట్లపై పలు చర్చలు జరుపుతామని ఆ తర్వాతే తుది జాబితాను అధికారికంగా విడుదల చేస్తామని భావన్ కుళే శనివారం మీడియాకు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలుండగా అందులో బీజేపీ 240, శివసేన (శిందే వర్గం) 48 స్థానాల్లో పోటీ చేస్తుందని బావన్‌కుళ్లే తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు 2024లో జరగనున్న నేపథ్యంలో దాదాపు ఏడాది కాలం సమయం అన్ని పార్టీలకు ఉండగా... శిందే, బీజేపీ శిబిరంలో మాత్రం ఎన్నికల వాతావరణం అప్పుడే మొదలైనట్లు కనిపిస్తోంది.

ఎంవీఏ ఒప్పందంతో మొదలైన వేడి

మహా వికాస్ ఆఘాడి నేతలు లోక్‌సభ ఎన్నికల్లో ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేయాలనే ఫార్ములా రూపొందించిన విషయం తెలిసిందే. మొత్తం 48 లోక్‌సభ స్థానాల్లో శివసేన 21, ఎన్సీపీ 19, కాంగ్రెస్ 8 స్థానాల్లో పోటీ చేయాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని శిందే, ఫడ్నవీస్ కూడా అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన సూచనప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏక్‌నాథ్ శిందే ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత తన మొదటి ప్రసంగంలో 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు మేం, బీజేపీ కలిసే పోటీ చేస్తామని ప్రకటించారు. ఇరువురం కలిసి 200 స్థానాల్లో గెలుస్తామని ఆ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ మేరకు సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఇప్పటి నుంచే మొదలు పెట్టినట్లు దీన్ని బట్టి స్పష్టమవుతోంది.



ఏక్‌నాథ్ శిందే

భావన్ కుళే

వైరల్ అవుతోన్న భావన్ కుళే వ్యాఖ్యలు

ఇదిలాఉండగా చంద్రశేఖర్ భావన్ కుళే మాట్లాడిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం విపరీతంగా వైరల్ అవుతోంది. అందులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాల్లో పోటీ చేస్తుందని, దీంతో కార్యకర్తలందరూ ఇప్పటి నుంచి అప్రమత్తమై, పనుల్లో నిమగ్నం కావాలని సూచించినట్లు ఉంది. అంటే శిందే వర్గానికి కేవలం 48 స్థానాలు లభిస్తాయని రాష్ట్ర రాజకీయాల్లో చర్చ మొదలైంది. భావన్ కుళే వ్యాఖ్యలపై శిందే వర్గానికి చెందిన సంజయ్ శిర్సాట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు ఎంత వరకు మాట్లాడే అధికారముందో అంతే మాట్లాడాలని అంతకుమించి ప్రకటనలు చేయవద్దని హెచ్చరించారు. అసెంబ్లీ సీట్ల పంపకంపై ఇంతవరకు ఎలాంటి చర్చ జరగలేదని, ఇది కేవలం భావన్ కుళే అభిప్రాయమని స్పష్టం చేసి ఈ అంశానికి అక్కడితో తెరదించారు. ప్రస్తుతం అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చే అంశంపై దృష్టి కేంద్రీకరించామని శిర్సాట్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సీట్ల పంపకంపై పలుమార్లు చర్చలుంటాయని, ఆ తర్వాత తుది నిర్ణయానికి రాగానే అధికారికంగా జాబితా వెల్లడిస్తామని తెలిపారు. అప్పటివరకు అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు సర్దుబాటు ఫార్ములాపై వచ్చిన ఎలాంటి వదంతులను నమ్మవద్దని స్పష్టం చేశారు.



ముంబైలో గతవారం జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో డిజైనర్ మహిమా మహాజన్ రూపొందించిన వస్త్రాలతో ర్యాంప్ వాక్ చేస్తున్న బాలీవుడ్ నటి నష్రత్ బరూచా



ముంబైలో గతవారం జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో డిజైనర్ మోనిషా జైసింగ్ రూపొందించిన వస్త్రాలతో హొయలొలికిస్తున్న ఓ మోడల్

క్లుప్తంగా...



సంద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు..

అల్లూరు: సముద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు ఉన్న సుడిగాలి రూపం నెల్లూరు తీర ప్రాంతంలో అబ్బురపరిచింది. ఈ టోర్నడో అల్లూరు మండలంలోని తాటిచెట్లపాలెం బీచ్‌లో కనిపించింది. ఆకాశంలో నిర్దిష్ట ప్రదేశంలో పీడనం ఏర్పడినపుడు సమీపంలోని సముద్రం నీటిని గాలి పైకి లాగడంతో ఆ దృశ్యం ఆవిష్కృతమైందని నిపుణులు చెబుతున్నారు.

భద్రాద్రి రాములోరి కల్యాణానికి చీరాల గోటి తలంబ్రాలు

చీరాల: భద్రాద్రి సీతారాముల కల్యాణ క్రతువులో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తలంబ్రాలలో వినియోగించే బియ్యాన్ని గోటితో ఒలిచి స్వామివారికి సమర్పించే అవకాశం క్షీరపురిగా పిలిచే చీరాల వాసులకు వరుసగా తొమ్మిదోసారి దక్కింది. ఈ మహాసంకల్పానికి చీరాలకు చెందిన సిద్ధాంతి పి.బాలకేశవులు, మరికొందరు పూనుకుని నియమనిష్టలతో నిర్వహిస్తున్నారు. చీరాలలో శ్రీ రఘురామ భక్తసేవా సమితి 2011లో 11మందితో ఏర్పాటైంది. వీరికి భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవానికి తలంబ్రాలు అందించే అవకాశం పూర్వజన్మ సుకృతంలా వచ్చింది. తలంబ్రాల కొరకు వడ్లను ఎంతో శ్రమించి ఒలిచి, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో కలిపి.. నియమనిష్టలతో, శాస్త్రోక్తంగా తలంబ్రాలు చేస్తారు. విజయదశమి నుంచి ప్రారంభించి ఉగాది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2015 అక్టోబర్ 23న చేపట్టిన ఈ మహా కార్యక్రమంలో.. ఏటా వందలాది భక్తులు పాల్గొంటున్నారు.

గేమ్ ఛేంజర్



పారిశ్రామికాభివృద్ధిలో జీఐఎస్ కీలక మలుపు

- రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి
- శాసన సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు



సాక్షి, అమరావతి: రేపటి తరాల భవిష్యత్, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పరితపిస్తున్న, శ్రమిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏపీలో ఉన్న అపార వనరులను సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నారని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'(ఏపీ జీఐఎస్)పై శాసనసభలో శనివారం స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ఈ చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆ సదస్సులో రూ.13,11,468 కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ క్రమంలో 6,07,383 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిలో జీఐఎస్ గేమ్ చేంజర్ అని కొనియాడారు.

వ్యూహాత్మక విధానాలతో విజయం

'రాష్ట్ర ప్రభుత్వం సమ్మిట్ నిర్వహించడానికి ముందు రోడ్‌షోలు, వివిధ దేశాల దౌత్యవేత్తలతో సమావేశాలు, కర్టెన్‌రైజర్ కార్యక్రమాలు నిర్వహించాం. తద్వారా తీసుకున్న చర్యలు, వ్యూహాత్మక విధానాల ద్వారా విజయం సాధించాం. రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పే వారి కోసం వైఎస్సార్ వన్ కింద 23 శాఖలకు సంబంధించి 96 క్లియరెన్స్‌లు 21 రోజుల్లో ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది ఏపీ ప్రభుత్వమే. రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 48 వేల ఎకరాల భూమి పరిశ్రమలు నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం కూడా మాదే. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం జగన్ ఎంఎస్ఎంఈలకు రీస్టార్ట్, ఇతరత్రా చర్యలతో ప్రాధాన్యం ఇచ్చారు. తద్వారా 13 లక్షల మందికిపైగా ఉపాధి లభించింది. మూడేళ్లలో రూ.56 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 111 భారీ పరిశ్రమలు తీసుకుచ్చాం. వీటిలో 73 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. మరో 88 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి'అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. '2017లో చంద్రబాబు రూ.85,571 కోట్ల ఎంవోయూలు చేసుకుని 45,895 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పినప్పటికీ ఎవరికీ ఉద్యోగా లు రాలేదు. 2018లో రూ.67,115 కోట్లతో ఎంవోయూలు చేసుకుంటే ఇందులో కూడా ఉద్యోగాలు జీరోనే'అని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అది అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కాదు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- నాలుగు కోట్ల ఓటర్లలో.. ఇప్పుడు ఓటు వేసింది ఎనిమిది లక్షలే



సాక్షి, అమరావతి: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం ప్రతిబింబించవంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి కొట్టిపారేశారు. ఏపీలోని నాలుగు కోట్ల మంది ఓటర్లలో మూడు పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది లక్షల మంది ఓటర్లు ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఫలితాలతోనే తాము బలం పుంజుకున్నామని.. ఏదో జరిగిపోతుందని టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. శనివారం ఆయన వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పీడీఎఫ్, వామపక్షాల ఓట్లతోనే..

'గతంలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు, పీడీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల యూనియన్‌లు, ఇతర యూనియన్‌లు పోటీ చేస్తే.. వాటికి రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ఈసారి మూడు పట్టభద్ర, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపాం. ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీని ఆదరించి, రెండు స్థానాల్లోనూ గెలిపించారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇదే ప్రథమం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి పీడీఎఫ్, వామపక్షాలు ఓట్లేయించడం వల్లే ఆ పార్టీ గెలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎన్నికల ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు టీడీపీ అభ్యర్థి ఓట్లలో కలిపారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం'అని సజ్జల తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని స్పష్టంచేశారు. 2019 ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఓటుకు కోట్లు తరహాలో బాబు కుట్ర

'శాసనసభలో టీడీపీకి సాంకేతికంగా 23 మంది సభ్యులు ఉన్నప్పటికీ.. అందులో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానానికి టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించారు. గతంలో తెలంగాణలో సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి.. నోట్ల కట్టలతో సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో టేపులతో చంద్రబాబు పట్టుబడ్డ విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే రీతిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు కుట్రలు చేయొచ్చు' అని సజ్జల పేర్కొన్నారు.



సీఎం జగన్‌తో ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన నూతన ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో శనివారం నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నర్తు రామారావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని సీఎం జగన్ అభినందించారు. శాసనమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన సీఎంకు నూతన ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో ప్రాధాన్యత ఓటుతో గట్టెక్కిన టీడీపీ

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాల వెల్లడి
- పశ్చిమ రాయలసీమలో భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి
- తూర్పు రాయలసీమలో కంచర్ల.. ఉత్తరాంధ్రలో చిరంజీవిరావు

సాక్షి ప్రతినిధి, అనంతపురం/చిత్తూరు కలెక్టరేట్/సాక్షి, విశాఖపట్నం: తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండవ ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించ లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించాయి. మూడు రోజులుగా కొనసాగిన కౌంటింగ్ ప్రక్రియలో శనివారం తుది ఫలితాలు వెలువడ్డాయి. నువ్వా నేనా అన్నట్టు సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 7,543 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ రావడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి పాలయ్యారు. మొత్తం మీద బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)కి 1,09,781 ఓట్లు, వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)కి 1,02,238 ఓట్లు వచ్చాయి. కాగా, అనంతపురంలోని కౌంటింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులు తిష్ట వేయడంతో తొలి నుంచి అనుమానాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఈ అనుమానాలు నిజమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చెందిన ఓట్లు కొన్ని తెలుగుదేశం పార్టీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్స్ వరకు మాత్రమే లెక్కిస్తామని అధికారులు చెప్పారు.

పీడీఎఫ్‌తో పొత్తు వల్లే గెలుపు

తూర్పు రాయలసీమలో, ఉత్తరాంధ్రలోనూ పీడీఎఫ్ ఓట్ల వల్లే టీడీపీ అభ్యర్థులు గట్టెక్కగలిగారు. పొత్తు లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోతామన్న భయంతో ముందే పీడీఎఫ్ నేతలను బతిమాలి మరీ టీడీపీ నేతలు రెండవ ప్రాధాన్యత ఓటుపై పొత్తు పెట్టుకున్నారు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ గట్టెక్కగలిగింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ (తూర్పు రాయలసీమ)గా టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో స్పష్టత రాకపోవడంతో.. పీడీఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లతో గెలుపు వరించింది. శ్రీకాంత్‌కు 1,24,181 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి 90,071 ఓట్లు వచ్చాయి. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. విజయానికి 94,509 ఓట్లు కావాల్సి ఉండగా, టీడీపీ మద్దతు అభ్యర్థికి 82,958 ఓట్లు.. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 55,749, పీడీఎఫ్ అభ్యర్థికి 35,148 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 10,884 ఓట్లు వచ్చాయి. దీంతో 36 రౌండ్లలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. బీజేపీ, పీడీఎఫ్ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతోనే టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు.

హైదరాబాద్ నగర వార్తలు

పోలీసులు, ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పని చేయాలి

- అప్పుడే గరిష్ట శిక్షా రేటు సాధ్యం
- రాచకొండ సీపీ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: పోలీసులు, ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేస్తే నేరస్తుడికి తగిన శిక్ష పడుతుందని, న్యాయ వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. శనివారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో పోలీసు, ప్రాసిక్యూషన్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శిక్షా రేటును పెంచే లక్ష్యంతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో కేసుల విచారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. రాష్ట్రంలో గరిష్ట శిక్షా రేటులో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను అభినందించారు. డ్రగ్స్ కేసులలోనూ చెక్‌లిస్ట్‌లను అనుసరిస్తూ నేరస్తులకు తగిన శిక్ష పడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ... కేసుల సత్వర పరిష్కారానికి, సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ ప్రకారం శిక్షా రేటును సాధించడానికి, బాధితులు, వారి కుటుంబాలకు సకాలంలో న్యాయం అందించేందుకు పోలీసులు సమయానుకూలంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీసు సిబ్బంది తో పాటు ప్రాసిక్యూషన్ తరఫున డిప్యూటీ డైరెక్టర్ కస్తూరి , జాయింట్ డైరెక్టర్ రాజి రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌పై వేటు

- సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- భూ తగాదాల్లో తలదూర్చడమే కారణం
- తాత్కాలిక ఎస్‌హెచ్‌ఓగా డీఐ కాశీ విశ్వనాథ్

సాక్షి, సిటీబ్యూరో: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) కిరణ్ కుమార్‌పై రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ వేటు వేశారు. అతడిని సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో అదే స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం. కాశీ విశ్వనాథ్‌ను తాత్కాలిక ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇప్పటివరకు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన కిరణ్ కుమార్ మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఓ భూ తగాదాలో తలదూర్చినట్లు సీపీ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆయనను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. గత ఏడాది అక్టోబర్‌లో ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ కొద్ది నెలల్లోనే బదిలీ కావడం గమనార్హం.

వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు త్రివేణి సంగమం ముస్తాబు



రెండవ భద్రాద్రిగా భక్తుల నమ్మకం

- నేడు కోయల్ అళ్వార్ తిరుమంజన సేవ
- ఉగాది రోజు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



భక్తులతో కిక్కిరిసిన రాంలీలా మైదానం(ఫైల్) (ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన సీతారామలక్ష్మణులు

లంగర్‌హౌస్: వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పవిత్ర త్రివేణి సంగమం ముస్తాబవుతోంది. స్వయంగా రామలక్ష్మణులు మారువేషంలో వచ్చి ఇక్కడ రెండు రోజులు విడిది చేసినట్లు భక్తుల నమ్మకం. లంగర్‌హౌస్ త్రివేణి సంగమం ఒడ్డున వెలసిన చారిత్రక జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం ఉగాది పర్వదినాన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సీతారాములు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రతి రోజు పుర వీధుల్లో ఊరేగించనున్నారు. ఈ నెల 30న శ్రీరామనవమి రోజున రాంలీలా మైదానంలో జానకీ రాములకు వైభవోపేతంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు....

- ఈ నెల 22న ఉగాది పర్వదినాన ఉదయం 6 గంటలకు మూల విరాట్‌కు ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. 9 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హవనం, రాత్రి 7 గంటలకు సహస్ర దీపారాధన పల్లకీ సేవ నిర్వహిస్తారు. అనంతరం విశ్వక్‌సేనుని పూజ, పంచాంగ శ్రవణం ఉంటాయి.
- 25న సామూహిక శ్రీనివాస కల్యాణ మహోత్సవం , అనంతరం నారాయణుడి రూపంలో కొలువుదీరిన శ్రీనివాసుడిని గరుడ వాహనంపై ఊరేగిస్తారు.
- 28న లక్ష్మీనారసింహస్వామి కల్యాణం, సీతారాములకు మంగళ స్నానాలు, వసంతోత్సవం జరుగుతాయి. అనంతరం భారీ హనుమాన్ వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు.
- 29న సీతారాములను పెళ్లి కుమారుడు, పెళ్లి కూతుర్లుగా ముస్తాబు, తలంబ్రాలు కలిపే కార్యక్రమాలు జరుగుతాయి.

30న రాములోరి కల్యాణం.....

ఈ నెల 30న జానకీ దేవి, శ్రీరాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. రాంలీలా మైదానంలో పందిళ్లు, భారీ వేదికపై వివిధ క్షేత్రాల నుంచి తరలివచ్చే సాధుసంతులు, పీఠాధిపతులు, వేదపండితుల సమక్షంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం, సాయంత్రం కళాకారుల ప్రదర్శనలు, భజనలతో కల్యాణ సీతారాముల ఊరేగింపు ఉంటాయి. 31న శ్రీరామ చంద్రులకు పట్టాభిషేకం, రాజతిలకం, చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

నేడు కోయల్ అళ్వార్ తిరుమంజన సేవ....

సీతారాముల కల్యాణాన్ని సంగం ఆలయంలో నేటి నుంచి కోయల్ అళ్వార్ తిరుమంజన సేవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా సుగంధ పరిమళ ద్రవ్యాలతో మూలవిరాట్‌లను, గర్భాలయాలు, ఉత్సవ మూర్తులను, ఆభరణాలను శుభ్రపరచనున్నారు. పలు ప్రాంతాలకు చెందిన సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

'అన్నమయ్య జానపద జాతర' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వరప్రసాద్‌రెడ్డి, ఓలేటి పార్వతీశం తదితరులు

సుల్తాన్‌బజార్: శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 520 వ వర్ధంతి ఉత్సవాలు శనివారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ గరికపాటి వ్యాఖ్యానంతో రూపొందించిన 'అన్నమయ్య జానపద జాతర' గ్రంథావిష్కరణ, అన్నమయ్య మధుర గీతాగోవిందం అనే అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాన సహిత చిత్ర గాత్ర గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాంతా బయోటెక్ చైర్మన్ డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు వైవిధ్యానికి మచ్చుతునకలని, ఆ సాహితీ మధురిమలను అందరికీ పంచాలనే తపనతో ముందుకు సాగుతున్న వెంకట్ అభినందనీయుడన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ అన్నమయ్య వాగ్గేయకారులకు మార్గదర్శకులని, అన్నమయ్య నుడికారంలో ఉన్న తియ్యదనం అనితర సాధ్యమన్నారు. వెంకట్ భవిష్యత్తులో మరిన్ని వ్యాఖ్యాన గ్రంథాలను తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాయకులు సురేఖ మూర్తి, పవన్‌కుమార్ అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో శ్రీరామ సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ప్రముఖ సాహితీవేత్త సుధామ, గురుప్రసాద్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్



గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడా సమయం ఉండాలని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. నాలుగురోజులుగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరుగుతున్న నగర పోలీస్‌శాఖ వార్షిక క్రీడా ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో క్రీడల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్ మాట్లాడుతూ.... ఉద్యోగుల పోటీ తత్వాన్ని, క్రీడా స్ఫూర్తిని అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీపీ సీవీ ఆనంద్ సతీమణి లలిత ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ జి.సుధీర్‌బాబు, లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ఎస్‌బి.జాయింట్ సీపీ పి.విశ్వప్రసాద్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు 28న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

వెంగళరావునగర్: దేశ వ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీ గణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం యూసుఫ్‌గూడలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండిగారి రాజుగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీసీ కులగణన చేపడతామని చెప్పి విస్మరించిందన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల నేతలతో కలిసి ఈనెల 28, 29 తేదీల్లో దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షలు, ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. బీసీల హక్కులను సాధిస్తామని, కేంద్ర ప్రభుత్వ బీసీ వ్యతిరేక నిర్ణయాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు కె.శ్రీనివాస్, కనకాల శ్యాంకుర్మ, బాసాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: పండుగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఫ్యాషన్ ప్రియులను అలరించేందుకు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో స్ప్రింగ్ సమ్మర్ ఎడిషన్‌తో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. శనివారం ఈ ప్రదర్శను సినీ నటి రాశీసింగ్ ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రఖ్యాత డిజైనర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఈ ఎగ్జిబిషన్‌లో ఆభరణాలు, దుస్తులు, గౌన్‌లు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 20 వరకు మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



గొడవ పడుతున్నాడని 'ఊపిరి' తీసింది

- భర్తను హతమార్చిన భార్య

ఇబ్రహీంపట్నం రూరల్: నిత్యం మద్యం తాగి గొడవ పడుతున్నాడని.. కొడుతున్నాడని విసిగి వేసారిన ఓ మహిళ కట్టుకున్నవాడి 'ఊపిరి' తీసింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలో చెక్క పొన్నయ్య (52), యాదమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. పొన్నయ్య కూలీగా పని చేస్తుండగా, యాదమ్మ మొజంజాహి మార్కెట్‌లో స్వీపర్‌గా పని చేసేది. పొన్నయ్య ప్రతి రోజు మద్యం తాగి వచ్చి యాదమ్మను కొడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 10న మంచాలలో వివాహం ఉండగా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి 15న తిరిగి వచ్చారు. శుక్రవారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంట్లో ఉంచిన రూ.2వేలు ఏమయ్యాయని పొన్నయ్య భార్యను నిలదీశాడు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో పొన్నయ్య కింద పడిపోవడంతో యాదమ్మ అతడిపై కూర్చుని మెత్తతో ముక్కు, నోరు మూసి హత్య చేసింది. అనంతరం ఏమీ ఎరగనట్లు డ్యూటీకి వెళ్లిపోయింది. శనివారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రావడం లేదని చుట్టుపక్కలవారికి అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా పొన్నయ్య విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆదిబట్ల పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యాదమ్మ హత్య చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌ను కలిసిన ఇండోనేషియా కాన్సుల్ జనరల్

రాంగోపాల్‌పేట్: రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా ముంబై కాన్సుల్ జనరల్ ఆగస్ పీ సప్టోనో శనివారం రాష్ట్ర గవర్నర్ తమిళ్ సై సౌందర్ రాజన్‌ను కలిశారు. నగరానికి వచ్చిన ఆయన రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వంగా గవర్నర్‌ను కలిశారు. ఆయనతో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఉన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఆగస్ పీ సప్టోనో

నలుగురు అక్కచెల్లెళ్లు.
లక్ష్మి ఆర్య, కవిత ఆర్య, రజిత ఆర్య, సరిత ఆర్య.
వీరిది తెలంగాణలోని ఓ వ్యవసాయ కుటుంబం.
ఈ నలుగురూ వేదాలను అభ్యసించారు.
కంప్యూటర్ యుగంలో అందులోనూ
ఆడపిల్లలకు వేదాలెందుకు
అనేవారి నోళ్లను మూయిస్తూ
యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ,
అపార పాండిత్యంతో ఔరా అనిపిస్తూ
సంస్కృతంలో విద్యార్థులను నిష్ణాతులు చేస్తూ
తమ ప్రతిభను చాటుతున్నారు.
రంగారెడ్డి జిల్లా ఎదిర గ్రామమైన
ఈ అక్కాచెల్లెళ్లను కలిస్తే
వేదాధ్యయనం గురించి
ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.

విద్యార్థుల చేత హోమం చేయిస్తున్న సోదరీమణులు



* గురుకులం

వేద విద్యామణులు

‘‘మా అమ్మానాన్నలు ఆంచ సుమిత్ర, జంగా రెడ్డి. నాల్గవ తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నాం. మా మామయ్య విద్వాంసుడవడంతో అతని సూచన మేరకు మా నలుగురు అక్కచెల్లెళ్లను కాశీలోని పాణిని కన్యా మహావిద్యాలయంలో చేర్పారు. కాశీ అంటేనే విద్యానగరి. విద్యలన్నీ అక్కడ సులభంగా లభిస్తాయని ప్రతీతి. అక్కడే పద్దేళ్లపాటు వేదాదేవి సాన్నిధ్య శిష్యరికాలలో విద్యాభ్యాసం చేశాం. ఆత్మరక్షణ కోసం శస్త్ర, శాస్త్రాలు సాధన చేశాం.

■ **ఆడపిల్లలకు వేదాలా..?**

వేదాలు బ్రాహ్మణులు కదా చదివేది అనేవారున్నారు. ఆడపిల్లలకు వేదం ఎందుకు అన్నారు. ఎక్కడ రాసుంది స్త్రీ వేదాలు చదవకూడదని, వేద మంత్రమే చెబుతుంది ప్రతి ఒక్కరూ వేదాన్ని పఠించవచ్చు అని. మేం చదివిన గురుకులాన్ని కూడా ప్రజ్ఞాదేవి, భేదాదేవి అనే అక్కచెల్లెళ్లు ఎంతో కృషితో నడిపిస్తున్నారు. రిషిదయానంద్ అనే విద్వాంసుడు స్త్రీని బ్రహ్మ పదవిపై కూర్చోబెట్టారు. వారి వద్ద విద్యను నేర్చుకున్న ఆ అక్కచెల్లెళ్లు వాళ్లు. ఆడపిల్లలు వేదాలు వినడమే నిషేధం అనే రోజుల్లోనే వారిద్దరూ వేదాధ్యయనం చేసి, గురుకులాన్ని స్థాపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వారి శిష్యులు గురుకులాలు స్థాపించి, వేదాన్ని భావితరాలకు అందిస్తున్నారు.

■ **అన్ని కర్మలు**

ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలను ఔపోసన పట్టడమే కాదు పౌరోహిత్యం, పుట్టినప్పటి నుంచి మరణించేవరకు మధ్య ఉన్న అన్ని కర్మలూ విధి విధానాలతో చేస్తున్నాం. కొంత మంది ‘ఇదేం విచిత్రం’ అన్నవారూ లేకపోలేదు. అనేవారు చాలా మందే అంటారు. కానీ, మేం వాటికి మా విద్య ద్వారానే సమాధానం చెబుతున్నాం. పురాణ, ఇతిహాసాల్లో గార్గి, మైత్రి, ఘోశ, అపాల .. వంటి స్త్రీలు వేదాభ్యాసం చేసి, తమ సమర్థత చూపారు. అయితే, చాలా మందికి వారి గురించి తెలియదు.

■ **ఉచిత తరగతులు**

మా నలుగురిలో లక్ష్మి ఆర్య, సరిత ఆర్య చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో విద్యార్థులకు వేద విద్యను బోధిస్తున్నారు. పౌరహిత్యంతో పాటు ఆన్‌లైన్ లోనూ, ఆఫ్‌లైన్ లోనూ భగవద్గీత, సంస్కృత పాఠాలను ఉచితంగా చెబుతున్నాం. మా నలుగురి ఆలోచన ఒక్కటే సంస్కృతం విస్తృతంగా ప్రచారం కావాలి. ఆడపిల్లలూ వేద విద్యలో ముందంజలో ఉండాలి. మా వద్ద పిల్లలతోపాటు పెద్దవాళ్లు కూడా సంస్కృతం అభ్యసిస్తున్నారు’’ అని వివరించారు ఈ నలుగురు అక్కచెల్లెళ్లు.

నేటి కాలంలో వేద విద్యపై ఎవరూ ఆసక్తి చూపడం లేదని, అందుకోసమే తాము వేద విద్యలో పట్టు సాధించాలనుకున్నాం అని తెలిపారు ఈ సోదరీమణులు. తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి సంస్కృత వ్యాకరణంలో రజిత ఆర్య, సరిత ఆర్య పీహెచ్‌డీ పట్టా అందుకుని ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.



లక్ష్మి, కవిత, రజిత, సరిత

– నిర్మలారెడ్డి
– బాలయ్య, కొందుర్గు, రంగారెడ్డి జిల్లా, సాక్షి

స్త్రీ శక్తి



లండన్ మ్యూజియానికి పింక్ శారీ!

ఎగరడానికి రెక్కలు సవరించిన కాలం అది. ‘పోనీలే’ అని రాజీపడే జీవులు సమరశంఖం కోసం గొంతు సవరించిన కాలం అది. ‘గులాబీ గ్యాంగ్’ అంటే పోరాట చరిత్ర. ఇప్పుడు ఆ చరిత్ర లండన్ మ్యూజియానికి చేరనుంది.

ప్రపంచంలోని ప్రఖ్యాత మ్యూజియంలలో లండన్ ‘డిజైన్ మ్యూజియం’ ఒకటి. ప్రపంచ నలుమూలలకు సంబంధించి భిన్నమైన డిజైన్‌లకు ఇదో వేదిక. ఈ వేదికపై స్త్రీ శక్తిని ప్రతిఫలించే, ప్రతీకగా నిలిచే గులాబీ రంగు చీర సగర్వంగా రెపరెపలాడనుంది.

2006లో.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాందా జిల్లాలో ఏ కొద్ది మందో మహిళలలో తప్ప ఎవరూ ప్రశాంతంగా లేరు. పట్టపగలు రోడ్డు మీదికి వెళ్లాలన్నా భయపడే రోజులు. మరోవైపు కట్నపు వేధింపులు, గృహహింస!

అలాంటి సమయంలో ‘మనం ఏం చేయలేమా!’ అనే నిస్సహాయతలో నుంచి పుట్టుకు వచ్చిందే గులాబీ గ్యాంగ్!

‘నువ్వు నేను కాదు... మనం’ అనే నినాదంతో బృందంగా ముందుకు కదిలారు. పింక్ శారీని యూనిఫామ్‌గా చేసుకున్నారు. ఈ బృందానికి సంపత్‌పాల్‌దేవి నాయకత్వం వహించింది. పదుల సంఖ్యతో మొదలైన గులాబీ గ్యాంగ్‌లో ఇప్పుడు దేశవ్యాప్తంగా 11 లక్షల మంది సభ్యులు ఉన్నారు.

తాజాగా...

లండన్ ‘డిజైన్ మ్యూజియం’ క్యూరేటర్ ప్రియా ఖాన్‌చందాని నుంచి సంపత్‌పాల్ దేవికి ఇ–మెయిల్ వచ్చింది. అందులో ఉన్న విషయం సంక్షిప్తంగా...‘ప్రియమైన గులాబీ గ్యాంగ్ సభ్యులకు, మీ ధైర్యసాహసాలకు సంబంధించిన వార్తలను ఎప్పటికప్పుడు చదువుతూనే ఉన్నాను. నాకు అవి ఎంతో ఉత్తేజాన్ని, బలాన్ని ఇస్తుంటాయి. మీ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచే గులాబీ రంగు చీరను ఆఫ్‌బీట్ శారీ టైటిల్‌తో మ్యూజియంలో ప్రదర్శించాలనుకుంటున్నాం. ఈ అవకాశాన్ని గర్వంగా భావిస్తున్నాము’


‘మా పోరాట స్ఫూర్తి విదేశీగడ్డపై అడుగు పెట్టబోతున్నందుకు సంతోషంగా ఉంది. మా సభ్యులలో ఒకరు ధరించిన చీరను పంపబోతున్నాం’ అంటుంది సంపత్‌పాల్‌దేవి.



బెల్లి, బొమ్మన్

● ఆ ఇద్దరికి తోడు ఏనుగు

మావటీల జీవితాల్లో వెలుగు తెచ్చారు



‘నాకు అడివంటే చాలా భయం’ అంటుంది బెల్లి. ఆస్కార్ వచ్చిన ‘ఎలిఫెంట్ విస్పరర్స్’ డాక్యుమెంటరీలో మావటి బొమ్మన్ భార్య ఆమె. భర్తతో కలిసి రఘు అనే పిల్ల ఏనుగును ఆమె సాకుతుంది. దాంతోపాటు ‘అమ్ము’ అనే ఇంకో పిల్ల ఏనుగు బాగోగులను బెల్లి చూస్తుంది. బొమ్మన్ ప్రభుత్వ ఉద్యోగి. బెల్లి కాదు. అయినా సరే భర్త డ్యూటీలో ఆమె భాగం పంచుకుంది. భర్తతో పాటే పని ఏనుగులను చూసుకుంది.

‘నా భర్తను పులి చంపింది. అప్పటి నుంచి అడివంటే భయం. బొమ్మన్‌ను చేసుకున్నాక కొంచెం భయం పోయింది. పిల్ల ఏనుగుల బాగోగుల్లో పడ్డాక, వాటి వెంట తిరుగుతుంటే అడివంటే భయం పోయింది’ అంటుంది బెల్లి.

నీలగిరి (ఊటీ) అడవుల్లో ఉండే ఎలిఫెంట్ క్యాంపుల్లో ఏనుగుల సంరక్షణ మావటీలు చూస్తారు. వీళ్లంతా దాదాపు ఆ ప్రాంత గిరిజనులే. ఏనుగులను చూసుకోవడం మగవారి పనే. అయితే బొమ్మన్ చూసేది పిల్ల ఏనుగులను కనుక వాటి అమాయకత్వానికి ముగ్ధురాలై అమ్ము కూడా వాటితో అనుబంధం పెంచుకుంటుంది.

ఆమెకు రఘు, అమ్ము ఎంత మాలిమి అంటే డాక్యుమెంటరీలో అమ్మును పిలిచి ‘ఏయ్... నా ఒడిలో కాదు. పక్కన పడుకో. లేకుంటే దెబ్బలు పడతాయి’ అనంటే ఆ ఏనుగు ఆమె పక్కన మెల్లగా ఒత్తిగిలి పడుకోవడం ముచ్చట గొలుపుతుంది. అమ్ముకు బెల్లి రెండు జడలు వేసి నవ్వుకుంటూ ఉన్నప్పుడు ఈ డాక్యుమెంటరీ ముగుస్తుంది.

అయితే బొమ్మన్ వల్ల, అమ్ము వల్ల, ఈ డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించిన కార్తికి వల్ల దేశంలో ఇప్పుడు ఏనుగుల సంరక్షణ గురించి చర్చలు జరుగుతున్నాయి. తమిళనాడు సి.ఎం స్టాలిన్ వెంటనే స్పందించి బొమ్మన్, బెల్లిలను పిలిచి చెరొక లక్ష డబ్బు ఇచ్చి సన్మానం చేశారు. తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న 91 మంది మావటీలకు కూడా మనిషికో లక్ష ఇవ్వనున్నారు. వీరి నివాసాల కోసం 9 కోట్లు మంజూరయ్యాయి. అలాగే ఏనుగుల క్యాంపుల కోసం 13 కోట్లు మంజూరయ్యాయి.

ప్రేమ, ఆదరణల వల్ల ఎప్పుడూ మంచే జరుగుతుంది. బొమ్మన్, బెల్లిలతో అది మరోసారి రుజువయ్యింది.

హెల్త్

ప్రోస్టేట్ పెరిగితే?

మన మానవాళి విస్తరిస్తోందంటే దానికి తోడ్పడే గ్రంథుల్లో కీలకమైనది ప్రోస్టేట్. కేవలం పురుషులలో మాత్రమే ఉంటూ పునరుత్పత్తికి తోడ్పడే ఈ గ్రంథే లేకపోతే సంతానమే లేదు. వృషణాలు వీర్యకణాలను ఉత్పత్తి చేస్తాయి. ఆ వీర్యకణాలు ఈదడానికి కావాల్సిన ద్రవాన్ని ఉత్పత్తి చేసే ఈ ప్రోస్టేట్ గ్రంథి... చాలామందిలో వాళ్ల 50వ ఏళ్ల వయసు తర్వాత అమాంతం పెరిగిపోయి కొన్ని అనర్థాలను తెచ్చిపెడుతుంది. అవేమిటో, వాటిని అధిగమించాల్సిన మార్గమేమిటో వివరించే కథనమిది.



ప్రోస్టేట్ సాధారణంగా 18–22 గ్రాముల బరువుంటుంది. కానీ 50 ఏళ్లు దాటిన కొందరిలో ఇది అకస్మాత్తుగా సైజు పెరిగిపోయే అవకాశం ఉంది. మానవ శరీర నిర్మాణం ఎంత సంక్లిష్టంగా ఉంటుందంటే... మూత్రంనాళం చుట్టూతా ఈ ప్రోస్టేట్ గ్రంథి ఆవరించి ఉండటంతో... ఇది హఠాత్తుగా సైజ్ పెరగడంతో ఆ నాళం నొక్కుకుపోయి... క్రితం రోజుదాకా సాఫీగా వచ్చిన మూత్రం అకస్మాత్తుగా ఆగిపోయి, లోపల ఎంతగానో మూత్రం వస్తున్నట్లు అనిపిస్తున్నా, ఎంతగా ముక్కుతున్నా రాక బెంబేలెత్తిస్తుంది. అలాంటి సమయాల్లో అత్యవసరంగా హాస్పిటల్‌కు వెళ్లాల్సిన స్థితిలో ‘ప్రోస్టేట్ పెరుగుదల’ (ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్) తెలుస్తుంది. కొందరిలో మాత్రమే ఇలా పెరిగిపోయే ఈ గ్రంథి సైజు... ఎందుకంత హఠాత్తుగా పెరిగిపోతుందనేది ఇప్పటికీ వైద్యవర్గాలకు తెలియని రహస్యమే. అది వయసు పెరగడం వల్ల వచ్చే అనేక పరిణామాల్లో అదీ ఒకటిగా భావిస్తున్నారు.

రెండు రకాలుగా పెరుగుదల: ప్రోస్టేట్ పెరుగుదల రెండు రకాలుగా ఉంటుంది. సైజు పెరిగినప్పటికీ ఆ కణాల్లో ఏదీ ప్రమాదకరం కాకుండా కేవలం సైజు మాత్రమే పెరుగుతుంది. ఇలాంటి పెరుగుదలను ‘బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా’ అంటారు.

ఇక రెండోది క్యాన్సర్ కణాల వల్ల సంభవిస్తుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ కారణంగా ఆ గ్రంథి సైజు పెరుగుతుంది. ఇది ప్రమాదకరం. ఒక్కోసారి ప్రాణాంతకం కూడా.

లక్షణాలు: ప్రోస్టేట్ పెరుగుదలలో రెండు విధాలుగా లక్షణాలు కనిపిస్తాయి. మొదటిది స్టోరేజీ... అంటే మూత్రం భర్తీ అవడం వల్ల కనిపించే లక్షణాలు. రెండోది వాయిడింగ్... అంటే మూత్రపు సంచి (బ్లాడర్) ఖాళీ కావడానికి సంబంధించిన లక్షణాలు.

స్టోరేజీ: ● రాత్రివేళల్లో మామూలు కంటే ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిరావడం. ● పగటి వేళల్లో కూడా చాలా ఎక్కువసార్లు మూత్రానికి వెళ్లాల్సిరావడం. ● మూత్రం ఏమాత్రం ఆపుకోలేకపోవడం. ● మూత్రవిసర్జనపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం.

వాయిడింగ్: ● మూత్రవిసర్జన కోసం నిలబడ్డ తర్వాత ఎంతోసేపటికి గాని మూత్రపు ధార మొదలుకాకపోవడం. ● మూత్రపుధార మెల్ల మెల్లగా, ఆగుతూ ఆగుతూ వస్తుండటం. ● మూత్రపు సంచి (బ్లాడర్) ఖాళీ కావడానికి చాలా సమయం తీసుకోవడం. ● మూత్రవిసర్జన అన్నది ఎప్పటిలా సాఫీగా కాకుండా చాలా శ్రమతో, బాధతో జరుగుతున్నట్లుగా అనిపించడం. ● మూత్రవిసర్జనలో నొప్పి. ● మూత్రవిసర్జన ముగిసే సమయానికి ముక్కి ముక్కి పోయాల్సిరావడం. ● ఆ తర్వాత కూడా మూత్రం ఎంతోకొంత లోపలే ఉండిపోవడం (లేదా అలా ఉండిపోయిన ఫీలింగ్ ఉండటం). ● ఒక్కోసారి మూత్రపు ధారలో రక్తపు చారిక కనిపించడం (మూత్రంలో లేదా బ్లాడర్‌లో ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు ఇది కనిపిస్తుంది).

నివారణ: ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ నివారణ పూర్తిగా మన అదుపులో ఉండదు. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తల ద్వారా ప్రోస్టేట్ సమస్యలను కొంతవరకు నివారించవచ్చు. అవి...

● మూత్రవిసర్జన ఫీలింగ్ రాగానే... ఆపుకోకుండా వెంటనే మూత్రవిసర్జన చేసేయాలి. ● కెఫిన్ మోతాదులు ఎక్కువగా ఉండే కూల్ డ్రింకులూ, కాఫీ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఒకవేళ తీసుకోవాల్సి వస్తే చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. ● నిద్రకు ఉపక్రమించబోయే ముందర 2 – 3 గంటల ముందుగా మాత్రమే నీళ్ల తాగడం / ద్రవాహారాలు తీసుకోవడం. ● డాక్టర్ సలహా లేకుండా అలర్జీల కోసం / ఊపిరితిత్తుల్లోకి గాలి సాఫీగా ప్రవహించేలా చేసే డీ-కంజెస్టెంట్స్ లేదా యాంటీహిస్టమైన్ మందులు తీసుకోకపోవడం. ఇవి బినైన్ ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా ముప్పును పెంచే అవకాశం ఉంది. ● చాలా చల్లని వాతావరణంలో మనల్ని మనం వెచ్చగా ఉంచుకోవడం (చలి వాతావరణం ఈ సమస్యను మరింత పెంచుతుంది). ● చురుగ్గా ఉండాలి. ఇందుకోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ● పొత్తికడుపు కండరాలపై నియంత్రణను పెంచే ‘కెగెల్స్ ఎక్సర్‌సైజ్’లు ప్రాక్టీస్ చేయడం కొంతవరకు మేలు చేస్తుంది. ● శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవడం.

సమస్య నిర్ధారణ ఇలా

● ఈ సమస్య నిర్ధారణ కోసం వైద్యులు ‘డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్’ (డీఆర్‌ఈ) ద్వారా ప్రోస్టేట్ పెరిగినదీ, లేనిదీ తెలుసుకుంటారు. దాంతో పాటు... ● మైక్రోస్కోప్ సహాయంతో ఏదైనా ఇన్ఫెక్షన్‌ను అన్వేషిస్తూ చేసే మూత్రపరీక్ష ● యూరిన్ కల్చర్ ఎగ్జామినేషన్ ● మూత్ర ప్రవాహ వేగం (యూరనరీ ఫ్లో / యూరోఫ్లోమెట్రీ) ● పొత్తికడుపు భాగంలో నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్. ● ఈ పరీక్ష ద్వారా మూత్రపిండాలు (కిడ్నీ), యురేటర్ (మూత్రపిండం నుంచి మూత్రపు సంచి వరకు ఉండే ట్యూబ్), మూత్రపు సంచి (బ్లాడర్)ల పరిమాణంతో పాటు మూత్రపు సంచిలో మూత్రం మిగిలిపోతోందా అన్న విషయాలు తెలుస్తాయి. ● బ్లడ్ యూరియా, క్రియాటినైన్ పరీక్షలు.

చికిత్స: ప్రోస్టేట్ గ్రంథికి వచ్చిన సమస్య, పెరుగుదలకు కారణాలూ, దాని తీవ్రతా, లక్షణాలూ... బాధితులు ఎదుర్కొనే సమస్యలను బట్టి చికిత్స ఉంటుంది. ఉదాహరణకు...

● **ప్రోస్టెటైటిస్ :** ప్రోస్టేట్ గ్రంథికి వచ్చే ఇన్ఫెక్షన్‌ను ప్రోస్టెటైటిస్ అంటారు. మిగతా ఇన్ఫెక్షన్‌ల లాగానే దీనికి యాంటిబయాటిక్స్‌తో చికిత్స చేస్తే పూర్తిగా తగ్గుతుంది. కాకపోతే కాస్త ఎక్కువ కాలం పాటు ఈ చికిత్స చేయాల్సి ఉంటుంది. ● మూత్రాన్ని ఏమాత్రం ఆపుకోలేకపోవడం, మూత్రధారలో రక్తపు చారిక, పెరిగిన ప్రోస్టేట్ గ్రంథి అన్నివైపుల నుంచి నొక్కేయడం వల్ల మూత్రం లోపలే ఉండిపోవడం, మాటిమాటికీ వచ్చే ఇన్ఫెక్షన్లూ, కిడ్నీ దెబ్బతినడం వంటి సమస్యల్ని తొలుత మందులతో అదుపు చేయడానికి ప్రయత్నిస్తారు. అప్పటికీ మందులతో అదుపు సాధ్యం కాకపోతే అప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుంది. ● ప్రోస్టేట్ పెరిగిన పరిమాణం, దాని ఆకృతి వంటి అంశాలను బట్టి వేర్వేరు రకాల ప్రక్రియలు (ప్రొసీజర్స్) అవసరమవుతాయి. వీటన్నింటిలో బినైన ప్రోస్టేటిక్ హైపర్‌ప్లేసియా సమస్య కోసం సాధారణంగా ‘ట్రాన్స్ యురెథ్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్’(టీయూఆర్‌పీ) అనే శస్త్రచికిత్స ప్రక్రియను అనుసరిస్తుంటారు. ● కొందరిలో లేజర్ సహాయంతో ‘లేజర్ ప్రోస్టెక్టమీ’ చేస్తుంటారు. మామూలు శస్త్రచికిత్సతో పోలిస్తే దీనిలో కొన్ని ప్రయోజనాలు ఎక్కువ. రక్తాన్ని పలచబార్చే మందులు వాడుతున్నవారికీ, ప్రోస్టేట్ సైజు విపరీతంగా పెరిగినవారు, గుండె సమస్యలున్నవారికీ లేజర్ సహాయంతో చేసే చికిత్స వల్ల ప్రయోజనాలుంటాయి. ఉదాహరణకు ● రక్తస్రావం చాలా తక్కువ ● హాస్పిటల్‌లో ఉండాల్సిన వ్యవధి కూడా తక్కువ కావడం ● త్వరగా కోలుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఉంటాయి.

పై అంశాలను దృష్టిలో ఉంచుకుని... మూత్రవిసర్జన కోసం చాలాసేపు టాయ్‌లెట్‌లో గడపాల్సి వస్తున్నా, ధార సరిగా లేకపోయినా, విసర్జన తర్వాత కొంత మిగిలిపోయినట్లు అనిపిస్తున్నా... ఒకసారి యూరాలజిస్టును సంప్రదించి, తగిన పరీక్షలు చేయించుకుని, అవసరాన్ని బట్టి తగిన చికిత్స తీసుకోవడం మేలు.




డా. వి. చంద్రమోహన్,
సీనియర్ యూరాలజిస్ట్,
యూరో సర్జన్

అన్ని పోషకాలూ అందించడం ఎలా?

మెడి టిప్

అన్నం సయించడం లేదంటూ పెద్దగా తినలేని వారికి... వారు తినే కొద్దిపాటి ఆహారంలోనే వీలైనన్ని రకరకాల పదార్థాలు తినిపించేందుకు ప్రయత్నించాలి. దాంతో కొద్దిగానే తిన్నప్పటికీ వారికి అవసరమైన మోతాదులో అన్ని పోషకాలూ అందించేందుకు వీలవుతుంది. అందుకే చేయాల్సింది ఇది... ఇలాంటి వారికి రోజూ చపాతి లేదా అన్నంతో పాటు పప్పులు (దాల్) లేదా శెనగలు, రాజ్మా వంటివి ఇవ్వాలి. దాంతో వారికి కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు సమకూరుతాయి. భోజనం చివర్లో ఓ కప్పు పెరుగన్నం తినిపించాలి. భోజనానికి ముందు కూరగాయలను సలాడ్స్‌గా తీసుకునేలా చేయాలి. ప్రతిరోజూ నిద్రకు కాసేపు ముందు ఓ కప్పు పాలు ఇస్తే ఆరోగ్యకరమైన కొవ్వులు, క్యాల్షియమ్ కూడా సమకూరుతాయి. ఆ సీజన్‌లో దొరికే అన్ని రకాల తాజా పళ్లు తీసుకోవాలి. అప్పుడప్పుడూ తృణధాన్యాలతో చేసిన చిరుతిండ్లు తినాలి. అవి చిరుతిండ్లు కావడం, అందునా తీసుకునే పరిమాణం కూడా చాలా తక్కువ కావడంతో సయించకపోవడం ఉండదు. ఇలా ఇన్నిరకాల వెరైటీలు తీసుకోవడం వల్ల దేహానికి అవసరమైన పిండిపదార్థాలూ (కార్బోహైడ్రేట్లు), ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజలవణాలూ, మైక్రో, మ్యాక్రో న్యూట్రియెంట్లు... అన్నీ అందేందుకు అవకాశం ఉంది.

చిన్నారుల్లో దొడ్డికాళ్ల సమస్య పరిష్కారాలిలా..!



పిల్లల్లో నిటారుగా నిలబడ్డ సమయంలో... మోకాళ్ల వద్ద ఉండాల్సిన దూరం కంటే బాగా ఎక్కువగా ఉంటూ, అరికాళ్లు దగ్గరగా ఉండే కండిషన్‌ను విల్లు కాళ్లు లేదా ‘బౌడ్ లెగ్స్’ లేదా జీనూవేరమ్ అని అంటారు. అప్పుడే పుట్టిన పిల్లల్ని చూసినప్పుడు ఆ ఎముకలు ఇలా కనిపించడం చాలా సాధారణం. ఎందుకంటే పుట్టినపుడు పిల్లలందరూ దాదాపు ఎంతోకొంత బౌడ్ లెగ్స్‌తోనే ఉండటానికి కారణం... పిండ దశలో శిశువు కాళ్లు బాగా దగ్గరకు ముడుచుకుని (ఫోల్డెడ్ పొజిషన్‌లో) ఉంటాయి. అందుకే అవి అలా కనిపిస్తాయి. కానీ ఎదుగుతున్న కొద్దీ ఈ లోపం క్రమంగా మాయమవుతుంది. పిల్లలు నడక మొదలు పెట్టడం, తమ కాళ్లపై బరువు మోపడం ప్రారంభం కావడంతోనే ... అంటే... ఏడాదిన్నర లేదా రెండేళ్ల నాటి నుంచి కాళ్లు మామూలుగా కావడం మొదలై మూడేళ్ల వయస్సు వచ్చేసరికి నార్మల్ షేప్‌కు వస్తాయి. మూడేళ్లు పైబడ్డాక కూడా బౌడ్ లెగ్స్ ఎక్కువగా (సివియర్ బౌడ్ లెగ్స్) ఉంటే అలాంటి పరిస్థితికి కారణాలు ఏమై ఉంటాయా అని ఆలోచించాల్సి ఉంటుంది. అలాగే ఇంకొంతమంది పిల్లల్లో సరిగ్గా దీనికి పూర్తిగా విరుద్ధమైన కండిషన్ ఉంటుంది. అంటే నిటారుగా నిలబడ్డప్పుడు వాళ్ల కాళ్లు... మోకాళ్ల దగ్గర బాగా దగ్గరగా, చీలమండల దగ్గర దూరంగా ఉంటాయి. ఈ కండిషన్‌ను వంకర మోకాళ్లు లేదా ‘జీనూ వల్గమ్’ అని అంటారు.

నిర్ధారణ పరీక్షలు: సాధారణంగా డాక్టర్లు వ్యక్తిగత పరిశీలనలోనే చాలావరకు ఈ సమస్యను గుర్తిస్తారు. అటు తర్వాత ఎక్స్‌-రే, ఈ సమస్యలకు కారణాలు కనుగొనడం కోసం కొన్ని రక్తపరీక్షలు అవసరమవుతాయి.

చికిత్స : ఏ కారణాన్ని బట్టి సమస్య వచ్చిందన్న అంశంపై చికిత్స ఆధారపడి ఉంటుంది. ఇది విటమిన్–డి లోపం కారణంగా వస్తే ఆ లోపాన్ని భర్తీ చేయడం ద్వారా చికిత్స అందించాల్సి ఉంటుంది. ఐదేళ్లలోపు పిల్లలకు లెగ్ బ్రేసెస్ (పట్టీలు) వాడాల్సి రావచ్చు. అయితే చాలా మంది పిల్లల్లో ఎలాంటి చికిత్సా లేకుండానే పరిస్థితి చక్కబడుతుంది. ఇక చాలా తక్కువ మందిలో మాత్రం శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.

ఈ సమస్యలకు కారణాలు :
● శరీర ఆకృతిలో పుట్టుకతో వచ్చే లోపాలు ● రికెట్స్ వంటి వ్యాధులు (విటమిన్–డి లేదా క్యాల్షియం లోపంతో పాటు కిడ్నీ సంబంధిత కారణాలతో) ● ఇన్ఫెక్షన్ రావడం ● ఫ్రాక్చర్ కావడం ● మోకాళ్ల వద్ద పెరుగుదల ఆగిపోవడం ● ఊబకాయం ● అరుదుగా కణుతులు.

తల్లిదండ్రులు చేయాల్సిందేమిటి?

సాధారణ నడక, పరుగు వంటి చిన్న పిల్లల చేష్టలకు ఈ సమస్యలు ఏమాత్రం అడ్డంకి కాకపోతే పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. కానీ ఒకవేళ పిల్లలు పరుగులు పెడుతున్నప్పుడు ఈ కారణంగా తరచూ పడిపోవడం వంటి సమస్యలు ఉంటే తప్పక వెంటనే చిన్నపిల్లల ఆర్థోపెడిక్ నిపుణులను సంప్రదించాల్సి ఉంటుంది. అయితే కొన్ని కండిషన్స్‌లో చికిత్స ఆలస్యం చేస్తే అది పిల్లల్లో వైకల్యానికి దారితీసే అవకాశం ఉన్నందున... పిల్లల్లో ఈ తరహా సమస్య ఉంటే మాత్రం ఒకసారి డాక్టర్‌కు చూపాక నిశ్చింతగా ఉండటమే మంచిది.



డాక్టర్ వెంకట్ రామ్ త్యాలపల్లి,
పీడియాట్రిక్ ఆర్థోపెడీషియన్ అండ్ ఇలిజారోవ్ స్పెషలిస్ట్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్
కాంటాక్ట్ నంబర్: 8882 046 046
www.rainbowhospitals.in



ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో బోపన్న జోడీ

ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్ కొనసాగిస్తూ భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న మూడో టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. కాలిఫోర్నియాలో జరుగుతున్న ఇండియన్ వెల్స్ ఓపెన్ ఏటీపీ మాస్టర్స్–1000 టోర్నీలో బోపన్న–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం టైటిల్ పోరుకు అర్హత సాధించింది. సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జోడీ 7–6 (8/6), 7–6 (7/2)తో జాన్ ఇస్నెర్–జాక్ సాక్ (అమెరికా) ద్వయంపై గెలుపొందింది. గంటా 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ తమ సర్వీస్‌లో తొమ్మిదిసార్లు బ్రేక్ పాయింట్లు కాపాడుకోవడం విశేషం. ఇటీవల దోహా ఓపెన్‌లో బోపన్న–ఎబ్డెన్ జంట టైటిల్ సాధించగా... రోటర్‌డామ్ ఓపెన్‌లో రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. బెంగళూరుకు చెందిన 43 ఏళ్ల బోపన్న ఇప్పటి వరకు కెరీర్‌లో 55 టోర్నీల్లో ఫైనల్‌కు చేరగా...23 టోర్నీల్లో టైటిల్స్ నెగ్గి, 32 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

గాయత్రి–ట్రెసా జోడీ ఓటమి



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లో నిష్క్రమించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జంట 10–21, 10–21తో బేక్ నా హా–లీ సో హీ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. 'ఈ మ్యాచ్‌తో చాలా విషయాలు నేర్చుకున్నాం. ప్రత్యర్థి జోడీ ఒక్క షటిల్ కూడా వదలకుండా ఆడగా... మేము కాస్త ఒత్తిడికి గురయ్యాం' అని గాయత్రి వ్యాఖ్యానించింది. సెమీస్‌లో ఓడిన గాయత్రి–ట్రెసా జాలీలకు 17,500 డాలర్ల (రూ. 14 లక్షల 44 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 8,400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత బాక్సర్ల జోరు



న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల విజయపరంపర కొనసాగుతోంది. శనివారం బరిలోకి దిగిన ముగ్గురు భారత బాక్సర్లు నీతూ (48 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు), ప్రీతి (54 కేజీలు) తమ ప్రత్యర్థులను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత నీతూ కొరియా బాక్సర్ డోయోన్ కాంగ్‌ను ఓడించగా... ప్రీతి 4–3తో లాక్రామియోరా పెరిజోచ్ (రొమేనియా)పై, మంజు 5–0తో కారా వెరెరావ్ (న్యూజిలాండ్)పై విజయం సాధించారు.

పెరెజ్‌కు 'పోల్ పొజిషన్'

జిద్దా: సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ ప్రధాన రేసును రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ 'పోల్ పొజిషన్'తో ప్రారంభిస్తాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో పెరెజ్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను పూర్తి చేశాడు. ఫెర్నాండో అలోన్సో (ఆస్టిన్ మార్టిన్) రెండో స్థానం నుంచి... జార్జి రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు.

వైజాగ్‌లో సిరీస్ సాధిస్తారా!

- నేడు ఆస్ట్రేలియాతో భారత్ రెండో వన్డే
- బరిలో రోహిత్ శర్మ
- మ్యాచ్ రోజున భారీ వర్షసూచన!
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం





సాక్షి, విశాఖపట్నం: ఆస్ట్రేలియాను టెస్టు సిరీస్‌లో ఓడించిన భారత జట్టు ఇప్పుడు వన్డే సిరీస్‌లో కూడా పడగొట్టేందుకు మరో మ్యాచ్ దూరంలో ఉంది. ఇరు జట్ల నేడు విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో రెండో వన్డే జరుగుతుంది. ఈ పోరులో గెలిస్తే సిరీస్ భారత్ ఖాతాలో చేరుతుంది. మరోవైపు సిరీస్‌ను సజీవంగా ఉంచేందుకు ఆసీస్‌కు ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. వ్యక్తిగత కారణాలతో తొలి వన్డే నుంచి తప్పుకున్న రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో సారథిగా బాధ్యతలు తీసుకుంటాడు.

మూడో స్పిన్నర్‌కు చోటు...

తొలి వన్డేలో భారత పేసర్లు షమీ, సిరాజ్ చక్కగా రాణించారు. స్పిన్ విభాగంలో జడేజా రాణించగా, కుల్దీప్ మాత్రమే కొన్ని పరుగులిచ్చాడు. అయితే ముంబైతో పోలిస్తే వైజాగ్ పిచ్ స్పిన్‌కు మరింత అనుకూలంగా ఉండటంతో రెండో రెగ్యులర్ స్పిన్నర్ ఉంటే బాగుంటుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అదే జరిగితే శార్దుల్ ఠాకూర్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం దక్కవచ్చు. మూడో పేసర్ పాత్రను హార్దిక్ సమర్థంగా నిర్వహిస్తుండటంతో శార్దుల్ అవసరం ఇప్పుడు జట్టుకు కనిపించడం లేదు. బ్యాటింగ్‌లో ఊహించినట్లు గానే మిడిలార్డర్‌లో శ్రేయస్ లేని లోటు కనిపిస్తోంది. సూర్యకుమార్ మరోసారి వన్డేల్లో అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లోనైనా ఆడకపోతే అతను వన్డే కెరీర్ ఇబ్బందుల్లో పడటం ఖాయం. రోహిత్ రాకతో ఓపెనింగ్‌లో జట్టు బలం పెరిగింది. గత మ్యాచ్‌లో విఫలమైన కోహ్లి తన స్థాయికి తగ్గట్లు ఆడితే భారీ స్కోరు ఖాయం.

వార్నర్ ఆడితే...

మరోవైపు ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిన స్థితిలో బరిలోకి దిగుతోంది. అయితే ఆ జట్టు బ్యాటింగ్ బలహీనత తొలి వన్డేలో స్పష్టంగా కనిపించింది. గాయం నుంచి కోలుకున్న వార్నర్ ఆడితే జట్టులో ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరం. పైగా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు జరుగుతాయి. కీపర్ ఇన్‌గ్లిస్ స్థానంలో క్యారీ వస్తాడు. హెడ్, లబుషేన్ రాణించడం కీలకం. అయితే అన్నింటికి మించి స్టీవ్ స్మిత్ ఫామ్ ఆసీస్‌ను ఆందోళన పరుస్తోంది. భారత్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి అతను కనీసం ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ఇప్పటికైనా అతను ఆ లోటును తీర్చుకుంటాడా చూడాలి. స్టార్క్ తన బౌలింగ్ పదును భారత్‌కు చూపించగా... తొలి వన్డేలో ఒక బౌలర్‌ను తక్కువగా ఆడించి ఇబ్బంది పడిన కంగారూలు ఈసారి ఎలా వ్యూహం మారుస్తారో చూడాలి.

వాన గండం...

విశాఖ పిచ్ మొదటి నుంచి బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. దాదాపు అన్ని మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఈసారి కూడా అలాంటి పిచ్ ఎదురు కావచ్చు. అయితే వర్షం ఆటకు ఇబ్బందిగా మారవచ్చని తెలుస్తోంది. స్థానిక వాతావరణ సూచన ప్రకారం ఆదివారం వాన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, రాహుల్, పాండ్యా, జడేజా, సుందర్, కుల్దీప్, షమీ, సిరాజ్. ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), మార్ష్, హెడ్, లబుషేన్, క్యారీ, గ్రీన్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, అబాట్, స్టార్క్, జంపా.

7 విశాఖపట్నంలో భారత్ 9 వన్డేలు ఆడగా...7 గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఓడిపోగా, మరో మ్యాచ్ 'టై'గా ముగిసింది. ఈ వేదికపై ఆడిన ఆరు వన్డేల్లో కోహ్లి 118, 117, 99, 65, 157 నాటౌట్, 0 స్కోర్లు నమోదు చేశాడు.

సూపర్ సోఫీ...

- 36 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్స్‌లతో 99
- 189 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో ఛేదించిన బెంగళూరు


సోఫీ డివైన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఫామ్‌లోకి వచ్చింది. ఆడిన తొలి ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన బెంగళూరు జట్టు వరుసగా రెండో విజయం అందుకుంది. గుజరాత్ జెయింట్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. గుజరాత్ జెయింట్స్ నిర్దేశించిన 189 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు 15.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మహిళల ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఇదే అత్యధిక ఛేదన కావడం విశేషం. బెంగళూరుకు ఆడుతున్న న్యూజిలాండ్ క్రికెటర్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 99; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. కేవలం పరుగు తేడాతో సెంచరీని కోల్పోయింది. స్మృతి (31 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్), సోఫీ తొలి వికెట్‌కు 9.2 ఓవర్లలో 125 పరుగులు జోడించడం విశేషం. సోఫీ అవుటయ్యాక ఎలీస్ పెరీ (12 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు), హీథెర్ నైట్ (15 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) దూకుడు కొనసాగిస్తూ బెంగళూరు జట్టును విజయ తీరానికి చేర్చారు. అంతకుముందు గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసింది. లౌరా వోల్వార్ట్ (42 బంతుల్లో 68; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), యాష్లే గార్డ్‌నర్ (26 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

ముంబై ఇండియన్స్‌కు తొలి ఓటమి

ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి అజేయంగా ఉన్న ముంబై ఇండియన్స్‌కు తొలి ఓటమి ఎదురైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ ఐదు వికెట్ల తేడాతో ముంబై జట్టును ఓడించింది. తొలుత ముంబై జట్టు 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. హేలీ మాథ్యూస్ (35; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఇసీ వాంగ్ (32; 4 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ కౌర్ (25; 3 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. యూపీ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ (3/15), రాజేశ్వరి (2/16), దీప్తి శర్మ (2/35) రాణించారు. అనంతరం యూపీ వారియర్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. తాలియా మెక్‌గ్రాత్ (38; 6 ఫోర్లు, 1 సిక్స్), గ్రేస్ హారిస్ (39; 7 ఫోర్లు) మెరిపించగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (13 నాటౌట్; 1 ఫోర్), సోఫీ ఎకిల్‌స్టోన్ (16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) యూపీ జట్టు విజయాన్ని ఖాయం చేశారు.

విలియమ్సన్, నికోల్స్ 'డబుల్' సెంచరీలు


విలియమ్సన్


నికోల్స్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, హెన్రీ నికోల్స్ ఆ దేశం తరఫున అరుదైన ఘనత సాధించారు. ఒకే ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీలు సాధించిన తొలి కివీస్ ద్వయంగా గుర్తింపు పొందారు. వీరిద్దరి జోరుతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 4 వికెట్ల నష్టానికి 580 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కేన్ విలియమ్సన్ (296 బంతుల్లో 215; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు), హెన్రీ నికోల్స్ (240 బంతుల్లో 200 నాటౌట్; 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) ద్విశతకాలతో చెలరేగారు. మూడో వికెట్‌కు 363 పరుగులు జోడించిన వీరిద్దరు ఈ క్రమంలో పలు కొత్త రికార్డులు నమోదు చేశారు. టెస్టుల్లో 8 వేల పరుగులు పూర్తి చేసుకున్న విలియమ్సన్... ఈ మైలురాయిని దాటిన తొలి కివీస్ బ్యాటర్‌గా నిలవడంతో పాటు అన్ని ఫార్మాట్‌లలో కలిపి ఆ దేశం తరఫున అత్యధిక సెంచరీలు (41) సాధించిన ఆటగాడిగా కూడా నిలిచాడు. అనంతరం శ్రీలంక రెండో రోజు ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 26 పరుగులు చేసింది.

ఐఎస్‌ఎల్ విజేత ఏటీకే మోహన్ బగాన్




గోవా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్‌ను ఏటీకే మోహన్ బగాన్ (కోల్‌కతా) ఫుట్‌బాల్ క్లబ్ తొలిసారి సొంతం చేసుకుంది. ఫైనల్లో ఏటీకే మోహన్ బగాన్ 'పెనాల్టీ షూటౌట్'లో 4–3తో బెంగళూరు ఎఫ్‌సీ జట్టును ఓడించింది. నిర్ణీత సమయం వరకు రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. అదనపు సమయంలోనూ స్కోరు సమంగా ఉంది. దాంతో విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్' అనివార్యమైంది. 'షూటౌట్'లో మోహన్ బగాన్ తరఫున వరుసగా పెట్రాటోస్, లిస్టన్, కియాన్, మాన్వీర్ గోల్స్ చేశారు. బెంగళూరు తరఫున అలన్ కోస్టా, రాయ్ కృష్ణ, సునీల్ ఛెత్రి సఫలంకాగా... రమిరెస్, పెరెజ్ విఫలమయ్యారు.

సినిమా

యాక్షన్ ట్రైన్

తెరపై విలన్‌ని హీరో రఫ్ఫాడిస్తుంటే ప్రేక్షకులకు దక్కే కిక్కే వేరు. అందుకే యాక్షన్ సీన్స్‌ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తుంటారు. ఇప్పుడు కొన్ని సినిమాల కోసం ట్రైన్‌లో ఫైట్ సీన్స్ డిజైన్ చేస్తున్నారు. ట్రైన్‌లో రిస్కీ యాక్షన్ సీన్స్ చూపించనున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● కమల్ హాసన్


● రామ్‌చరణ్

ట్రైన్‌లో భారతీయుడు

దర్శకుడిగా శంకర్ పరిచయమైన తొలి సినిమా 'జెంటిల్ మేన్'. ఈ సూపర్‌డూపర్ హిట్ ఫిల్మ్‌లో యాక్షన్ కింగ్ అర్జున్ హీరోగా నటించారు. ఈ సినిమా ప్రారంభంలోనే ఓ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుంది. ఆసక్తికర విషయం ఏంటంటే... శంకర్ దర్శకత్వం వహించిన ఆ తర్వాతి చిత్రాల్లో రజనీకాంత్ 'రోబో', విక్రమ్ 'ఐ' (తెలుగులో 'మనోహరుడు') వంటి వాటిలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టారు శంకర్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. దాదాపు పాతికేళ్ల తర్వాత కమల్, శంకర్ కాంబోలోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ సౌత్ ఆఫ్రికాలో జరగనుంది. అక్కడ దాదాపు రెండు వారాలపాటు షూటింగ్‌ని ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్‌లోనే ఓ భారీ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట శంకర్. ఫారిన్ ఫైటర్స్, ఫారిన్ యాక్షన్ మాస్టర్స్ ఈ ఫైట్‌ను డిజైన్ చేయనున్నట్లు సమాచారం. 'ఇండియన్ 2'లో ఉన్న మేజర్ హైలైట్స్‌లో ఇదొకటనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.

పది కోట్ల ఫైట్

ఒకవైపు కమల్‌హాసన్‌తో 'ఇండియన్ 2' సినిమా చేస్తూనే మరోవైపు రామ్‌చరణ్‌తో 'సీఈవో' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా చేస్తున్నారు శంకర్. ఈ సినిమా షూటింగ్‌ని యాక్షన్ సీన్‌తోనే ఆరంభించారు. భారీ స్థాయిలో ఓ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు దర్శకుడు శంకర్. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో వందమందికి పైగా ఫైటర్స్ పాల్గొన్నారని, ఈ ఫైట్ ఖర్చు రూ. పది కోట్లు పైనే అనే టాక్ వినిపిస్తోంది. మరి.. ఈ ఫైట్ ఏ విధంగా ఉంటుందనేది తెలియాలంటే వచ్చే ఏడాది వరకూ ఆగాల్సిందే. ఎందుకంటే ఈ సినిమాను వచ్చే ఏడాది రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్, రిలీజ్ డేట్‌పై అధికారిక ప్రకటన వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ చిత్రం కోసం రామ్‌చరణ్ పాల్గొనగా ఓ పాట చిత్రీకరణ జరుగుతోంది. ఈ పాటకు ప్రభుదేవా కొరియోగ్రాఫర్.


● రవితేజ

నాగేశ్వరరావు దోపిడీ

స్టువర్టుపురం దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ లుక్‌లో రవితేజ రైలు పట్టాలపై ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కథ రీత్యా ట్రైన్‌లో నాగేశ్వరరావు దోపిడీ చేసే సీన్ అట అది. ట్రైన్‌లో చిన్నపాటి యాక్షన్ టచ్ కూడా ఉంటుందట. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.


● నాని


● అఖిల్


● కల్యాణ్ రామ్


● విజయ్ సేతుపతి

డెవిల్ పోరాటం

స్వాతంత్ర్యానికి పూర్వం అంటే 1945లో బ్రిటిష్‌వాళ్ళు పరిపాలించిన మద్రాస్ ప్రెసిడెన్సీ నేపథ్యంలో జరిగే కథతో రూపొందుతున్న చిత్రం 'డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్'. ఈ చిత్రంలో కల్యాణ్ రామ్ టైటిల్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కల్యాణ్ రామ్ ఓ ట్రైన్‌పై ఉన్నట్లు కనిపిస్తుంది. యాక్షన్ సీన్‌లో భాగంగా ఈ ట్రైన్ వస్తుందని తెలుస్తోంది. నవీన్ మేడారం దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

బొగ్గు దొంగ

తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల సమీపంలో గల ఓ కల్పిత గ్రామంలో జరిగే కథగా రూపొందిన చిత్రం 'దసరా'. ఇందులో మద్యానికి బానిస అయి, బొగ్గు దొంగతనం చేసే ధరణి పాత్రలో కనిపిస్తారట నాని. ఇటీవల విడుదలైన 'దసరా' ట్రైలర్‌లో బొగ్గు ఉన్న గూడ్స్ ట్రైన్‌పై నాని ఉన్న సీన్ కనిపిస్తుంది. ఇది ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్ అని టాక్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.

లోకల్ ట్రైన్‌లో ఏజెంట్

లోకల్ ట్రైన్‌లో ఫైట్స్ చేశారట అక్కినేని అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. గత ఏడాది వేసవిలో 'ఏజెంట్' షూటింగ్ హైదరాబాద్ మెట్రో రైల్‌లో జరిగింది. ట్రైన్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా సురేందర్ రెడ్డి చిత్రీకరించారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక 'ఏజెంట్' చిత్రం ఏప్రిల్ 28న విడుదల కానుంది.

ఎనిమిది కోట్ల యాక్షన్

సూరి, విజయ్ సేతుపతి, గౌతమ్ మీనన్ ప్రధాన పాత్రల్లో వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విడుదలై'. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రంలోని తొలి భాగం 'విడుదలై పార్ట్ 1' ఈ నెల 31న విడుదల కానుంది. ఈ చిత్రం కోసం దర్శకుడు వెట్రిమారన్ ఓ భారీ ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్‌ను తీశారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఖర్చు దాదాపు రూ. 8 కోట్లు అని సమాచారం. కాగా 'విడుదలై' రెండో భాగం విడుదలపై కూడా త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాల్లో ట్రైన్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి.

ముహూర్తం కుదిరింది


● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఈ నెల 23న జరపనున్నట్లు శనివారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం ఈ సినిమా కోసం హైదరాబాద్ శివార్లలో పోర్టు సెట్‌ను రూపొందిస్తున్నారు. కాగా ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఆ ఆలోచన లేదు
– నాని


● దీక్షిత్ శెట్టి, శ్రీకాంత్ ఓదెల, కీర్తీ సురేశ్, నాని, సుధాకర్


''దసరా' కోసం ప్రాణం పెట్టి చేశాను. ఈ సినిమా తర్వాత నా కెరీర్ ఏ స్థాయిలో ఉంటుందనేది దేవుడికి వదిలేస్తున్నా. ఫలానా ఇమేజ్‌ని కాపాడుకోవాలనే ఆలోచన నాకెప్పుడూ లేదు. నా మనసుకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వెళుతున్నా'' అని హీరో నాని అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేశ్ జంటగా నటించిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 30న విడుదలకానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో నాని మాట్లాడుతూ– ''డైరెక్టర్ శ్రీకాంత్‌కు తెలిసిన ప్రపంచమే 'దసరా' సినిమా. మాకు కొత్త ప్రపంచాన్ని చూపించాడు. తెలంగాణలోని వీర్లపల్లి ప్రాంతమంతా సెలబ్రేట్ చేసుకునే చిత్రమిది. దేశమంతా మా 'దసరా' విడుదల కోసం ఎదురు చూస్తోందని ప్రమోషన్ టూర్‌లో మాకు అర్థమయింది. సుధాకర్‌గారికి ఈ సినిమాతో రివార్డులు, అవార్డులు మొదలవుతాయని భావిస్తున్నాను'' అన్నారు. ''నానీగారితో 'దసరా' తీసేందుకు మూడేళ్లు ఎదురు చూశాం'' అన్నారు సుధాకర్ చెరుకూరి. ''ఈ మూవీని అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు శ్రీకాంత్ ఓదెల. నటీనటులు ఝాన్సీ, నాగబాబు మాట్లాడారు.

అప్పుడు నచ్చిన సినిమా తీయొచ్చు
– నిర్మాత రాజేష్ దండా



''డిస్ట్రిబ్యూటర్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ఆ తర్వాత నిర్మాతగా మారాను. నా వరకు నిర్మాతగానే బావుంది. మనకి నచ్చిన కథతో సినిమా నిర్మించామనే సంతృప్తి ఉంటుంది'' అన్నారు రాజేష్ దండా. సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో 'ఊరు పేరు భైరవకోన', శ్రీవిష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో 'సామజ వరగమన' చిత్రాలను అనిల్ సుంకర సమర్పణలో నిర్మించారు రాజేష్ దండా. ఈ రెండు చిత్రాల గురించి రాజేష్ దండా మాట్లాడుతూ– ''స్వామి రారా'తో పాటు దాదాపు 80 చిత్రాలు పంపిణీ చేశాను. 'కేరాఫ్ సూర్య, ఒక్క క్షణం, నాంది' చిత్రాలకి కో ప్రొడ్యూసర్‌గా చేశాను. 'టైగర్' సినిమా నుంచి సందీప్ కిషన్, వీఐ ఆనంద్‌లతో ఉన్న పరిచయంతో హాస్య మూవీస్ బ్యానర్‌ని ప్రారంభించాను. ముందు 'ఊరు పేరు భైరవకోన' ప్రారంభించినా, 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' ఫస్ట్ విడుదలైంది. 'సామజవరగమన' చిత్రాన్ని ఈ వేసవిలో, 'ఊరు పేరు భైరవకోన' చిత్రాన్ని జులై లేదా ఆగస్టులో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నాం. అలాగే సుబ్బు దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్‌తో నిర్మించ నున్న మరో సినిమాను ఆగస్టులో ప్రారంభిస్తాం. శ్రీవిష్ణుతో మరో సినిమా చర్చల దశలో ఉంది. సాయిధరమ్ తేజ్‌తో విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఓ సినిమా చేయాలనే ప్లాన్ ఉంది'' అన్నారు.

లవర్ బాయ్‌గా...


● సుశాంత్

చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్న 'భోళా శంకర్' చిత్రంలో ప్రత్యేక పాత్ర చేస్తున్నారు సుశాంత్. శనివారం సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేశారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'భోళా శంకర్'. ఇందులో సుశాంత్‌ది లవర్‌బాయ్ తరహా పాత్ర'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

బుల్.. బుల్...


● సప్తగిరి, గోపీచంద్

వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'బుల్ బుల్ అన్‌స్టాపబుల్..' అనే తొలి పాటని హీరో గోపీచంద్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్‌తో కలిసి భీమ్స్ పాడారు. ''ఈ పాటలో సన్నీ, సప్తగిరి మాస్ మూమెంట్స్ ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



యాదవ/M.Tech /C.Govt.Asst Executive Engineer (ONGC)/ 1 Lakh/ PM/ 5'8"ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10383]

మాల క్రిస్టియన్ / M.Tech / C.Govt. Mechanical Engineer (రైల్వే)/70,000/-PM/5'8"ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10383]

మాల హిందూ/M.Tech / C.Govt. Scientist (DRDO) / 80,000/-PM / 5'8" ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10383]

వడ్డెర/ విడోయర్/36' 5'6/ Business/ 40,000/- P/M/ పిల్లలు ఉన్న వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 9908125689 [HA-10756]

ఫ్రీ రిజిస్ట్రేషన్ 1వ, 2వ, లేట్ మ్యారేజీ వధువులు కావలెను. అన్ని కులాల (OC, BC, SC, ST మైనారిటీ) వారు సంప్ర/ వాట్సాప్ నెం. 7207211109/ 8919607701. వివరాలు సెండ్ చేయండి. సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. [HA-1036]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM /5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-13910]

హిందూ మాల/కట్నం ప్రసక్తి లేదు / B.Tech (EEE)/ Govt.AE/ఎలక్ట్రికల్ Dept/90,000/-PM/5'9"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13910]

ముదిరాజ్/B.Tech /C.Govt. బ్యాంక్ Asst. మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13910]

యాదవ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. A.E/ఇరిగేషన్ Dept/80,000/-PM/5'10" ఎత్తు /28 సం॥ల వరునికి తగిన అందమైన వధువు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13910]

SC మాల/ ఏకైక కుమారుడు / M.Tech/ Govt.Asst.ఇంజనీర్ / TSNPDCL / 1 Lakh. PM/5'10"ఎత్తు/30 సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 8897389698 [HA-13910]

2వ పెళ్లి/ఏకైక కుమారుడు / M.Tech/ Govt. Asst. Exq.ఇంజనీర్/RWS//1 Lakh. PM/5'8"ఎత్తు/32 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9963757612 [HA-13910]

యాదవ/M.Tech, (IT)/ C.Govt. Sr. ఇంజనీర్/ రైల్వే/ 85,000/-pm/ 5'9" ఎత్తు/ 29 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తిలేదు. Ph: 9515755529 [HA-13911]

SC మాల/M.Tech, (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/ 65,000/-pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తిలేదు. Ph: 9676995093 [HA-13911]

బ్రాహ్మణ/డైవర్సీ/ 36/ 5'7"/ B.Tech, MS, H1B వీసా/USA/SWE/ 6 Lakhs pm/ వరునికి Any OC/BC వధువు కావలెను. Ph: 9701743336 [HA-13911]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Aus-Citizen/ BS/ MS/ Job/ USA/Rich Family Very Handsome Boy/1994/5'8"/150K. * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309

Reddy/B.Tech/MS/H1/USA /Now in Hyd/V.Fair/1992/5'9"/50Cr. *Cont: K.C. Reddy - Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech(NIT)/MS/MBA / USA/ 140K / 200Cr Needs Beautiful Girls USA or India. *Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD / Very Handsome Boy/1995/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Road No.3-B.Hills-Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MD/1990/5'10"/500Cr /Hyd- *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3, B.Hills-Hyd. Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Good Business/Very Handsome Boy/B.Tech/1997/6'/100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau - Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/ MBBS/MD/Hyd/Very Handsome Boy/1995/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/B.Tech/MBA/Job & Business/1994/5'10"/300Cr/50L/M. Rental Income. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/IIT/MS/H1/USA/1992/ 5'11"/495K/10Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Road No. 3-B.Bhills-Hyd. Ph:9849321309/9347807015

Reddy/USA-Doc / USA - Citizen/ MBBS/ MS (Surgeon)/Very Handsome Boy/1990/6'/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/USA /Citizen/ Royal Family (Parents Docs) /USA/ BS/MS/ USA/ Richest Family/ 1999/ 5'6". *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ MBBS/ Most Beautiful/ 1995 /5'7"/ 10Cr * Needs Doc or Business-India or USA. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/BE/BITS PILANI/ MS/Ph.D/ Most Beautiful/ 1995/5'1"/150K. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/MS /Gen Sur/ Most Beautiful/Needs Doc or Business Boy. * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/1993/5'3"/1000Cr. *IIT/B.Tech/1994/5'7"/1500Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd. Ph: 9849321309

Reddy/BBA/Most Beautiful/ 1997/ 5'4"/100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)Most Beautiful/ B.Tech/MS/1993/5'7"/15Cr-Most Beautiful. *Cont: K.C. Reddy - Hyd-Ph:9849321309/9347807015

Reddy/CATHOLIC/B.Tech/MS/India/1993/5'3"/Beautiful/100Cr-Hyd. *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/USA-Doctor/Most Beautiful/1992/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Marriage Bureau- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/ Divorcee / B.Tech / Most Beautiful/1993/5'6"/50Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd- Ph: 9849321309/9347807015 [D-505]

CNB/మున్నూరు కాపు/29/5'11"/ MBA, LLB/ 12 Lakhs PA/ కోట్ల ప్రాపర్టీ గల వరునికి మంచి అందం, వ్యక్తిత్వం, సాంప్రదాయ వధువు కావలెను. Ph: 9247217621 [HA-13911]

సున్ని ముస్లిం/ డైవర్సీ/ 46సం॥ 5'10" V.Fair, Software Engineer, Hyd, 25L PA. గల వరునికి. 30-40సం॥ల 1వ, 2వ, డైవర్సీ, విడో. Q: డిగ్రీ, పిల్లలు లేని వధువు కావలెను. డైరెక్ట్ : 9849909795 [HA-10384]

మాల / MBBS, MS(Ortho) / 5'8" / 28 Y / V.Fair / 10 Cr. / సొంత హాస్పిటల్ కల్గిన వరుని కొరకు (అర్జంట్)గా కావలెను. సంప్ర॥ 8106501199, 9248494810. [M-251]

క్రిస్టియన్ మాల 39, 6ft, ప్రైవేట్ జాబ్ వరుడికి వధువు కావలెను. కులం, కట్నం పట్టింపులేదు. విడోయర్స్, డైవర్సీస్. నో బ్రోకర్స్. ఓన్లీ జెన్యూన్ పర్సన్స్ కాల్ డైరెక్ట్ సెల్ : 9550913919 [Y-784357]

కాపు/60 సం॥/5'7"/M.Sc.,/గవర్నమెంట్ జాబ్ గెజిటెడ్ ఆఫీసర్ నెలకు 1,50,000/- సంపాదించు వరునకు తగిన వధువు కావలెను. బ్రోకర్లు లేరు. ✆ : 95503 95951 [R-1687]

క్రిస్టియన్ Male 34 years Govt Bank Manager అందమైన వరునికి వధువు కావలెను. No Brokers Contact No. 81790 44834, 94914 58002 [R-1697]

Cast No Bar, Yadav, Divorce, 43 Y, 5'10" height, MBBS-MS Doctor, 50L PA, Hyd. Well settled Groom should have a suitable Doctor/Engineer / Graduate Bride. 9440124742, Email : drnani2023@gmail.com [B-975]

★

మాదిగ: రిటైర్డ్/10000/62/5.8 ఒంటరి తగిన తోడుకై 55సం. పై మాత్రమే కుల, వయస్సు ప్రసక్తి లేదు. తగిన ఆర్థిక స్థితి, ఇల్లు గల ఏ బాదరబంది లేని వధువు కావలెను. సెల్: 7993634366. [WA-6921]

రెడ్డి/34/5'8"/MBA/Govt. Emp. *33/5'9"/Dip Mechanical/Old Car Showroom. *28/5'8"/ BE/ SWE/Hyd. *39/5'8"/రేడియాలజిస్ట్/PG MIT. *46/ 5'5"/ Asst.Professor/Hyd. హైదరాబాద్‌లో పనిచేయు అబ్బాయిలకు తగిన వధువులు కావలెను. సం॥ "శుభమస్తు" Hyd DSNR, S.రాములు గౌడ్. Ph: 8790690309 [H-793294]

★★

పద్మశాలి, 28సం., 5'11", ఎరుపు, మేనేజర్ HDFC బ్యాంక్, 10L PA, అందమైన యువకునికి 5'3" ఎత్తు తగ్గని అందమైన యువతి కావలెను. సంప్ర॥ 93921 34606, 73828 99350. [B-786514]

BC/ కుల ప్రసక్తి లేదు / 50 yrs / B.Tech, MBA / Govt. Engineer 2 LC PM / 2 పిల్లలు ఉన్నారు / Divorce / వరునికి తగిన వధువు కావలెను.No brokers.Ph : 62810 06161 [B-1166887]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BBA, 25, 5' 10", Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 6' Asst Manager, 18 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 10", SWE, 120 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BBA, 29, 5' 8", 80 Crores, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 26, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS, 23, 5' 5", Analyst, 85 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 6", Analyst, 17 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 5", SWE, 120 K, 1 Crore, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి UK, BE BITS, 28, 5' 10", SWE, 120 K Pounds, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 8", Engineer, 40 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 8", SWE, 100 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 23, 5' 5", Doctor, 60 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 28, 5' 7", Doctor, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.


రెడ్డి Bengaluru, BE, 26, 5' 3", Analyst, 6 L P/A, 2 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 31, 5' 7", Manager, 200 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

(BC) నాయిబ్రాహ్మిన్ /Rtd. ఉప MRO/65+ y/pm. 50వేలు, Well Settled వారికి, ఏ బాధ్యత లేని ఆంధ్రప్రాంతానికి చెందిన 50y పైబడిన (Any) B.C వధువు కావలెను. డైరెక్ట్ Ph: 9110761160, 8886339797 [S-1156468]

కాపు కన్వర్ట్/ 2nd మేచ్, వయస్సు 58 సం॥లు H-5'7" గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్ నెలకు లక్షరూపాయల జీతం. వరుడుకి వధువు కావలెను. కేస్ట్ నోబార్ ✆ 77949 11019 [R-1696]

వరుడు కావలెను



No Caste Bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph: W: 7794960803 [H-796823]

2వ పెళ్ళి కుల ప్రసక్తి లేదు 37yearsM.Sc Maths Govt.లెక్చరర్ 2 లక్షలు PM పిల్లలులేని 10 కోట్ల ఆస్తి గల తెల్లని అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం ఐన OK) ఫోన్: 7396213324 [H-796823]

యాదవ/B.Tech/C.Govt.Asst (RBI) / 55,000/-PM / 5'4"ఎత్తు /25 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10383]

మాల హిందూ/B.Tech / C.Govt. Account Officer(FCI)/50,000/-PM/ 5'4" ఎత్తు /26 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10383]

రెండో పెళ్లి/Widow/47 / డిస్ట్రిక్ట్ సేల్స్ Tax ఆఫీసర్/ 2L pm/ Own Villa & 30 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల వెల్‌సెటిల్ వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 7075807800 [H-796876]

వెలమ/విడో/48/5'4"/ MBA/ బ్యాంక్ EMP (VRS), 70K pm/ Own Gold Shop/ అపార్ట్‌మెంట్, House/ 3L pm/ కోట్ల ప్రాపర్టీ గల ఏకైక వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. Ph: 9177631661 [H-796876]

రెడ్డి/విడో/50y/ Hyd / Own House (Rents)/ 1 పాప USA/ వెల్‌సెటిల్/ఏ బాదరబందీలేని అందమైన ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-796876]

రెడ్డి/విడో/49/5'4"/ MA B.Ed/ Govt. టీచర్ (VRS)/ 50K/ Mobile & గార్మెంట్ Business / 3L pm/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. పిల్లలున్నా Ok. Ph: 8297518729 [H-796876]

కమ్మ : విడో/49/5'5"/PG/Govt EMP VRS/60K PM/ Own Business Own Houses/ 3L PM/ 10 ఎ॥ పొలం తోటలు/ కోట్ల ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. పిల్లలున్నా OK Ph: 9542256979 [HA-10756]

పద్మశాలి: విడో/48Y/ 5'4"/ MBA/ Fassion Designer/ Family పెన్షన్ గార్మెంట్ బిజినెస్ /4L P.M/ కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను పిల్లలు ఉన్నా OK Ph: 9063710965 [HA-10756]

కులపట్టింపు లేదు: విడో/49Y/ 5'4"/ PG/ Govt Emp (VRS)/ Own Business Own House(Rents) 3.5L PM/ Lands కోట్ల ప్రాపర్టీగల ఒంటరి వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. Ph: 7386919413. [HA-10756]

హిందూ మాల/B.Tech / Govt. AE/ పంచాయతీరాజ్ Dept/50,000/-PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13910]

ముదిరాజ్/B.Tech / C.Govt. బ్యాంక్ P.O / కెనరా బ్యాంక్/45,000/-PM/5'5" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13910]

వడ్డెర/B.Sc/C.Govt.Asst.మేనేజర్/కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్/ 60,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 [HA-13910]

SC మాదిగ/B.Tech/Govt.Jr.సెక్షన్ ఆఫీసర్/40,000/-PM / 5'4"ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7032058965 [HA-13910]

2వ పెళ్లి/ 35సం॥లు / MCA చదివిన / 10 కోట్ల ఆస్తి గల బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను కుల పట్టింపు లేదు (ఇల్లరికం OK పిల్లలు ఉన్నా OK) సంప్రదించండి : 7386550413 [H-793393]

కాపు/ 47సం॥/ 5'5"/కుల పట్టింపులేదు/ఫెయిర్/MA. B.Ed / Gvt. ఎంప్లాయ్ 80K (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్రదించండి : 8008474869 [H-793393]

క్రిస్టియన్/ (కన్వర్టెడ్) / విడో / Fair/ 5'3" / డిగ్రీ/ సొంత బిజినెస్ /40,000/-PM/ చిన్న ఇల్లు కలిగిన వధువుకు FC/BC వరుడు కావలెను. : 9059150892 [H-793393]

FC విడో/ 60yr. Govt. రిటైర్డ్ Own House/ కల / ఒంటరి వధువుకు కుల ప్రసక్తి లేని మంచి వ్యక్తిత్వం కల వరుడు కావలెను. సంప్ర : 9948402716 [H-793393]

రజక/CA/ అకౌంటెంట్, Govt./ 40,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7075953400, 7842467951 [HA-13911]

కాపు/B.Tech/ C.Govt. బ్యాంక్ P.O/ ఇండియన్ బ్యాంక్/ 55,000/-pm/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8886512010 [HA-13911]

క్రిస్టియన్ మాదిగ/MBBS & DNB/14 Lakhs PA/ 5'4" ఎత్తు/ 33 సం॥ల Govt. డాక్టర్ వధువుకి MD/DNB/PG/MS/ Any ఎంప్లాయి వరుడు కావలెను. Ph: 9515755529, 9912280929 [HA-13911]

బ్రాహ్మణ/30/5'3"/ డిగ్రీ/Pvt. జాబ్/ 15,000/-pm/ అందమైన వధువుకి తగిన జాబ్/ బిజినెస్/పురోహితం వరుడు కావలెను. Ph: 9701743336 [HA-13911]

రెడ్డి/విడో/46 yrs/ 5'6"/ హైదరాబాద్, సొంత ఇల్లు, రెంట్స్, పొలాలు గల కోట్ల ఆస్తి గల రెడ్డి ఒంటరి వధువుకి వరుడు కావలెను. వాట్సప్: 9030129988 [HA-13911]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ *28/5'2"/B.Sc *30/5'3"/ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్ Ok. పురోహితులకు సంబంధాలు కలవు. Ph: 7815999246 [HA-13911]

క్రిస్టియన్ మాల/ 28సం॥లు, PG, వెల్ సెటిల్, దైవ సేవకుల ఫ్యామిలీ అమ్మాయికి AP, TS నుండి క్రిస్టియన్ లో కావాలి. సంప్ర : 6301972080 (క్రిస్టియన్ High టెక్ Matches కలవు) Office Ph: 040-35182541 [HA-10384]

Reddy/ 60సం॥/ 5'4"/ V.Fair, సొంత ఇల్లు, రెంట్స్ రెండు ఎకరాల పంట పొలం గల వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. సంప్ర : 9000902536. [HA-10384]

రెడ్డి/27y/5'4"/4 కోట్ల స్థిరాస్తి కలిగి తండ్రిలేని అందమైన ఏకైక వధువుకు అర్జెంటుగా వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) Send your Photos whatsapp 9441145961 [H-796823]

మాల Hindu/28/5'5"/B.Tech/SWE in Hyd/1 Lack PM/మంచి ఫ్యామిలీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Fake Ad కాదు Genuine వాళ్ళు మాత్రమే సంప్ర: C.N.B. 8309208120 [H-796823]

OC/50y/విడో /Railway Job/5 Hotels/Rents/18 Acres Land/18 Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 9989394054 [H-793295]

ఆస్తి/కుల పట్టింపు లేదు/56y/విడో/5'4"/ Govt.VRS/ 40,000/-PM /సొంత ఇల్లు/ బోర్‌వెల్ బిజినెస్/1 L/PM ఒంటరి వధువుకు వరుడు కావలెను. Ph: 9515939479 [H-793295]

రెడ్డి/విడో/ఒంటరి/52y/5'3"/ఇంటర్/బ్యూటీఫామ్/ సొంత క్లాత్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్) (నో బ్రోకర్స్) Ph: 7799083500, 7386660643 [H-793295]

రెడ్డి/విడో/50y / 5'5"/ V.Fair/Govt(H.M)/ సొంత ఇల్లు/20 ఎకరాల పొలం/ ఏ బాదరబందిలేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-793295]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/2వ/లేట్/పెన్షనర్స్/విడో/విడోయర్ స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు ఫాస్ట్‌గా కుదురుచబడును. సంప్ర : 9492081545 [H-793393]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-13908]

సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, విద్యావంతులు, ఇండియా, విదేశీ అమ్మాయిలు, అబ్బాయిలు అన్ని కులాల వారు ఉన్నారు. మొదటి, సెకండ్, లేట్ పెళ్లి సంబంధాలు. హై ప్రొఫైల్ Matches వాళ్లు మాత్రమే కాంటాక్ట్: 6304826162 [HA-10384]

గంగపుత్రుల పెళ్లి సంబంధాలకై (బెస్త, గూండ్ల, అగ్నికుల క్షత్రియ, వాడబలిజ, జాలరి, గంగావర్, వడ్డీలు, పల్లెకాపు, నయ్యాల, పట్టపు, వన్నెకాపు) హైదరాబాద్. సెల్ : 9000541000 [H-787400]

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి Govt, Pvt, SWE, Dr's, దేశ, విదేశ, ప్రథమ, ద్వితీయ వధూవరుల సంబంధాలకై వెంటనే సంప్ర: 9866044439 [H-796823]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13912]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13912]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13912]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13912]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13912]

నమో వెంకటేశాయ! డాక్టర్స్, ఇంజనీర్స్, గ్రూప్ 1& 2, అబ్రాడ్, 1,2 పెళ్ళి సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-454]

పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ: తెనాలి (గుంటూరు జిల్లా) వారి 12వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 23.04.2023 ఆదివారము ఉ. 9 గం.ల నుండి. 9963924665, 9849851322. [T-1781]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉండేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-45]

మాల, మాదిగ స్పెషల్. IAS, IPS, IFS, IRS, గ్రూప్ I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్ USA, UK, Ph: 73969 15712 (A) [M-6986]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155 / 9391265304. [H-793295]

కావ్య మ్యారేజ్‌లింక్స్:1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడోస్ విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులములవారికి త్వరగా చూపబడును. ఫోన్: 8074670989. [HA-10756]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-796876]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-793278]

40 సం॥లుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ "కాకతీయ మ్యారేజెస్" రెడ్డి, కమ్మ, కాపు, ఇతర కులముల సంబంధాలకై kaakateeya.com. Ph: 9342939345, 9848134222 [HA-10348]

Mala-Madiga Christian/Hindu IAS, IPS, Doctors(PG), Bank PO's, Railways, Govt. Employees, Software (IITs & NITs). Contact : 99497 20682 [H-793651]

Thinking Marriage? List Marriage Profile-Find Perfect Match with Brides Grooms. in No Mediator, No Settlement Fee only one Time Listing Charge. WhatsApp for Registration Cell : 6304826162 [HA-10384]

★

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsap No.) [HA-937]

V.R.Reddy Marriage Bureau U.S.A & Local Matches Proposals For Rich Families Fast settlement. Ph: 9581725589 Email: ramana.Narsingi@gmail.com (Send Bio-data) [H-779943]

★★

క్రిస్టియన్ & హిందూ: మాల, మాదిగ మరియు (OC, BC, SC, ST) అన్ని కులములలో క్రైస్తవ విశ్వాసుల వివాహ (1st & 2nd) సంబంధముల కొరకు సంప్ర. ✆ 80746 35739 [B-1201781]

మీ జీవితాంతం తోడుంటారనుకున్న మీ జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. మీ జీవితంలో వెలుగులు నింపడానికై 1వ, 2వ అన్ని కులాల వివాహ సంబంధాలకై సంప్ర॥ 8341220970 [K-1232943]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE Govt Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-1004]

35సం॥ నుండి 45 సం॥ మధ్య వయసు గల ఒంటరి, విడోలు మరియు విడాకులు పొందిన స్త్రీ/పురుషులకు కులం, కట్నం, మతం ప్రసక్తిలేని అభ్యుదయ భావాలు కలిగిన ఆదర్శ వివాహ సంబంధాలు ఉచితముగా చూడ బడును. ఈ సేవ ప్రస్తుతం ఉన్న వివాహ వేదికల శైలికి భిన్నమైనది. కావున సంప్రదించాలనుకున్నవారు తప్పని సరిగా పై నిబంధనలు పాటించి, తమ ప్రొఫైల్ వివరాలను మా యొక్క నంబర్ 8523053468కు వాట్సప్ మాత్రమే పంప గలరు. [O-786998]

బాలవికాసలో ఐటీ సోదాలు దురదృష్టకరం

సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి



కాజీపేట రూరల్: బాల వికాస సంస్థలో జరిగిన ఐటీ సోదాలు దురదృష్టకరమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి తెలిపారు. హనుమకొండ కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో మూడు రోజుల ఐటీ సోదాలపై బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలథెరిసా ఆదేశాల మేరకు శౌరిరెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఐటీ అధికారులు బాలవికాసలో తనిఖీలు చేపట్టి పలు రికార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారన్నారు. రూ.400 కోట్ల నిధులు ఒకే సంవత్సరంలో వచ్చినవి కావని, 45 ఏళ్లలో 8 వేల గ్రామాల్లో అనేక రకాల పథకాల విలువని తెలిపారు. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలను ఉల్లంఘించలేదని, పన్ను ఎగవేత చేయలేదని, నిధుల మళ్లింపు చేయలేదని, బాలవికాసకు పన్ను మినహాయింపు ఉంటుందని శౌరిరెడ్డి వెల్లడించారు. దేశంలో 9 రాష్ట్రాల్లో బాలవికాస కుల, మత, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా ప్రజాభివృద్ధి పథకాలను చేస్తూ సుమారు కోటి జీవితాలకు తోడ్పాటునందిస్తోందన్నారు. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఐటీ సోదాలు ముగిశాయని తెలిపారు. తమ బోర్డు మెంబర్లు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందించి వారి సందేహాలను నివృత్తి చేశారన్నారు. కొన్ని మీడియాల్లో వస్తున్న.. వచ్చిన ఊహాజనితమైన కథనాలు కలిచి వేస్తున్నాయని శౌరిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. బాలవికాసలో 40 చోట్ల దాడులని ప్రచారం చేస్తున్నారని, వారు చేసింది 11 చోట్ల మాత్రమేనన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన తాను సంస్థ నిధులను మళ్లించి సొంత ఆస్తులను పెంచుకున్నట్లు వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తేల్చిచెప్పారు.

బాలాలయానికి సరస్వతీ అమ్మవారు!

- బాసర ఆలయ పునర్నిర్మాణానికి కసరత్తు పూర్తి
- శృంగేరి పీఠాధిపతి సూచనలతో నమూనా సిద్ధం
- ప్రభుత్వ అనుమతి రాగానే టెండర్లు



బాలాలయంగా మారనున్న అక్షర శ్రీకార మండపం

భైంసా: సరస్వతీ దేవి కొలువైన బాసర ప్రధాన ఆలయం పునర్నిర్మాణానికి కసరత్తు పూర్తయింది. ఇప్పటికే అర్చకులు, అధికారులు, వైదిక బృందం శృంగేరి వెళ్లి పీఠాధిపతి విదుశేఖర భారతిస్వామి సూచనలతో నమూనా రూపొందించారు. గర్భగుడిలో మార్పులు చేర్పులపై పీఠాధిపతి చేసిన సూచనలను ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ ప్రధాన పండితులు.. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వివరించారు. కొత్త నమూనాలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరమైన బాసర ఆలయానికి రూ.50 కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా భక్తులు వచ్చే ఈ క్షేత్రంలో అనునిత్యం అక్షరాభ్యాస పూజలు జరుగుతాయి. వేలాదిగా భక్తులు బాసర వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో పునర్నిర్మాణ పనులు ప్రారంభమైతే ప్రస్తుతం ఉన్న ప్రధానాలయం వద్ద భక్తుల దర్శనాలు నిలిచిపోనున్నాయి. పనుల సమయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అక్షర శ్రీకార మండపాన్ని బాలాలయంగా ఏర్పాటుచేసి అమ్మవారికి పూజలు నిర్వహించనున్నారు. విశాలమైన ఈ మండపంలో ప్రధానాలయం గర్భగుడి పనులు పూర్తయ్యేవరకు అమ్మవారి దర్శనాలు, అక్షరాభ్యాస పూజలు ఇక్కడే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికలకు ముందే ప్రారంభించేలా..

ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే ఆలయ పనులు ప్రారంభించాలని చూస్తున్నారు. ఇప్పటికే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి పలు దఫాలుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించి నూతన నమూనాలు, మాస్టర్‌ప్లాన్ తదితరాలపై కసరత్తు పూర్తి చేశారు. ఇటీవల బాసర వచ్చిన మంత్రి మాస్టర్ ప్లాన్ అమలుపై ఆలయ అధికారులతో చర్చించారు.

కృష్ణ శిలలతో నిర్మాణం...

గర్భాలయాన్ని కృష్ణశిలలతో అత్యద్భుతంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం సరస్వతి అమ్మవారి దర్శన సమయంలో పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ప్రతిమ కనిపించదు. రానున్న రోజుల్లో మహాలక్ష్మి అమ్మవారు కనిపించేలా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టనున్నారు. మహంకాళి అమ్మవారి ప్రతిమ వెనుక ప్రాకార మండపం, ప్రాకారం లోపల శివాలయ పునః ప్రతిష్ట, దత్తాత్రేయ స్వామివారి స్థల మార్పిడి, నలుదిక్కులా రాజగోపురాల నిర్మాణం, అనివేటి మండప విస్తరణ, ధ్వజ స్తంభం ఏర్పాటు, ఆలయ ప్రాంగణంలోనే యాగశాల ఏర్పాటు వంటివి చేపట్టనున్నారు.

సీఎం కేసీఆర్ గొప్ప యోగి

దత్తపీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయాన్ని పునఃనిర్మాణం చేసిన గొప్ప యోగి సీఎం కేసీఆర్ అని దత్త పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని శనివారం దర్శించుకుని, ప్రధానాలయ పునఃనిర్మాణ విశేషాలను తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీకి కొండపైన స్వాగతం పలికారు. ఎంతో మంది చక్రవర్తులు ఆలయాలను నిర్మించారని, కానీ ఎన్నో జన్మలు చేసిన తపస్సుతో ఇంత గొప్ప ఆలయాన్ని సీఎం పునఃనిర్మాణం చేశారని ప్రశంసించారు. ఆలయ పునఃనిర్మాణంలో భాగస్వాములైన వారు పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యమని పేర్కొన్నారు. యాదాద్రీశుడి ఆశీస్సులతో రాష్ట్రమంతా అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎంకు, రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుగ్రహం ఉంటుందని తెలిపారు. అంతకుముందు ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, ఈవో గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అధికారులకు గణపతి సచ్చిదానందస్వామీజీ ఆశీస్సులు అందించారు.



ఆలయ విశేషాలను గణపతి సచ్చిదానంద స్వామీజీకి వివరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఔషధాల తయారీలో కీలకమైన ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. ఔషధ, సుగంధ మొక్కల పెంపకంపై కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్, అరోమాటిక్ ప్లాంట్స్ (సీఐఎంఏపీ)లో శనివారం జరిగిన కిసాన్ మేళాలో మంత్రి నిరంజన్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో 800 కోట్ల మంది జనాభాకు అవసరమైన మందుల తయారీకి ప్రధానాధారం ఔషధ మొక్కలేనని స్పష్టం చేశారు. ఔషధ మొక్కల ప్రపంచ మార్కెట్‌ను చైనా శాసిస్తోందని పేర్కొన్నారు. లాభదాయక వ్యవసాయాన్ని రైతు ఎప్పుడూ ఆహ్వానిస్తాడని తెలిపారు. మార్కెట్ డిమాండ్, అవసరాలకు అనుగుణంగా రైతాంగాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఔషధ, సుగంధ మొక్కల ప్రాజెక్ట్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సంజయ్ కుమార్ (లక్నో), తెలంగాణ ఉద్యానశాఖ ఉపసంచాలకుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్‌కు హైకోర్టులో చుక్కెదురు

ఎలక్షన్ పిటిషన్‌ను కొట్టివేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. తన ఎన్నిక చెల్లదని ఆదేశాలివ్వాలంటూ కాంగ్రెస్ నేత మదన్‌మోహన్‌రావు వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని పాటిల్ హైకోర్టులో ఇంటర్లోక్యుటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశారు. వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం పాటిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. మెయిన్ పిటిషన్(మదన్‌మోహన్ దాఖలు చేసిన)లో రోజువారీగా వాదనలు వింటామని పేర్కొంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావుపై 6 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అయితే జార్ఖండ్‌లో పాటిల్‌పై ఓ క్రిమినల్ కేసు నమోదైందని, ఆ వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొలేదని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని మదన్‌మోహన్ రావు హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ వేశారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి 2022 జూన్‌లో ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. అయితే దీన్ని మదన్‌మోహన్‌రావు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తెలంగాణ హైకోర్టు జూన్ 15న మౌఖిక తీర్పు ఇచ్చిందని, 3 నెలలైనా తీర్పు ప్రతిని బహిర్గతం చేయలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. తీర్పు ప్రతులు ఇవ్వకపోవడం సరికాదని, తీర్పు ఉత్తర్వులు లేకుండా తాము వాదనలు వినలేమని, ఆరు నెలల్లోపు వేగవంతంగా కేసును పరిశీలించి తీర్పు ఇవ్వాలని హైకోర్టుకు సూచించింది. దీంతో విచారణను సీజే ధర్మాసనం చేపట్టింది.

క్లుప్తంగా...

ఎన్‌ఎండీసీ సీఎండీగా శ్రీధర్!



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్‌ను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ)కు సీఎండీగా నియమించాలని శనివారం కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీఓపీటీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సింగరేణి సీఎండీ పోస్టుకి ఇంటర్వ్యూలను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు నిర్వహించి శ్రీధర్ పేరును సూచిస్తూ శనివారం లేఖ పంపించిన క్రమంలో డీఓపీటీ ఈ మేరకు సిఫారసు చేసింది. త్వరలోనే ఎన్‌ఎండీసీ సీఎండీగా ఎన్.శ్రీధర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి. 2015, జనవరి 1 నుంచి శ్రీధర్ సింగరేణి సీఎండీగా కొనసాగుతున్నారు.

శ్రీధర్ పదవీకాలం పొడిగింపుపై అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా ఎన్.శ్రీధర్ పదవీకాలం పొడిగింపు పట్ల కేంద్ర ప్రభుత్వం మరోసారి అభ్యంతరం తెలిపింది. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో గత నెల 30న నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో శ్రీధర్ పదవీకాలం పొడిగింపునకు వ్యతిరేకంగా తమ శాఖ అండర్ సెక్రెటరీ ఆల్కా శేఖర్ ఓటు వేశారని, ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నుంచి తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. ఈనెల 8న లేఖ అందిన విషయాన్ని ప్రభుత్వ వర్గాలు ధ్రువీకరించాయి.

పకడ్బందీగా పది పరీక్షలు

విద్యాశాఖ మంత్రి సబిత ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శనివారం బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు హాల్ టికెట్లను ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు, పాఠశాలలకు కూడా పంపుతున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,94,616 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. మొత్తం 2,652 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

క్యూనెట్‌లాంటి సంస్థలతో జాగ్రత్త: సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: పెద్దగా కష్టపడకుండా ఆదాయం వస్తుందన్న ఆశతో క్యూనెట్ లాంటి మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థల వలలో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో క్యూనెట్ బాగోతంపై ఆయన స్పందించారు. భారీగా డబ్బు ఆశ చూపి అమాయకులను క్యూనెట్ సంస్థ మోసం చేస్తోందని పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేస్తూ అగ్ని ప్రమాదంలో ఆరుగురు అమాయకులు దుర్మరణం పాలైన నేపథ్యంలో, సంస్థ బాగోతాలపై లోతైన దర్యాప్తు చేసి ఆట కట్టించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థలకు కార్యాలయ స్థలాలను అద్దెకివ్వవద్దని భవన యజమానులకు సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

మైనారిటీ మహిళల కోసం వీ-హబ్ 'ఉజాగర్'

సాక్షి, హైదరాబాద్: మైనారిటీ మహిళల నేతృత్వంలో నడుస్తున్న వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మహిళా ఇంక్యుబేటర్ వీ-హబ్.. 'ఉజాగర్' పేరిట కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సఫ సొసైటీ భాగస్వామ్యంతో వీ-హబ్‌లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ శనివారం ప్రారంభించారు. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహకారం ఉజాగర్ ద్వారా లభిస్తుందన్నారు. మైనారిటీ మహిళల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు తేవడం లక్ష్యంగా దీన్ని చేపట్టారు. మైనారిటీ మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. నెలన్నర పాటు కొనసాగే ఉజాగర్ కార్యక్రమంలో భాగంగా మైనారిటీ మహిళలకు వ్యాపార నిర్వహణకు మార్కెటింగ్, అమ్మకాలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. వ్యాపార నిర్వహణకు అవసరమైన అనేక అంశాలపై మహిళలకు అవగాహన లేకపోవడంతో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న విషయం గడిచిన ఐదేళ్లలో తమ దృష్టికి వచ్చిందని వీ-హబ్ సీఈఓ దీప్తిరావుల అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అమీరుల్లా ఖాన్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

మినరల్ వాటర్.. మిల్లెట్ భోజనం!

నగర పోలీసుల ఆరోగ్యంపై కొత్వాల్ ప్రత్యేక దృష్టి

బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి బిర్యానీకి బదులు పౌష్టికాహారం

ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పంపిణీ

ఈ తరహా సేవలు అందించడం దేశంలోనే తొలిసారి

సాక్షి, హైదరాబాద్







పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు..

అధికారులు, సిబ్బంది ఎంత ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు అంత మెరుగైన సేవలు అందించవచ్చు. ఈ నేపథ్యంలోనే ఫిట్‌కాప్‌కు రూపమిచ్చాం. దీనికి కొనసాగింపుగానే మిల్లెట్ ఫుడ్‌ను పరిచయం చేశాం. సాధారణ భోజనాలకు అయ్యే ఖర్చుకు అదనంగా 30 నుంచి 40 శాతం దీనికి ఖర్చవుతుంది. దీనిపై సిబ్బంది నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ ఉంది. ఆహారం తీసుకోవడం ఆలస్యమైనా ఏ ఇబ్బందీ లేదని చెబుతున్నారు. అలాగే భోజనం చేసేప్పుడే కాకుండా ఎప్పుడైనా అధికారులు, సిబ్బందికి మినరల్ వాటర్ అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

\- 'సాక్షి'తో సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

సభలు, సమావేశాలు, నిరసన ర్యాలీలు, ప్రముఖుల పర్యటనలు... భాగ్యనగరంలో దాదాపు నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్లపై కనిపించే దృశ్యాలివి. దీనికితోడు నగరానికి ప్రముఖుల రాకపోకల హడావుడి ఓవైపు.. ఏటా అట్టహాసంగా జరిగే గణేశ్ నిమజ్జనాలు, బోనాల వంటి పండగ సంబరాలు మరోవైపు... ఇలాంటి కార్యక్రమాలకు భారీ బందోబస్తు చేపట్టడం నగర పోలీసులకు కత్తిమీద సామే.. మరి అలాంటి సిబ్బంది ఆహార అవసరాలు తీర్చేందుకు ఇప్పటివరకు హెవీ, జంక్ ఫుడ్ అందిస్తున్న హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ తాజాగా తృణధాన్యాలతో చేసిన పౌష్టికాహారం అందిస్తోంది. దేశంలో మరే ఇతర పోలీసు విభాగం ఇప్పటివరకు ఇలాంటి చర్యలు తీసుకోలేదు. నగర పోలీసు విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ దీన్ని అమలు చేస్తున్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు మిల్లెట్స్ ఫుడ్‌తోపాటు మినరల్ వాటర్ కూడా అందిస్తున్నారు. నగరం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థకు ఆర్డర్ ఇవ్వడం ద్వారా ఈ మిల్లెట్ ఫుడ్ ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. ప్రస్తుతం 'ప్లాన్డ్ బందోబస్తు'ల వరకు మాత్రమే అమలవుతున్న ఈ విధానాన్ని 'సడన్ బందోబస్తు'లకూ వర్తింపజేయాలని ఆనంద్ యోచిస్తున్నారు.

అనారోగ్య సమస్యలకు అనేక కారణాలు

రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, కమిషనరేట్లతో పోలిస్తే హైదరాబాద్ సిటీ పోలీసుల పనితీరు పూర్తి భిన్నంగా ఉంటుంది. వాళ్లు ఏటా కనిష్ఠంగా 100 నుంచి 150 రోజులు బందోబస్తు విధుల్లో ఉండాల్సి వస్తుంది. వేళాపాళా లేని ఈ విధులతో సమయానికి ఆహారం, నిద్ర ఉండకపోవడంతోపాటు ఇంకా అనేక కారణాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చాలా మంది బీపీ, షుగర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు ఊబకాయంతో బాధపడుతున్నారు.

హఠాత్తుగా తలెత్తే వాటికి ఎలా..?

సిటీ పోలీసులకు ప్రధానంగా రెండు రకాలైన బందోబస్తు డ్యూటీలు ఉంటాయి. ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్న గణేష్ ఉత్సవాలు, బోనాలు, ఎన్నికలు తదితరాలు ప్లాన్, స్కీమ్ ఉంటాయి. దీంతో ఏ రోజు? ఎక్కడ? ఎంత మంది విధుల్లో ఉంటారనేది స్పష్టంగా తెలుస్తుంది. దీని ఆధారంగా ఆ స్వచ్ఛంద సంస్థకు ఆర్డర్ ఇచ్చి మిల్లెట్ ఫుడ్ తయారు చేయిస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో హఠాత్తుగా బందోబస్తు విధులు వచ్చిపడతాయి. ఈ అన్‌ప్లాన్డ్ విధుల్లో ఉన్న వారికి ప్రస్తుతం మిల్లెట్ ఫుడ్ అందించలేకపోతున్నారు. అయితే వారికీ కచ్చితంగా ఇచ్చేందుకు మార్గాలను ఉన్నతాధికారులు అన్వేషిస్తున్నారు.

ఫిట్ కాప్‌తో 12 వేల మంది స్క్రీనింగ్...

ఈ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, సిబ్బందిలో అకాల మరణాలు సైతం సంభవిస్తున్నాయని గుర్తించిన నగర కొత్వాల్ సీవీ ఆనంద్... ఈ పరిణామం వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపుతుండటంపై ఆందోళన చెందారు. ఈ పరిస్థితులను మార్చేందుకు హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సహకారంతో ఫిట్‌కాప్ పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. మహారాష్ట్రలోని పుణే పోలీసు విభాగం కోసం అందుబాటులో ఉన్న హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రొవైడర్ యాప్ స్ఫూర్తితోనే ఫిట్‌కాప్‌కు రూపమిచ్చారు. ఈ యాప్ '3 డీస్'గా పిలిచే డయాగ్నైస్, డెవలప్, డూ విధానంలో పనిచేస్తోంది. ఇప్పటికే 12 వేల మందికి స్క్రీనింగ్ చేసిన పోలీసు విభాగం అందులో అనేక మంది జీవనశైలికి సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించింది. వారంతా వెంటనే ఆహార అలవాట్లు మార్చుకోవాలని వైద్యులు సూచించడంతో ఈ మార్పును బందోబస్తు డ్యూటీల నుంచే అమలులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ విధుల్లో ఉన్న వారికి ఏళ్లుగా బిర్యానీ ప్యాకెట్లు సరఫరా చేయడం ఆనవాయితీగా కొనసాగుతుండగా దీన్ని మారుస్తూ మిల్లెట్ భోజనం అందించడానికి శ్రీకారం చుట్టారు. మిల్లెట్ బిర్యానీ, మిల్లెట్ కిచిడీ, మిల్లెట్లతోపాటు బెల్లంతో రూపొందించిన స్వీట్లు, మిల్లెట్ కర్డ్ రైస్, మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు.

వంద శాతం ఆక్యుపెన్సీతో భారత్‌గౌరవ్ రైలు ప్రారంభం

- పర్యాటకుల నుంచి అనూహ్య స్పందన
- తక్కువఖర్చుతో ఎక్కువ ప్రాంతాల సందర్శనకు అవకాశం



భారత్ గౌరవ్ రైలును ప్రారంభిస్తున్న అరుణ్ కుమార్ జైన్, రజనీ హసిజా

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో మొట్టమొదటి భారత్ గౌరవ్ రైలు శనివారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమైంది. ఎస్‌సీ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఐఆర్‌సీటీసీ మేనేజింగ్ డైరెక్టర్ రజనీ హసిజాతో కలిసి 'పూరి- కాశీ- అయోధ్య'పేరుతో నడిచే ఈ రైలును ప్రారంభించారు. తెలుగురాష్ట్రాల్లోని ప్రధాన స్టేషన్ల నుంచి బయలుదేరే ఈ రైలుకు మొదటిరోజే నగర పర్యాటకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. వంద శాతం ఆక్యుపెన్సీతో బయలుదేరింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పదో నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే నుంచి అపూర్వమైన స్వాగతం లభించింది. కూచిపూడి నృత్యప్రదర్శన, డప్పు వాయిద్యాలు, ఇతర సాంస్కృతిక, కళారూపాలతో సాదరంగా ఆహ్వానించారు. జీఎం అరుణ్‌కుమార్ జైన్ స్వాగత కిట్‌లను అందజేసి ప్రయాణికులతో ముచ్చటించారు. జీఎం మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రాంతాలను సందర్శించేవిధంగా భారత్‌గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పర్యాటకుల అభిరుచి, పుణ్య క్షేత్రాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలను రూపొందించినట్లు ఐఆర్‌సీటీసీ సీఎండీ రజనీ హసిజ తెలిపారు.

పుణ్య క్షేత్రాల సందర్శన...

'పూరి- కాశీ- అయోధ్య'పేరుతో ఐఆర్‌సీటీసీ ప్రవేశపెట్టిన ఈ పర్యాటక రైలులో ప్రయాణించేవారికి అన్ని రకాల సేవలను అందజేయనుంది. ఈ పర్యటనలో రైలు ప్రయాణంతోపాటు రోడ్డు రవాణా, వసతి, భోజనం వంటి అన్ని ఏర్పాట్లు ఉంటాయి. 8 రాత్రులు, 9 పగళ్లు ఈ పర్యటన కొనసాగుతుంది. తెలుగు రాష్ట్రాల్లోని 9 ప్రధాన స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం ఉంది. రైలులోని మొత్తం 700 సీట్లు రిజర్వ్ అయినట్లు అధికారులు చెప్పారు. ఈ ప్యాకేజీలో పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, గయా విష్ణుపాద ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథ ఆలయం, విశాలాక్షి, అన్నపూర్ణ దేవాలయం, అయోధ్య రామజన్మ భూమి, ప్రయాగ్ రాజ్, త్రివేణి సంగమం, తదితర ప్రాంతాలను ప్రయాణికులు సందర్శించనున్నారు.

చైల్డ్ పోర్నోగ్రఫీ చూస్తే జైలే

- అశ్లీల వీడియోల వ్యాప్తిపై తెలంగాణ పోలీస్ ఫోకస్
- ఇప్పటి వరకు 44 కేసులు.. 43 మంది అరెస్టు ..
- కేసుల పురోగతిపై సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: చిన్నారుల అశ్లీల వీడియోలను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేసి, వాటిని సర్క్యులేట్ చేసే వారిపై తెలంగాణ పోలీసులు ఫోకస్ పెంచారు. అశ్లీల వీడియోలు వ్యాప్తి చేస్తున్నట్టు గుర్తించిన వారిపై ఇప్పటి వరకు మొత్తం 44 కేసులు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస స్టేషన్ల పరిధిలో నమోదైన ఈ కేసుల్లో మొత్తం 43 మందిని అరెస్టు చేశారు. సర్క్యులేషన్ ఆఫ్ చైల్డ్ సెక్స్‌వల్ అబ్యూస్ మెటీరియల్ (సీఎస్‌ఏఎం) కింద నమోదు చేసిన కేసులపై సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ సమీక్ష నిర్వహించారు. 34 కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందని, మరో 8 కేసుల్లో చార్జిషీట్‌లు నమోదైనట్టు తెలిపారు. అశ్లీల వీడియోలను వెబ్‌సైట్లలో, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, వాటిని ప్రచారం చేయడం నేరమని గుర్తించాలని మహేశ్‌భగవత్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఐటీ యాక్ట్ సెక్షన్ 66(ఈ), 67(ఏ), 67(బి), ఐటీయాక్ట్ 2000-2008 పోక్సో యాక్ట్ సెక్షన్ 13, ఐపీసీ సెక్షన్ 354 (సీ)ల కింద ఏడాది నుంచి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధిస్తారని, అదే నేరం మరోమారు చేసే వారికి మూడేళ్ల నుంచి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తారని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ స్కూళ్లలో వసతుల కల్పనకు రూ. 7289 కోట్లు

మొదటి దశలో 35శాతం నిధులతో మే 15కి పనులు పూర్తి

- ప్రతి ప్రభుత్వ స్కూల్‌ని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతాం
- హైదరాబాద్‌లో విద్య ఖర్చుతో కూడుకుంది
- అందుకే సీఎం కేసీఆర్ 'మన బస్తీ-మన బడి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు
- ప్రధానోపాధ్యాయుల సమీక్షలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



హిమాయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు మూడు దశల్లో రూ.7289 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడించారు. మొదటి దశలో 239 పాఠశాలల్లో 35శాతం నిధులను ఖర్చు చేసి మే 15వ తేదీలోపు వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'మన బస్తీ-మన బడి' కార్యక్రమం అమలులో భాగంగా శనివారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ విద్యాసంస్థల్లో ప్రధానోపాధ్యాయులతో మంత్రి తలసాని అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, టీఎస్‌డబ్ల్యూఈఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ దేవసేన, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ హాజరయ్యారు. సమీక్ష అనంతరం మంత్రి తలసాని మీడియాతో మాట్లాడారు. కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల విచ్చలవిడి ఫీజుల వల్ల ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో విద్య ఎంతో ఖర్చుతో కూడుకున్నదిగా మారిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో పేదలకు భారంగా ఉన్న విద్యను సులభతరం చేసేందుకు, ప్రైవేటు విద్య కంటే నాణ్యమైన, విలువైన విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ 'మన బస్తీ-మన బడి'కి శ్రీకారం చుట్టారని తెలిపారు. ముందుగా బడులను బాగు చేసి అన్ని వర్గాల వారికి ప్రభుత్వ బడులపై నమ్మకం, విశ్వాసం కలిగించడమే సీఎం ఉద్దేశమన్నారు.

స్కూళ్లల్లో కరెంటు కట్ చేయొద్దు

స్కూలు గేటు మొదలు ప్రహరీ గోడ, స్కూల్లో ఫర్నిచర్, మంచినీటి సదుపాయం, మూత్రశాలలు ఇలా ప్రతి ఒక్క సౌకర్యంపై దృష్టి సారిస్తామని తలసాని తెలిపారు. కరెంట్ బకాయిలు కారణంగా ఏఒక్క ప్రభుత్వ స్కూల్లో కరెంట్ కట్ అవడానికి వీలు లేదన్నారు. విద్యుత్ శాఖ, విద్యాశాఖ రెండూ ప్రభుత్వ శాఖలే కాబట్టి..ఈ రెండు శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలే గానీ కరెంట్ సరఫరా నిలుపుదల చేయకూడదన్నారు. ఈ విషయంలో విద్యాశాఖ కార్యదర్శి, కమిషనర్, డీఈఓలు అవసరమైతే నేరుగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడాలని మంత్రి సూచించారు.

ఆపన్నుల సేవకు మరిన్ని అవకాశాలివ్వమని ప్రార్థిస్తా

- టీటీడీ మాజీ ఎగ్జిక్యూటివ్ అధికారి కుమారస్వామిరెడ్డి
- 'ఏ లైఫ్ ఇన్ సివిల్ సర్వీస్'గా స్వీయచరిత్ర
- పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దువ్వూరి సుబ్బారావు, కుమారస్వామిరెడ్డి, నరసింహప్ప

సాక్షి, హైదరాబాద్: దైవానుగ్రహం వల్లే తాను ఇంతకాలం బతకగలిగానని, సమాజానికి చేతనైనంత సేవ చేయగలిగానని మాజీ ఐఏఎస్ అధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.కుమారస్వామిరెడ్డి అన్నారు. పుట్టడమే తక్కువ బరువు, ఆ తర్వాత హెపటైటిస్, అతిసారా బారిన పడ్డ తాను ఎలా బతికి బట్టకట్టగలిగానో ఇప్పటికీ అర్థం కాదని, కానీ సివిల్ సర్వెంట్‌గా చేపట్టిన ప్రతి హోదాలోనూ ముద్ర వేశానన్న తృప్తి తనకుందన్నారు. 'ఏ లైఫ్ ఇన్ ద సివిల్ సర్వీస్' 'పేరుతో కుమారస్వామిరెడ్డి రాసిన స్వీయచరిత్ర పుస్తకాన్ని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ 'బధిరుల కోసం తిరుపతి, హైదరాబాద్‌లో 'శ్రవణ'పేరుతో శిక్షణ కేంద్రాలు నడుపుతున్నామని, వాటిల్లోని 150 మంది పిల్లలు వృద్ధిలోకి వస్తుండటం చూస్తే ఎంతో సంతృప్తి కలుగుతోందన్నారు. పుట్టిన ప్రతి వెయ్యిమందిలో నలుగురు బధిరులుగా ఉంటారని, మెటర్నిటీ ఆసుపత్రుల్లోనే పరీక్షలు నిర్వహించి వారిని గుర్తించేందుకు 'శ్రవణ' ప్రయత్నిస్తోందని తెలిపారు.

నేర్చుకున్న అంశాలెన్నో: దువ్వూరి

కుమారస్వామిరెడ్డితో తనకు దశాబ్దాల అనుబంధం ఉందని, ఆయన జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని దువ్వూరి సుబ్బారావు అన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ కుమారస్వామిరెడ్డి తన పుస్తకంలో ప్రస్తావించిన అంశాలు ఒక ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో నేర్చుకున్న పాఠాలను గుర్తు చేశాయన్నారు. అమెరికా, యూరప్‌లోని బ్యాంకుల సంక్షోభం ప్రభావం భారత బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందనే అంశంపై ఆయన స్పందిస్తూ 'జాగ్రత్తగా ఉండాలి. భారత బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితం. ద్రవ్య లభ్యత సరిపడా ఉంది. రూపాయి మీద ఒత్తిడి ఉన్నప్పటికీ ద్రవ్యలోటు నియంత్రణలో ఉంది. సరిపడా విదేశీ మారక నిల్వలు ఉన్నాయి'అని వివరించారు. కుమారస్వామిరెడ్డి మనవరాలు అర్చన వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మాజీ ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ నరసింహప్ప పాల్గొన్నారు.

చిలుకూరులో వెయ్యేళ్ల నాటి శివాలయం

రాష్ట్రకూటుల శైలి నిర్మాణంగా గుర్తింపు



శివాలయాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు అనగానే అందరికీ బాలాజీ దేవాలయం గుర్తుకొస్తుంది. హైదరాబాద్ నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. అమెరికా వెళ్లాలనుకునే యువత ప్రదక్షిణలతో నిత్యం ఈ ఆలయం రద్దీగా ఉంటుంది. వీసా బాలాజీ అంటూ వారు పిలుచుకుంటుంటారు. చిలుకూరు బాలాజీ దేవాలయం చేరువలోనే మరో అత్యంత పురాతన శివాలయం ఉందని, ఈ ప్రాంతాన్ని పాలించిన రాష్ట్రకూటుల కాలం నాటిదని తాజాగా చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. స్థానికులు దానికి సున్నం వేసి పూజాదికాలు నిర్వహిస్తున్నప్పటికీ, అది బాగా శిథిలావస్థకు చేరుకుంది. తాజాగా శివనాగిరెడ్డి 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ'కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చారిత్రక ఆనవాళ్లపై పరిశోధించారు. ఈ సందర్భంగా ఈ శివాలయాన్ని పరిశీలించి, నిర్మాణ శైలి, అందులోని విగ్రహాల శైలి ఆధారంగా అది వెయ్యేళ్ల క్రితం నాటిదని తేల్చారు. ఆలయ అధిష్ఠానం ఇప్పటికే భూమిలోకి కూరుకుపోయిందని, ఆలయ రాళ్ల మధ్య పగుళ్లేర్పడి విచ్చుకుపోతున్నాయని, శిఖరభాగంలోని రాళ్లు దొర్లిపోతున్నాయని పేర్కొన్నారు. 9-10 శతాబ్దాల్లో నిర్మించిన ఈ ఆలయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.

జైన బసదిగా విలసిల్లిన గ్రామం

వేములవాడ చాళుక్యుల కాలంలో ఈ గ్రామం జైన బసదిగా విలసిల్లిందని, ఇక్కడ అద్భుత జైన నిర్మాణాలుండేవని, ఇక్కడి కొన్ని శిల్పాలు ప్రస్తుతం గోల్కొండలోని ఖజానా బిల్డింగ్ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయని, ఇప్పటికీ గ్రామంలోని చాలా ప్రాంతాల్లో జైన శిల్పాలు కనిపిస్తున్నాయని శివనాగిరెడ్డి చెప్పారు. రాష్ట్రకూటుల శైలి శివాలయం పక్కన కూడా జైన శిల్పముందన్నారు. గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న భైరవ, వీరుల, నాగదేవత, భక్తురాలి శిల్పాలను సరిగ్గా ప్రతిష్ఠించాలని, చెరువుకట్ట వద్ద ఉన్న పురాతన మండపాన్ని కూడా పునరుద్ధరించాలని సూచించారు.

అంతర్జాతీయ వేదికపై మెరిసిన అగ్గిపెట్టె చీర

నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్‌కు గుర్తింపు



అగ్గిపెట్టెలో ఇమిడే చీర గురించి వివరిస్తున్న రాధిక

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తయారైన అగ్గిపెట్టెలో ఇమిడే చీర అంతర్జాతీయ వేదికపై మెరిసింది. సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో ఇమిడి, కట్టుకోవడానికి వీలుగా ఉండే పట్టుచీరను నేశారు. ఆ చీరను ఆస్ట్రేలియాలో ఉండే ఎన్‌ఆర్‌ఐ రాధిక కొనుగోలు చేసి ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్‌లో ప్రదర్శించారు. పట్టుదారం పోగులతో 100 గ్రాముల బరువు, 5.500 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో అగ్గిపెట్టెలో ఇమిడేలా చీరను విజయ్‌కుమార్ మరమగ్గం (పవర్‌లూమ్)పై నేశాడు. ఆ చీరను రాధిక ప్రదర్శించి సిరిసిల్ల నేత కళాకారుల నైపుణ్యాన్ని అంతర్జాతీయ వేదికపై గుర్తింపు తీసుకొచ్చారు.

టార్గెట్ రూ.4,953 కోట్లు.. వచ్చింది రూ.6,055 కోట్లు



- రవాణ శాఖకు రికార్డుస్థాయి ఆదాయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రవాణా శాఖ గతంలో ఎన్నడూ లేనంత భారీ ఆదాయాన్ని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 17వ తేదీ నాటికి రూ.6,055 కోట్ల రెవెన్యూతో కొత్త రికార్డు సృష్టించింది. మార్చి నెలాఖరుకు ఈ మొత్తం రూ.6,285 కోట్లకు చేరుతుందని రవాణా శాఖ అంచనా వేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4,953 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, దానికి మించి రూ.వెయ్యి కోట్ల కంటే ఎక్కువ ఆదాయం సమకూరింది. గతేడాది ఈ మొత్తం రూ.3,971 మాత్రమే కావటం గమనార్హం. ఖజానాను నింపే శాఖలపై ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆదాయాన్ని పెంచేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. సంక్షేమ పథకాల అమలుకు కావాల్సిన ఆదాయాన్ని సమకూర్చుకునే క్రమంలో ప్రభుత్వం, మంత్రుల కమిటీని కూడా ఏర్పాటు చేసి వరుస సమీక్షలతో అధికారులను పరుగెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో, రవాణా శాఖ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ సహా కొన్ని ట్యాక్స్‌లను పెంచి మరీ ప్రభుత్వ ఖజానాకు మెరుగైన మొత్తాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంది. కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్లుగా ట్రాన్స్‌పోర్టు వాహనాల యజమానులు పన్నులు సరిగా కట్టడం లేదు. ప్రస్తుతం అలాంటి వారిని గుర్తించి బకాయి పడ్డ పన్నులు సహా పెనాల్టీలను వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు రూ.54.21 కోట్ల పన్ను బకాయిలు, రూ.9.37 కోట్ల పెనాల్టీలు వసూలు చేశారు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఆ సంఖ్య 1.53 కోట్లకు చేరుకుంది. విలాసవంతమైన వాహనాల సంఖ్య కూడా బాగా పెరిగింది. వాహనాల లైఫ్ ట్యాక్స్ రూపంలో ఆదాయం భారీగా పెరిగింది. ఇక ఫ్యాన్సీ నంబర్ల వేలాన్ని కూడా రవాణాశాఖ ప్రోత్సహిస్తోంది. లైఫ్ ట్యాక్స్ రూపంలో రూ.4,401.75 కోట్లు, త్రైమాసిక పన్ను రూపంలో రూ.825.28 కోట్లు, ఫీజుల రూపంలో రూ.527.78 కోట్లు, యూజర్ చార్జీల రూపంలో రూ.129.10 కోట్లు, డిటెక్షన్ పద్దు ద్వారా 171.09 కోట్లు సమకూరింది. శనివారం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. రవాణా శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, జేటీసీలతో ఆదాయంపై సమీక్షించారు. లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించిపెట్టినందుకు అధికారులను మంత్రి అభినందించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943